
శతారుణ గీతాంజలి
రూ॥180/-
పేజీలు:180
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM సిటీ


పుణెలో దారుణం.. నాలుగేళ్ల చిన్నారిపై 65 ఏళ్ల వృద్ధుడి హత్యాచారం

కేరళలో హోటల్ యజమానుల నిరసనలు

తగ్గిన అరెస్టులు... పెరిగిన దాడులు!

07


సంపుటి 28, సంచిక: 309 | ఆదివారం | 03-05-2026 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00




తక్షణమే చెరువుల పునరుద్ధరణ పనులు

నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

3లో




'నీట్' కేంద్రాల వద్ద 163 సెక్షన్

జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు క్లోజ్!

3లో



కొనుగోలు కేంద్రాల ప్రక్రియ వేగవంతం చేయాలి

రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ

3లో



## 14న అండమాన్‌కు 'నైరుతి' రాక

● ఈ ఏడాది ముందస్తుగా రుతుపవనాలు ● ఈనెలలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం

● పగలూ, రాత్రి వేడి ఎక్కువే : ఐఎండి

**న్యూఢిల్లీ :** దేశంలో భగభగ మండుతున్న ఎండల నుంచి త్వరలో ఉపశమనం లభించనుందని భారత వాతావరణ కేంద్ర (ఐఎండి) తెలిపింది. నైరుతి రుతుపవనాలు ఈసారి ముందుగానే వచ్చే అవకాశం ఉందని, ఈ నెల 14 నుంచి 16 మధ్య రుతుపవనాలు అండమాన్ నికోబార్ దీవులను తాకే అవకాశం ఉందని ప్రకటించింది. ఇది సాధారణ సమయం కంటే కొంత ముందేనని ఆ ప్రకటనలో పేర్కొన్నది. నైరుతి రుతుపవనాలు ముందే రానుండటంతో దేశవ్యాప్తంగా సగటు వర్షపాతం సాధారణం

తరువాయి 8లో

## బీమాకు ఇక ధీమా లేదు

100 శాతం ఎఫ్‌డిఐకి మోదీ సర్కారు అనుమతి

ఎల్‌ఐసికి పాత నిబంధనలే వర్తింపు

విదేశీ పెట్టుబడులు 20 శాతానికే పరిమితం



**న్యూఢిల్లీ:** బీమా కంపెనీలలో 100 శాతం ఎఫ్‌డిఐకి సర్కారు అనుమతిచ్చింది. ఆటోమేటిక్ రూట్ ద్వారా విదేశీ కంపెనీలు భారతీయ బీమా సంస్థలలో పూర్తి వాటాను పొందే అవకాశం కల్పించింది. అయితే ఈ పెట్టుబడులు 'బీమా చట్టం 1938' కు లోబడి ఉండాలి. ఐఆర్‌డిఎఐ నుంచి అవసరమైన లైసెన్సులు లేదా ఆమోదాలు పొందాల్సి ఉంటుంది. ఈ మేరకు ఆర్థిక శాఖ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఎల్‌ఐసిలో మాత్రం ఈ తరహా పెట్టుబడులను 20 శాతానికి పరిమితమని కూడా ఆర్థిక శాఖ తన ప్రకటనలో స్పష్టం చేసింది. ఎల్‌ఐసికి పాత నిబంధనలే వర్తిస్తాయి. విదేశీ పెట్టుబడులు 20 శాతానికే పరిమితమయ్యాయి. ఇది ఎల్‌ఐసి చట్టం 1956 నిబంధనలకు అనుగుణంగా ఉంటుంది. ఇతర ప్రైవేట్ బీమా కంపెనీలతో పోలిస్తే ఎల్‌ఐసీకి ప్రత్యేక కార్యాచరణ కొనసాగుతుంది. విదేశీ పెట్టుబడులు పెరిగినప్పటికీ, కంపెనీలపై నియంత్రణ భారతీయ పౌరుల చేతుల్లోనే ఉండేలా కొన్ని కీలక నిబంధనలు విధించారు. బీమా కంపెనీలో చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్, లేదా సీఈఓలో కనీసం ఒకరు కచ్చితంగా భారత్‌లో ఉండాలి. ఇది కీలక నిర్ణయాధికారాల్లో దేశీయ ప్రయోజనాలను కాపాడటానికి సహాయపడుతుంది. బీమా కంపెనీలతో పాటు ఈ రంగంలోని మధ్యవర్తులకు 100 శాతం ఎఫ్‌డీఐ

తరువాయి 12లో

## జూన్ 1 లోపు ఉద్యోగులకు ఆరోగ్య భద్రత

వంద రోజుల్లో రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్‌కు రూ.6వేల కోట్ల నిధులిస్తాం

పిఆర్‌సి నివేదికను తక్షణమే ప్రభుత్వానికి సమర్పించాలి

నివేదిక ఆధారంగా నిర్ణయం తీసుకుంటాం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ

ఉద్యోగ సంఘాల జెఎసి నాయకులతో భేటీ

పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ సమస్యలను చాలా పరిష్కరించాం : భట్టి

5న నిర్వహించనున్న నిరసన కార్యక్రమాలు ఉపసంహరణ

ఉద్యోగ సంఘాల జెఎసి ప్రకటన



ప్రజాపక్షం/హైదరాబాద్

ఉద్యోగుల పిఆర్‌సి నివేదికను తక్షణమే ప్రభుత్వానికి సమర్పించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి 'పిఆర్‌సి కమిటీ'ని ఆదేశించారు. ఆ నివేదిక ఆధారంగా నిర్ణయం తీసుకుంటామని, ప్రభుత్వ ఉద్యోగులకు జూన్1వ తేదీ లోపు 'ఆరోగ్య భద్రత' కార్డులను అందజేస్తామని వెల్లడించారు. వంద రోజుల్లో ఉద్యోగుల రిటైర్ మెంట్ బెనిఫిట్స్ నిమ్మితం రూ.6 వేల కోట్ల నిధులను చెల్లిస్తామని, ఆ నిధులను ఖర్చు చేసే ప్రధాన్యత అంశాలు 'మీదే' అని ఉద్యోగ సంఘాలకు సిఎం సూచించారు. తెలంగాణ ఉద్యోగ సంఘాల జెఎసి, తెలంగాణ ఎంప్లాయీస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ నాయకులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ లోని తన నివాసంలో శనివారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క,ఎంపిలు వేం నరేందర్ రెడ్డి,

తరువాయి 8లో

## అక్రమ కార్యకలాపాలు 184 ప్రొఫైల్స్ తొలగింపు

6 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ ప్రమోషన్లు, నకిలీ పెట్టుబడి మోసాలపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. సోషల్ మీడియాలో అక్రమ కార్యకలాపాలను అడ్డుకునే క్రమంలో ఏప్రిల్ నెలలోనే 184 ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ప్రొఫైల్స్‌ను గుర్తించి తొలగించారు. ఈ ప్రొఫైల్స్ ద్వారా అమాయకులను లక్ష్యంగా చేసుకుని 801 పెయిడ్ ప్రకటనలు నడిపినట్లు పోలీసులు వెల్లడించారు. డిజిటల్ పర్యవేక్షణ, ఇంటెలిజెన్స్ ఆధారిత ట్రాకింగ్ ద్వారా ఈ అక్రమ నెట్‌వర్క్‌ను బయటపెట్టిన సైబర్ క్రైమ్ యూనిట్, సులభంగా డబ్బు సంపాదించవచ్చని చెప్పి ప్రజలను

తరువాయి 8లో

'పాంచజన్యం' అమలు చేస్తాం

## మాట తప్పితే రాళ్లతో కొట్టండి

కెసిఆర్ చర్యల వల్ల రాష్ట్రంలో రెండు జనరేషన్‌లు నష్టపోయాయి

ఎలాంటి నోటీసు ఇవ్వకుండా బిఆర్‌ఎస్ నన్ను సస్పెండ్ చేసింది

వివరణ కూడా అడగలేదు

అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న రోహిత్ రెడ్డికి మాత్రం షోకాజ్ నోటీసులిచ్చారు

బిఆర్‌ఎస్ హయాంలో జరిగిన అవినీతి అక్రమాలను కెసిఆర్ దృష్టికి తీసుకెళ్లినా చర్యల్లేవ్

'మీట్ ది ప్రెస్'లో టిఆర్‌ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

ప్రజాపక్షం/హైదరాబాద్




అధికారంలోకి వచ్చిన తర్వాత తమ పార్టీ ప్రకటించిన 'పాంచజన్యం'లోని ఐదు అంశాల అమలు, ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాల విషయంలో తాను ఇచ్చిన మాట తప్పితే హైదరాబాద్‌లోని అమరవీరుల స్తూపం వద్ద తనను స్తంభానికి కట్టేసి రాళ్లతో కొట్టాలని 'తెలంగాణ రక్షణ సేన' (టిఆర్‌ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు. అన్ని విషయాల్లో సాధ్యాసాధ్యాలను పరిశీలించిన తర్వాతే తాము హామీలనిచ్చామన్నారు. ఆరోగ్య శ్రీ, విద్యార్థులకు ఉచిత భోజనంలాంటి పథకాన్ని ప్రారంభించినప్పుడు కూడా

తరువాయి 12లో



## రేపు కేబినేట్

● మధ్యాహ్నం 3 గంటలకు సచివాలయంలో సమావేశం

● సంక్షేమ పథకాల అమలు, ఆర్థిక పరిస్థితి, బడ్జెట్ అనుసరణపై సమీక్ష

● జెడ్‌పిటిసి ఎంపిటిసి ఎన్నికలు, భూముల విలువ పెంపు, కాళేశ్వరం పునరుద్ధరణపై చర్చించే అవకాశం

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల 4వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరగనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. రాష్ట్రంలోని ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ఆర్థిక పరిస్థితి, బడ్జెట్ అనుసరణ, అలాగే పెండింగ్‌లో ఉన్న కీలక ఫైళ్లపై మంత్రివర్గం సమీక్ష చేపట్టనున్నట్లు

తరువాయి 12లో

## బతుకమ్మకుంట ముమ్మాటికీ చెరువే



చారిత్రక ఆధారాలున్నాయ్

వరద నివారణ చర్యలు చేపట్టేందుకు కోర్టు అనుమతించింది

హైకోర్టు డివిజన్ బెంచ్ ఆదేశాలను గౌరవిస్తాం

హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ అంబర్‌పేట్‌లోని బతుకమ్మ కుంట ముమ్మాటికీ చెరువే అని హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్ స్పష్టం చేశారు. చెరువు ఉనికిని నిర్ధారించే పలు చారిత్రక, సాంకేతిక ఆధారాలను ఆయన మీడియా ముందుంచారు. హైడ్రా కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో రంగనాథ్ మాట్లాడుతూ 1970ల సర్వే ఆఫ్ ఇండియా రికార్డులు, 1975 ఇరిగేషన్, రెవెన్యూ పత్రాలు, 1990 నాటి నాసా శాటిలైట్ చిత్రాలన్నీ బతుకమ్మ కుంటను చెరువుగానే చూపిస్తున్నాయని తెలిపారు. సర్వే నెంబర్ 563/1లో సుమారు 9 నుంచి 10 ఎకరాల మేర

తరువాయి 12లో



## పేలిన ఐఇడి

● డిఆర్‌జి సహా నలుగురు జవాన్ల మృతి ● మావోయిస్టులు పాతిపెట్టిన మందుపాతర నిర్వీర్యం చేస్తుండగా ఘటన

**కాంకేర్ :** ఛత్తీస్‌గఢ్ నారాయణ్‌పూర్ జిల్లా సరిహద్దు సమీపంలో మావోయిస్టులు గతంలో పాతిపెట్టిన మందుపాతర (ఐ.ఇ.డి)లను తొలగించే ప్రక్రియలో శనివారం పెను ప్రమాదం చోటుచేసుకుంది. మందుపాతర పేలిపోవడంతో కాంకేర్ జిల్లా రిజర్వుగార్డు ఇన్‌స్పెక్టర్ (డిఆర్‌జి) సుఖ్‌రామ్ వట్టి (40) నాయకత్వానగల నలుగురు పోలీసు బృందం ప్రాణాలు కోల్పోయింది. సుఖ్‌రామ్‌తోపాటు జిల్లా దళానికి చెందిన కానిస్టేబుల్ కృష్ణ కోమ్రా (35), బస్తర్ ఫైటర్స్‌కు చెందిన కానిస్టేబుల్ సంజయ్ గఢ్వాలే (29) పేలుడు ధాటికి అక్కడికక్కడే మరణించారు. తీవ్రంగా

తరువాయి 8లో

భగత్‌సింగ్ కలల స్ఫూర్తితో ఏఐవైఎఫ్ ఆవిర్భావ చరిత్ర

02

ఇరాన్‌కు సుంకం చెల్లిస్తే

## ఆంక్షలు తప్పవ్

షిప్పింగ్ సంస్థలకు ట్రంప్ హెచ్చరిక

ఇరాన్ నుంచి ఆమోదయోగ్య ఒప్పందం కోరుతున్నామని వెల్లడి

ఆ దేశం ప్రతిపాదించిన మూడు అంశాలను తిరస్కరించామని వ్యాఖ్య



**దుబాయ్/వాషింగ్టన్ :** హోర్ముజ్ జలసంధిని సురక్షితంగా దాటి వెళ్ళేందుకు ఇరాన్‌కు సుంకం చెల్లిస్తే ఆంక్షలు ఎదుర్కోవాల్సి వస్తుందని షిప్పింగ్ సంస్థలకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరిక చేశారు. అమెరికా విదేశీ ఆస్తుల నియంత్రణ కార్యాలయం మేరకు శనివారం ఒక పోస్టింగ్ పెట్టింది.ఈ హెచ్చరిక ద్వారా ఇరాన్‌పై ఆర్థికపరమైన ఒత్తిడి మరింత పెంచేందుకు మరో కొత్త షరతును తెరమీదకు తెచ్చింది. ప్రపంచదేశాలకు అవసరమైన చమురు, సహజ వాయువులో ఐదోవంతు హోర్ముజ్ నుండే సరఫరా జరుగుతుంది. దీంతో కొన్ని వందల నౌకలు రెండు నెలలుగా సమస్యలు ఎదుర్కొంటున్నాయి. ప్రపంచ దేశాలలో చమురు సంక్షోభం కొనసాగుతోంది. ఫిబ్రవరి 28న అమెరికా దాడి చేసి ఆయెతొల్లా అలీ ఖమేనీ సహా ఆయన భార్య, కుమార్తె, అల్లుడు,మనవరాలు,కోడలు,ఇతర ఉన్నతాధికారులను గగనతల బాంబుదాడుల్లో హతమార్చింది. అప్పటినుండీ ఇరాన్ హోర్ముజ్ జలసంధిని చాలా

తరువాయి 8లో

## కొనుగోలు కేంద్రాల్లో నిలిచిన ధాన్యం

గన్నీ బ్యాగుల కొరతతో కాంటాలు వేయని పరిస్థితి

లారీలు ఎప్పుడొస్తాయో తెలియక అయోమయంలో రైతులు

అకాల వర్షాలతో ఆకాశంవైపు చూస్తూ ఆందోళన చెందుతున్న అన్నదాత



ప్రజాపక్షం/జనగామ

రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల్లో ఎక్కడికక్కడే నిలిచిపోయింది. కొన్నిచోట్ల అడపాదడపా కాంటాలు వేస్తున్నా, అనేక చోట్ల అలాంటి పరిస్థితే కనిపించడం లేదు. ఒకవైపు గన్నీ బ్యాగులు లేక, మరోవైపు లారీలు ఎప్పుడు వస్తాయో, రావో తెలియక రైతులు అయోమయంలో పడ్డారు. అధికారుల నుండి సమాధానమూ ఉండడం లేదు. ఇంకోవైపు అకాల వర్షాలు ఎప్పుడు వస్తాయోనని ఆకాశం వైపు చూస్తూ ఆందోళన చెందుతున్న పరిస్థితి నెలకొంది. పూర్తి స్థాయిలో నూర్పిడి జరిగి అమ్మకానికి కొనుగోలు కేంద్రానికి తెస్తే కొనేవాడు దిక్కులేకపోవడంతో రైతులు కన్నీరు పెడుతూ అయ్యా కొనండి అంటూ అధికారులను వేడుకుంటున్నారు. కాగా జనగామ జిల్లాలో ఈ ఏడాది యాసంగి ధాన్యం అత్యధికంగా దిగుబడి అయ్యింది. రెండు లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందని అంచనా వేసిన అధికారులు జిల్లాలో 236 ఐకెపి, సివిల్ సప్లయ్ కొనుగోలు కేంద్రాలకు ప్రణాళిక సిద్ధం చేశారు. దాదాపు

తరువాయి 8లో




## ఖరీదైన ద్రావకం..



ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన ద్రావకం ఏది? చాలామంది ఊహకు కూడా అందని విధంగా, అది ఒక తేలు విషం.'డెత్‌స్టాకర్' (శాస్త్రీయ నామం లీరస్ క్విన్‌క్వెస్ట్రియాటస్)గా పలిచే ఈ విషం పాలెస్తీనా పసుపు తేళ్లలో ఉంటుంది. దీని విషం లీటర్ సుమారుగా 39 మిలియన్ డాలర్లు (సుమారు రూ.344 కోట్లు) పలుకుతుందని అంటున్నారు. అత్యంత అరుదుగా కనిపించే పసుపు తేలు నుంచి విషాన్ని తీయడం మరింత అరుదు. గ్యాలన్లు.. లీటర్ల ప్రసక్తి ఉండదు. కేవలం మైక్రోగ్రాముల్లో మాత్రమే ఈ విషాన్ని సేకరిస్తారు. అత్యంత నైపుణ్యం ఉన్నవారే ఈ తేలు నుంచి విషాన్ని తీయగలుగుతారు. ఇటీవల కాలంలో రోబోట్‌లను వాడుతున్నారు. డెత్‌స్టాకర్ విషంలో క్లోరోటాక్సిన్ అనే పదార్థం ఉంటుంది. ఇది గ్లియోమా లాంటి కేన్సర్, బ్రెయిన్ ట్యూమర్ కణాలను సమర్థవంతంగా అరికడుతుంది. అంతేగాక, విపరీతమైన నొప్పిని కూడా నియంత్రిస్తుంది. కేన్సర్ కణాలను గుర్తించడానికి ఉపయోగపడుతుంది. జీవ వైద్య పరిశోధనల్లో ఉపయోగపడుతుంది కాబట్టే ఈ విషానికి అంత డిమాండ్.

## ప్లాస్టిక్ స్థానంలో నాచు!



నీటి వనరుల్లో నాచు విరివిగా లభిస్తుంది. ఇక సముద్ర ప్రాంతాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ నాచును ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా వాడవచ్చని నిరూపిస్తున్నది లండన్‌కు చెందిన స్టార్టప్ కంపెనీ 'నోప్లాల్'. సముద్ర శైవలాలు లేదా నాచుతో తయారైన చిన్న నీటి బుడగల రూపంలో నీటిని అందిస్తున్నది. ఈ నీటిని నేరుగా తాగవచ్చు, ఒక వేళ పారేసినా పర్యావరణానికి ఎలాంటి హానీ ఉండదు. ఎందుకంటే ఇవి కొద్ది వారాల్లోనే, సహజసిద్ధంగా కరిగిపోతాయి. ప్రతిష్టాత్మక లండన్ మారథాన్‌తోపాటు, ప్రపంచ వ్యాప్తంగా కొన్ని పెద్దపెద్ద కార్యక్రమాల్లో ఈ నీటి బుడగ ల వినియోగాన్ని ప్రయోగాత్మకంగా నిర్వహించారు. వేల సంఖ్యలో ప్లాస్టిక్ బాటిల్స్‌ను వాడకుండా, ఈ కొత్త నీటి వనరులు ఉపయోగపడ్డాయి. నాచు సముద్రంలో విపరీతం గా లభిస్తుంది కాబట్టి, సులభంగానూ, చౌకగానూ దొరుకుతుంది. సాధారణ ప్లాస్టిక్ బాటిల్ కరగడానికి వందల ఏళ్లు పడుతుంటే, వీటిని పారేసినా సహజంగా 4 నుంచి 6వారాల్లో కరిగిపోతాయి. పూర్తిగా తినదగిన పదార్థం కావడంతో మన శరీరానికి హాని ఉండదు. ఇవి కేవలం నీళ్ళకే కాకుండా, ఇతర పానీయాలు, సాస్‌లు, ఇంకా కొన్ని లిక్విడ్ ఆహార పదార్థాలు ప్యాక్ చేయడానికి కూడా వాడుకునే అవకాశాలున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రతి నిమిషం దాదాపు 1 మిలియన్ ప్లాస్టిక్ బాటిళ్లు అమ్ముడవుతున్నాయి. వాటిలో చాలా రీసైకిల్ కాదని, చివరికి సముద్రాల్లో కలసి కాలుష్యం పెంచుతున్నాయి. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా నాచు వాడకం వంటి ఆవిష్కరణలు ఈ సమస్యను బాగా తగ్గిస్తాయి. ఒక్క మాటలో చెప్పాలంటే, ఇది సాధారణ ఆవిష్కరణ కాదు, భవిష్యత్తులో ప్లాస్టిక్‌ను పూర్తిగా తొలగించవచ్చనే ఆలోచనకు ఒక గొప్ప సంకేతం.

## సముద్రంలో కరిగిపోయే ప్లాస్టిక్!



జపాన్ శాస్త్రవేత్తలు సముద్ర నీటిలో కరిగిపోయే కొత్త ప్లాస్టిక్‌ను సృష్టించారు. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం, ఈ ప్లాస్టిక్ సముద్రంలో కొన్ని గంటల్లోనే కరిగిపోతుంది. తద్వారా ప్లాస్టిక్ కాలుష్యం నుంచి పర్యావరణానికి మేలు జరుగుతుంది. టోక్యో విశ్వవిద్యాలయంలో ఉన్న జాతీయ పరిశోధన, అభివృద్ధి సంస్థ 'రికెన్' కేంద్రంలో పరిశోధనలు చేస్తున్న శాస్త్రవేత్తల బృందం ఈ కొత్త బయోడిగ్రేడబుల్ ప్లాస్టిక్‌ను అభివృద్ధి చేశారు. ఈ ప్లాస్టిక్‌ను ప్రధానంగా జీవ సంశ్లేషిత పదార్థాలతో తయారు చేస్తారు. అందుకే ఇది పర్యావరణ హితంగా ఉంటుంది. ఈ ప్లాస్టిక్‌ను ఉప్పు నీటిలో కలిపితే, సుమారు 12 గంటల్లో ఇది పూర్తిగా కరిగిపోతుంది. ఎటువంటి మైక్రోప్లాస్టిక్స్ లేదా విషవంతమైన అవశేషాలు మిగలవు. ఇది నేలలోపడిన సుమారు 10రోజులకు పూర్తిగా కరిగి పోతుంది.

కరిగే సమయంలో ఉపయోగకరమైన పోషకాలుగా మారుతుంది, నేల ఆరోగ్యం మెరుగవుతుంది. సాధారణ ప్లాస్టిక్ మాదిరి ఇది విష రసాయనాలు ఉత్పత్తి చేయదు. కార్బన్ డయాక్సైడ్‌ను విడుదల చేయదు. పైగా నేల పచ్చదనాన్ని, మట్టి పోషక విలువలను పెంచుతుంది. సముద్రాల్లో నిత్యం పెరుగుతున్న ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడానికి ఇది బాగా ఉపయోగపడుతుంది. అంతేగాక, భూమిపైన విచ్చలవిడిగా పారవేస్తున్న ప్లాస్టిక్ వల్ల భూమి నాణ్యత కు ఏర్పడే నష్టాన్ని నివారిస్తుంది. మానవాళికి దీర్ఘకాల ప్రయోజనాలను అందిస్తుంది. ఈ బయోడిగ్రేడబుల్ ప్లాస్టిక్ విస్తృతంగా మార్కెట్‌లోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**– బిఎస్ఎస్ మైత్రేయి**

# కాంగ్రెస్‌కు కేరళ తలనొప్పి

'ఆలూ లేదు.. చూలూ లేదూ' అన్నట్లుగా ఉంది కేరళ కాంగ్రెస్ నాయకుల వ్యవహారం. శాసనసభ ఎన్నికల ఫలితాలు రాక ముందే తామంటే తామే ముఖ్యమంత్రి అంటూ వారు ఊహల పల్లకీలలో విహరిస్తున్నారు. కేరళ శాసనసభ ఎన్నికలు ఏప్రిల్ 9న జరిగాయి. వాటికి సంబంధించిన ఎగ్జిట్ పోల్ వివరాలు ఏప్రిల్ 29న పశ్చిమ బెంగాల్‌లో తుది విడత పోలింగ్ పూర్తవగానే విడుదలయ్యాయి. కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని ఐక్య ప్రజాతంత్ర సంఘటనకు (యుడిఎఫ్)కు స్వల్ప ఆధిక్యతను చూపాయి. వరుసగా రెండు సార్లు అధికారంలో ఉన్నందున వామపక్ష ప్రజాతంత్ర సంఘటన (ఎల్‌డిఎఫ్)పట్ల విముఖతతో తమకు ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు పడతాయనే ఒకే అంశం ప్రాతిపదికగానే వారు అధికారంలోకి కాంగ్రెస్ నేతలు ఆశిస్తున్నారు

కేరళ కాంగ్రెస్ అంటేనే ముఠా తగాదాలకు నిలయం. అలనాడు కరుణాకరన్, ఎ.కె.ఆంథోని మొదలు నేటికీ ఆ పరంపర కొనసాగుతోంది. ఆ పార్టీలో ప్రధానంగా నలుగురు ముఖ్యమంత్రి పదవి కోసం పోటీ పడుతున్నారు. వారిలో ప్రతిపక్ష నాయకుడు వి.డి.సతీశన్, సీనియర్ నేత రమేశ్ చెన్నితల, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్‌లతో పాటు, అవకాశం వస్తే ఒక ప్రయత్నం చేద్దామనుకుంటున్న తిరువనంతపురం ఎంపి శశిథరూర్ ఉన్నారు. ఫలితాలు వెలువడే మే 4వ తేదీ సమీపిస్తుండడంతో పోటీ తీవ్రమైంది. గతంలోనే సిఎం పదవి కోసం పత్రికలు, టీవీలు, సోషల్ మీడియాలో బహిరంగ ప్రకటనలు వద్దని కాంగ్రెస్ అధిష్ఠానం చేసిన హెచ్చరికలు తుంగలో తొక్కబడ్డాయి. కాంగ్రెస్ పార్టీలో విద్యార్థి దశ నుంచి జాతీయ నాయకుడిగా రమేశ్ చెన్నితల ప్రస్థానంతో కూడిన ఫుల్ పేజీ అడ్వర్టయిజ్‌మెంట్‌ను ఒక ఆంగ్లదినపత్రికలో వేశారు. దాంతో తమ నాయకుడికేమి సంబంధం లేని చెన్నితల కార్యాలయం, ఆయన మద్దతుదారులు చెప్పినా లోగుట్టు బహిరంగ రహస్యమే. ఇది కాంగ్రెస్‌లో వివాదానికి దారి తీసింది.

ఈ వ్యవహారంపైకి ముఖ్యమంత్రి పదవిని తీవ్రంగా ఆశిస్తున్న సతీశన్ ఆగ్రహంగా ఉన్నట్లు చెబుతున్నారు. ఆయనకు మద్దతుగా ఐయుఎంఎల్‌ను రంగంలోకి దింపారు. ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయుఎంఎల్) రాష్ట్ర అధ్యక్షుడు బహిరంగంగానే సతీశన్ ముఖ్యమంత్రి అభ్యర్థిత్వానికి మద్దతును పలకడం సిఎం పదవికి పోటీ రసవత్తరంగా మారింది. ఎందుకంటే యుడిఎఫ్ కూటమిలో కాంగ్రెస్ తరువాత ప్రధాన భాగస్వామి.పనిలో పనిగా ఆ పార్టీ కూడా ఈసారి డిప్యూటీ సిఎం పదవిని ఆశిస్తోంది. అయితే, నేరుగా డిమాండ్ చేయడం లేదు. ఐయుఎంఎల్‌ను ప్రసన్నం చేసుకునేందుకు శశి థరూర్ ఆ పార్టీ ఆధ్వర్యంలో వయనాడ్ బాధితులకు ఇళ్ళు నిర్మించి ఇవ్వడాన్ని ప్రశంసిస్తూ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

చెన్నితల, సతీశన్‌ల వ్యవహారం వేణుగోపాల్‌ను చిరాకుపరుస్తున్నాయి. ఆయన శాసనసభకు పోటీ చేయనప్పటికీ, కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీకి అత్యంత సన్నిహితునిగా మెలుగుతున్నారు. ఆయన అనుయాయులకు పెద్ద ఎత్తున ఎంఎల్‌ఏగా పోటీ చేసేందుకు టిక్కెట్లు దక్కాయి. వేణుగోపాల్ తన సంబంధాలను ఉపయోగించి పదే పదే హెచ్చరికలు చేస్తున్నా, పట్టించుకోకుండా సిఎం పదవి కోసం పోటీపడుతున్న తీరు కాంగ్రెస్ అధిష్ఠానానికి తలనొప్పి కలిగిస్తోంది.

ఇదంతా ఒకెత్తయితే, ఎగ్జిట్ పోల్స్ యుడిఎఫ్, ఎల్‌డిఎఫ్‌ల మధ్య స్వల్ప తేడానే చూపిస్తున్నాయి. ఎగ్జిట్ పోల్స్‌లో ముఖ్యమంత్రిగా పినరయ్ విజయన్ వైపే అత్యధిక కేరళ ఓటర్లు మొగ్గుచూపడం ద్వారా ప్రభుత్వ వ్యతిరేకత ప్రతిపక్షాలు ప్రచారం చేస్తున్న స్థాయిలో లేదనే ఎల్‌డిఎఫ్ నేతలు చెబుతున్నారు. తమ ప్రభుత్వం అమలు చేసిన పథకాల ద్వారా ప్రజలు తమకు మూడవసారి అవకాశం కల్పిస్తారనే ధీమాతో ఉన్నారు. ●

### భగత్ సింగ్ కలల స్ఫూర్తితో

# ఎఐవైఎఫ్ ఆవిర్భావ చరిత్ర



డా.సయ్యద్ వలీ ఉల్లాహ్ ఖాద్రీ
రాష్ట్ర అధ్యక్షుడు,
అఖిల భారత యువజన సమాఖ్య



కల్లూరు ధర్మేంద్ర
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,
అఖిల భారత యువజన సమాఖ్య

భారత యువజన ఉద్యమ చరిత్రలో అఖిల భారత యువజన సమాఖ్య(ఎఐవైఎఫ్) స్థాపన ఒక కీలక మైలురాయి. 1959వ సంవత్సరానికి ముందు దేశవ్యాప్తంగా యువజన సంఘాలు రాష్ట్ర, జిల్లా, ప్రాంతీయ స్థాయిల్లో వేరువేరుగా పనిచేస్తున్నాయి. ఈ సంస్థల మధ్య కొంత సమన్వయం ఉన్నప్పటికీ, ఒక సమగ్ర జాతీయ వేదిక అవసరం బలంగా అనిపించింది. సామాన్య లక్ష్యాలు, సమాన ఆశయాలు పెరుగుతున్న కొద్దీ దేశవ్యాప్తంగా యువతను ఒకే జెండా కింద సమీకరించే అవసరం ఏర్పడింది.

ఈ అవసరాన్ని ముందుగా గుర్తించిన విప్లవాత్మక కమ్యూనిస్టు నాయకుడు, ఢిల్లీ ఎంసిడికి అతి పిన్న వయసులోనే కౌన్సిలర్‌గా నిలిచిన గురు రాధా కిషన్ మొదటి సమావేశాన్ని నిర్వహించేందుకు ముందడుగు వేశారు. అదే ఆలోచన తర్వాత మహత్తర ఉద్యమంగా మారింది. 1959 ఏప్రిల్ 28 నుండి మే 3 వరకు, న్యూఢిల్లీలో జరిగిన ఆవిర్భావ మహాసభలో 11 రాష్ట్రాల నుండి 250కి పైగా ప్రతినిధులు, పరిశీలకులు పాల్గొన్నారు. ఆరు రోజులపాటు జరిగిన ఈ చారిత్రాత్మక సమావేశంలో అధికారికంగా ఏఐవైఎఫ్ ఏర్పాటును ప్రకటించారు. ఈ మహాసభలో సామ్యవాద ఆలోచనలను వ్యాప్తి చేయడం, యువతను సామాజిక మార్పు దిశగా నడిపించడం ప్రధాన లక్ష్యాలుగా నిర్ణయించారు.

అంతేకాకుండా, అంతర్జాతీయ యువజన ఐక్యతకు ప్రతీక అయిన వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ డెమొక్రటిక్ యూత్ (డబ్ల్యు ఫ్‌డివై)తో అనుబంధం ఏర్పరచుకోవాలని నిర్ణయించి, ప్రపంచ యువజన ఉద్యమంలో భాగస్వామ్యం అయ్యింది. ఈ మహాసభలో ప్రముఖ సినీనటుడు, కళాకారుడు బాలరాజ్ సహాని గారిని మొదటి అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. శారదా మిత్రను ప్రధాన కార్యదర్శిగా, పి.కె.వాసుదేవన్ నాయర్ గారిని కార్యవర్గ కమిటీ చైర్మన్‌గా ఎన్నుకోవడం జరిగింది. 121 మంది సభ్యులతో కూడిన కౌన్సిల్‌ను ఏర్పరచి, అందులో నుంచి 37 మంది సభ్యులతో కార్యవర్గాన్ని ఎంపిక చేశారు.

**భగత్ సింగ్ కలల స్ఫూర్తి – ఏఐవైఎఫ్ దారి**

ఈ ఆవిర్భావం వెనుక ఉన్న స్ఫూర్తి సాధారణం కాదు — అది విప్లవ వీరుడు భగత్ సింగ్ కలల స్ఫూర్తి. భగత్ సింగ్ యువతను కేవలం దేశభక్తులుగా కాకుండా, సామాజిక మార్పుకు నాయకులుగా చూడాలని ఆశించాడు. ఆయన కలలు కనిన సమాజం — అన్యాయం లేని, అసమానతలు లేని, శోషణ రహిత భారతం.

ఏఐవైఎఫ్ ఆవిర్భావం ఆ కలలనే కార్యరూపంలోకి తీసుకురావడానికి ప్రారంభమైన ఒక గొప్ప ప్రయత్నం. యువతను చైతన్యవంతం చేసి, వారి శక్తిని సమాజ నిర్మాణానికి వినియోగించడం ఈ సంస్థ యొక్క ప్రధాన లక్ష్యం.

**ఏఐవైఎఫ్ 67వ ఆవిర్భావ దినోత్సవం – యువజన పోరాటాలకు కొత్త దిశ**

రేపు ఏఐవైఎఫ్ 67వ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకుంటున్న ఈ సందర్భం కేవలం ఒక ఉత్సవం మాత్రమే కాదు — భారత యువజన చరిత్రలో పోరాటాల పథాన్ని గుర్తు చేసుకునే, భవిష్యత్ బాధ్యతలను మరింత స్పష్టంగా స్వీకరించే చారిత్రాత్మక ఘట్టం. దేశ స్వాతంత్ర్యానంతరం యువత ఎదుర్కొన్న సమస్యలకు సమాధానం చూపుతూ, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు అంకితభావంతో ముందుకు సాగిన సంస్థే ఏఐవైఎఫ్.




గత ఆరు దశాబ్దాలుగా ఏఐవైఎఫ్ యువత హక్కుల కోసం నిరంతరం పోరాడుతూ వచ్చింది. నిరుద్యోగం, విద్యలో అసమానతలు, ఆరోగ్య సేవల లోపాలు, సామాజిక అన్యాయాలు— ఇవన్నీ యువతను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ఏఐవైఎఫ్ ఉద్యమాలు కేవలం ప్రతిఘటనకే పరిమితం కాకుండా, ప్రత్యామ్నాయ విధానాల కోసం కూడా పోరాడుతున్నాయి.

ప్రస్తుత కాలంలో దేశం తీవ్రమైన ఆర్థిక, సామాజిక సంక్షోభాలను ఎదుర్కొంటోంది. నిరుద్యోగం పెరుగుతూ ఉండగా, విద్యారంగంలో ప్రైవేటీకరణ పెరిగిపోతోంది. పేద, మధ్యతరగతి యువతకు ఉన్న అవకాశాలు క్షీణిస్తున్నాయి. ప్రజాస్వామ్య హక్కులపై దాడులు, మత విద్వేషాల పెరుగుదల, అసమానతల విస్తరణ— ఇవన్నీ యువత భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతున్నాయి.

తెలంగాణ రాష్ట్రంలో కూడా యువత అనేక సమస్యలను ఎదుర్కొంటోంది. ప్రభుత్వ నియామకాల్లో ఆలస్యం, విద్యార్థులపై పెరుగుతున్న ఆర్థిక భారాలు, గ్రామీణ యువతకు అవకాశాల కొరత— ఇవి అన్నీ తక్షణ పరిష్కారం కోరుతున్న అంశాలు. ఈ నేపథ్యంలో ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర కమిటీ యువత సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తూ, ప్రజల మధ్య చైతన్యం పెంచుతోంది.

ఏఐవైఎఫ్ కేవలం ఒక సంస్థ కాదు— ఇది ఒక ఉద్యమం, ఒక ఆలోచన, ఒక మార్పు శక్తి. యువతను సంఘటితం చేసి, వారి శక్తిని సమాజ మార్పు దిశగా మలచడం మా లక్ష్యం. గ్రామ స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు యువజన శక్తిని ఒకటిగా కట్టిపడేసి, సమానత్వం, న్యాయం,ప్రజాస్వామ్యం కోసం పోరాటాన్ని బలోపేతం చేయాలి.

ఈ 67వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి యువకుడు ఒక బాధ్యతను స్వీకరించాలి.

ప్రతి గ్రామంలో, ప్రతి కాలనీలో, ప్రతి విద్యాసంస్థలో యువజన సంఘటనలను నిర్మించాలి.

ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, ప్రజల పక్షాన నిలబడాలి.

రాబోయే రోజుల్లో ఉపాధి హక్కు, ఉచిత, నాణ్యమైన విద్య, అందరికీ అందుబాటులో ఉన్న ఆరోగ్య సేవలు— ఈ ప్రధాన అంశాలపై దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలను చేపట్టాల్సిన అవసరం ఉంది. యువత భవిష్యత్తు కోసం ఈ పోరాటం తప్పనిసరి.

ఈ సందర్భంలో అన్ని స్థాయిల్లో ఏఐవైఎఫ్ యూనిట్లు ర్యాలీలు, సభలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం పెంచాలి. యువతను పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాలలో భాగస్వామ్యం చేయాలి.

**మన నినాదం స్పష్టం:**

ఉపాధి హక్కు సాధించాలి!
ప్రజా విద్యను కాపాడాలి!
ప్రజాస్వామ్యాన్ని రక్షించాలి!
బలమైన ఏఐవైఎఫ్ – బలమైన భారత్!
యువజన ఐక్యత జిందాబాద్! ఏఐవైఎఫ్ జిందాబాద్!
ఈరోజు మన బాధ్యత

ఈ చారిత్రాత్మక నేపథ్యం మనకు ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తోంది —

యువత ఐక్యమైతేనే దేశం మారుతుంది.
పోరాటం కొనసాగితేనే హక్కులు సాధ్యమవుతాయి.

భగత్ సింగ్ చూపించిన మార్గంలో, ఏఐవైఎఫ్ జెండా కింద యువతను సంఘటితం చేసి, న్యాయం, సమానత్వం, ప్రజాస్వామ్యం కోసం పోరాటాన్ని మరింత బలోపేతం చేద్దాం.

భగత్ సింగ్ కలలు – మన పోరాటాలు!
ఏఐవైఎఫ్ జిందాబాద్! యువజన ఐక్యత జిందాబాద్!

*(నేడు ఎఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవం)*

# మేదరి వృత్తి : సంప్రదాయం నుండి సంక్షోభం వరకు..



బొల్లం బాలకృష్ణ
9989735216

భారతదేశం అనేక సంప్రదాయ వృత్తులకు నిలయం. గ్రామీణ సంస్కృతిలో ప్రతి వృత్తి ఒక ప్రత్యేక స్థానం కలిగి ఉంది. అలాంటి గొప్ప చేతి వృత్తులలో మేదరి వృత్తి ఒకటి. మేదరి వారు పేదవారి కలపగా పిలవబడే వెదురుతో వివిధ రకాల గృహోపయోగ వస్తువులను తయారు చేసే కళాకారులు. వీరు తయారు చేసిన వస్తువులను వీధుల్లో తిరుగుతూ లేదా వారసంతల్లో విక్రయిస్తారు. వీరిని తెలుగు రాష్ట్రాల్లో మేదరి లేదా మహేంద్ర అనే పేరుతో పిలుస్తున్నారు. మరికొన్ని రాష్ట్రాల్లో మేధా, బురుడు, గడబ అనే పేర్లతో పిలుస్తున్నారు. ఈ వృత్తి కేవలం జీవనోపాధి మాత్రమే కాదు ఒక సాంప్రదాయ కళా సంపద. మేదరులు ప్రకృతితో మమేకమై జీవించేవారు.

అడవుల్లో లభించే వెదురు వారి జీవనాధారం. వెదురును సేకరించడం నుండి అది ఉపయోగకరమైన వస్తువుగా మారేవరకు అనేక దశలు ఉంటాయి. ఈ దశలన్నింటిలోనూ మేదరి వారి అనుభవం, శ్రమ, నైపుణ్యం ఉంటుంది. వీరు తయారుచేసే వస్తువులు గ్రామీణ జీవనంలో ముఖ్య పాత్ర పోషిస్తాయి. వీరు గంపలు, బుట్టలు, చాటలు, సిబ్బులు, చంద్రికలు, పొనుకలు, విసన కర్రలు వంటి వస్తువులు తయారు చేస్తారు. ఇవి తయారు చేయడానికి ముందుగా అడవిలోంచి సరైన వెదురును ఎంచుకుంటారు. దానిని పగలగొట్టిన తర్వాత వెదురును పొడవుగా చీల్చి, పలుచని పేడుగా, కర్రలు, ఓరలు, బిలుకులుగా అల్లకానికి తగినట్లుగా తయారు చేసుకుంటారు.

మేదరి వృత్తి తరతరాలుగా వారసత్వంగా వస్తూ ఉంది. వీరి అల్లకం ఒక ప్రత్యేక కళా నైపుణ్యం. కాళ్లు, చేతుల, వేళ్ళ చాకచక్యంతో, ఓపికతో, శ్రద్ధతో అల్లడం ద్వారా గంపలు, బుట్టలు చాటలు తయారు చేస్తారు. ప్రతి వస్తువు ఒక ప్రత్యేక రూపాన్ని కలిగి ఉంటుంది. గంపలు పెద్దవిగా, బుట్టలు తేలికగా, సిబ్బులు జల్లెడలు సమతలంగా ఉండేలా తయారు చేస్తారు. ఈ వృత్తిలో కేవలం శారీరక శ్రమ మాత్రమే కాకుండా కళాత్మక దృష్టి కూడా అవసరం. ఆకృతులు, నమూనాలు, ఆకర్షణీయమైన డిజైన్లు రూపొందించడం ద్వారా వస్తువులను అందంగా తయారు చేస్తారు. కొందరు మేదరి కళాకారులు తమ ప్రతిభతో కొత్త కొత్త నమూనాలను కూడా సృష్టిస్తున్నారు. ఈ ప్రక్రియలో కుటుంబ సభ్యులందరూ పాల్గొంటారు. పురుషులు వెదురును పగలగొట్టడం, చీల్చడం వంటి పనులు చేస్తే, మహిళలు అల్లకం పనిలో నిపుణులు. పిల్లలు కూడా చిన్నచిన్న పనులు చేస్తూ ఈ కళను అభ్యసిస్తారు. తల్లిదండ్రుల నుండి పిల్లలకు ఈ కళ సంక్రమిస్తుంది. చిన్నప్పటి నుంచే పిల్లలు ఈ వృత్తిని నేర్చుకుంటారు. అందువల్ల ఈ కళలో వారికి సహజమైన నైపుణ్యం ఏర్పడుతుంది.

మేదరి మహేంద్రుల వృత్తి మన సంస్కృతిలో ఒక ముఖ్యమైన భాగం. వివాహాలు, పండుగలు, శుభకార్యాల్లో మేదరులు తయారు చేసిన గంపలు, బుట్టలు ఉపయోగించడం ఒక ఆనవాయితీ. వెదురుకు ఆయుర్వేద గుణాలు ఉండడం వల్ల శిశువు పుట్టినపుడు చాటలో వేస్తారు. పెళ్ళిళ్ళకు వెదురు తడికలతో పచ్చటి పందిరి వేయడం ఒక సాంప్రదాయం. మనిషి పుట్టినపట్టి నుండి చనిపోయినపుడు తీసుకెళ్లే ఏడు కట్ల పాడె సవారీ వరకు వెదురు అవసరం. కావున వెదు, మేదరులు సమాజంతో ముడివేసుకున్న తీరును మనము అర్థం చేసుకోవచ్చు. ఆధునిక కాలంలో ఈ వృత్తి అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. గత కాలంలో ప్రతి ఇంటిలో నూ, వ్యవసాయంలోనూ మేదరులు తయారు చేసి న వస్తువులే ఉపయోగించేవారు.







గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో వీరి పాత్ర చాలా కీలకమైనది. కానీ కాలక్రమేణా పరిశ్రమల అభివృద్ధి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెరగడం వల్ల ప్లాస్టిక్, ఇనుము, యంత్రాలతో తయారైన వస్తువులు మార్కెట్‌లోకి వచ్చాయి. ఇవి తక్కువ ధరలకు, ఎక్కువ కాలం నిలిచేలా ఉండటంతో ప్రజలు వాటిని ఎక్కువగా వినియోగించడం ప్రారంభించారు. దీంతో మేదరి వృత్తికి డిమాండ్ తగ్గిపోయింది. మరొక ప్రధాన సమస్య వెదురు లభ్యత తగ్గిపోవడం. అడవుల తగ్గుదల, అటవీ చట్టాల పరిమితుల కారణంగా మేదరులు వెదురును సులభంగా సేకరించలేకపోతున్నారు. ఈ పరిస్థితులు వారి జీవనోపాధిని మరింత క్లిష్టంగా మార్చాయి.

ఇలాంటి పరిస్థితుల్లో ఈ వృత్తి ఆదాయం తక్కువగా ఉండడం తో చాలామంది ఇతర పనుల వైపు వెళు తున్నారు. కొందరు కూలీ పనులు, మరి కొందరు పూలు అమ్మడం, డెకరేషన్ లాంటి పనులు ఇంకొంతమంది చిన్న చిన్న వ్యాపారాలు చేపడుతున్నారు. యువత కూడా ఈ వృత్తిపై ఆసక్తి చూపకపోవడం వల్ల ఈ సంప్రదాయ వృత్తి క్రమంగా తగ్గిపోతోంది.

నవ కల్పనలు చేయడం, ప్రభుత్వ చొరవ వల్ల వెదురు ఉత్పత్తి, వాడకం కూడా పెంచవచ్చు. ఉదాహరణకు భారతదేశంలోని మొదటి వెదురు మెట్రో స్టేషన్ బెంగళూరులోని బాంబూ బజార్ వద్ద బి.ఎమ్.ఆర్.సి.ఎల్ (BMRCL) వినూత్నమైన మెట్రో స్టేషన్‌ను నిర్మిస్తోంది. ఇది భారతదేశపు మొట్టమొదటి వెదురు థీమ్‌తో రూపొందుతున్న మెట్రో స్టేషన్. బెంగళూరు విమానాశ్రయం (T2) తరహాలో పర్యావరణహితంగా ఉండేలా దీనిని తీర్చిదిద్దుతున్నారు. దీని అలంకరణకోసం త్రిపుర నుండి తెప్పించిన ప్రత్యేకమైన 'బాంబూసా తుల్డా' (Bambusa tulda) అనే వెదురు రకాన్ని ఉపయోగిస్తున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా స్టేషన్ పరిసరాల్లోని 5 కిలోమీటర్ల రోడ్డును కూడా వెదురుతో అందంగా తీర్చిదిద్దనున్నారు. ఇలాంటి వినూత్న ఆలోచన వల్ల వెదురు కళాకారులకు ఉపాధి కలగడమే కాకుండా పర్యావరణ కాలుష్యాన్ని కూడా తగ్గించవచ్చు. ఇప్పటికే జార్ఖండ్‌లో బారాబాంబో (Barabambo) అనే పేరుతో ఒక రైల్వే స్టేషన్ ఉంది, కానీ అది సాధారణ రైల్వే స్టేషన్ మాత్రమే. బెంగళూరులో నిర్మిస్తున్నది వెదురు రూపకల్పనతో వస్తున్న ప్రత్యేక మెట్రో స్టేషన్. ఇలాంటివి భారతదేశం అంతటా విస్తరించే అవకాశం ఉంది.

వెదురుతో తయారు చేసిన వస్తువులు వాడడం సమాజం బాధ్యత. ఇందుకు ప్రభుత్వ సహకారం, ప్రోత్సాహం కూడా ఎంతో అవసరం. హస్తకళల ప్రదర్శనలు నిర్వహించడం ద్వారా వెదురు వస్తువులను ప్రోత్సహించవచ్చు. ఆన్‌లైన్ మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తే వారి ఉత్పత్తులకు మంచి మార్కెట్ లభిస్తుంది.

మేదరి కళాకారులకు శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయడం ద్వారా కొత్త డిజైన్లు, ఆధునిక పద్ధతులు నేర్పవచ్చు. బ్యాంకుల ద్వారా రుణాలు, సబ్సిడీలు అందిస్తే వారు ఆర్థికంగా బలపడతారు. వెదురు వాడడం వల్ల పర్యావరణాన్ని కాపాడుతూ సుస్థిర అభివృద్ధి వైపు అడుగులు వేయవచ్చు

# కింది స్థాయి సిబ్బందితో ఫ్రెండ్లీగా ఉండాలి



- సిబ్బంది సమస్యలు వినడానికి అన్ని డిపోల్లో గ్రీవెన్స్ ఏర్పాటు
- ఆర్‌టిసి అధికారులతో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆర్‌టిసి అధికారులు కిందిస్థాయి డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది పట్ల దురుసుగా కాకుండా ఫ్రెండ్లీగా స్నేహపూర్వకంగా పనులు చేయించుకోవాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ఆర్‌టిసి ఉన్నతాధికారులతో శనివారం మంత్రి పొన్నం ప్రభాకర్ జూమ్ సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో శుక్రవారం జరిగిన ఆర్‌టిసి కార్మిక సంఘాల నేతల సమావేశంలో కార్మిక సంఘాలు లేవనెత్తిన అంశాలపై అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కిందిస్థాయి సిబ్బంది, ప్రయాణీకులతో డిపో మేనేజర్లు సత్సంబంధాలు కలిగి ఉండాలన్నారు. మే 17 లోపల డిపోలలో, బస్ స్టేషన్లలలో కార్మికులకు మౌలిక సదుపాయాలు మెరుగు పరచడంతో పాటు టాయిలెట్స్, మంచి నీటి సౌకర్యం, ప్లాంటేషన్, పరిశుభ్రత పాటించాలని కోరారు. ప్రతి రెండవ మంగళవారం ఆర్‌టిసి సిబ్బంది సమస్యలు వినడానికి అన్ని డిపోల్లో గ్రీవెన్స్ ఏర్పాటు చేయడంతో పాటు డిపో మేనేజర్లు ఇతర సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. జూమ్ సమావేశంలో ఆర్‌టిసి ఎండి వై.నాగిరెడ్డి, ఇడిలు, ఆర్ఎంలు, వివిధ విభాగాల హెచ్ఓడి, డిఎంలు పాల్గొన్నారు.

### ప్రమాదకర హెచ్చరిక సూచికలు ప్రదర్శించాలి

రోడ్ సేఫ్టీ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు రహదారులపై ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రదేశాలలో ప్రత్యేకంగా కేటాయించిన వేదికలపై ప్రమాదానికి గురైన వాహనాలను హెచ్చరిక సూచికలతో ప్రదర్శించాలని స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్‌ను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. ఇది డ్రైవర్లకు, ప్రయాణికులకు యాక్సిడెంట్స్ స్పాట్స్ దగ్గర హెచ్చరికగా పనిచేస్తూ, రహదారి భద్రతపై అవగాహన కల్పించి, ప్రాణాంతక ప్రమాదాలను తగ్గించడంలో సహాయపడుతుందనీ మంత్రి తన అభిప్రాయం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా జాతీయ, రాష్ట్ర రహదారులపై రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయనీ ఆందోళనకరంగా వ్యక్తం చేశారు. అమూల్యమైన ప్రజల ప్రాణాలను కాపాడటానికి, పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని, రాష్ట్రవ్యాప్తంగా ప్రమాదం ఎక్కువగా ఉన్న ప్రదేశాలలో అటువంటి డిస్‌ప్లేలను ఏర్పాటు చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు.

# హ్యామ్ రోడ్ల కాంట్రాక్టర్లకు బెదిరింపులు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్ఎస్ నేతలు పదేళ్లు బ్లాక్ మెయిల్ చేసి అడ్డగోలుగా అవినీతికి పాల్పడ్డారని, ప్రస్తుతం హ్యామ్ రోడ్ల కాంట్రాక్టర్లకు ఫోన్ చేసి బిఆర్ఎస్ నేత హరీష్ రావు బెదిరిస్తున్నారని ప్రభుత్వ విప్‌లు బల్మూర్ వెంకట్, అద్దంకి దయాకర్ ఆరోపించారు. హ్యామ్ రోడ్లపై మాట్లాడి కాంట్రాక్టర్లను లొంగదీసుకునే ప్రయత్నం చేస్తున్నారని, హరీష్ రావుకు ధైర్యముంటే ఈ విషయంపై తమ వద్దకు చర్చకు రావాలని వారు సవాల్ చేశారు. బిఆర్ఎస్ నేత హరీష్ రావు బ్లాక్ మెయిల్ రావుగా మారారని వారు వ్యాఖ్యానించారు. సిఎల్‌పిలో మీడియా సెంటర్‌లో శనివారం వారు మాట్లాడారు. బల్మూర్ వెంకట్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు టెండర్లకు ముందుకు రాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిబంధనల ప్రకారం టెండర్ ప్రక్రియ కొనసాగుతోందని ఆయన స్పష్టం చేశారు. కెసిఆర్ ఎప్పుడు ఖతం అవుతాడో, ఎప్పుడు కుర్చీలో కూర్చోవాలన్నదే కెటిఆర్, హరీష్‌రావు ఆలోచన అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి గురించి బిఆర్ఎస్ నేతలు అడ్డగోలుగా మాట్లాడితే తెలంగాణ ప్రజలు తాట తీస్తారన్నారు. అద్దంకి దయాకర్ మాట్లాడుతూ హ్యామ్ రోడ్ల టెండర్లపై ఇంకా ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదని, అప్పుడే అవినీతి జరిగిందని కొందరు బిఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారన్నారు. ఈ విషయంపై హరీష్‌రావు చర్చకు రావాలని సవాల్ చేశారు. ప్రతిపక్షంలో కూడా సంపాదించాలన్నదే హరీష్‌రావు, కెటిఆర్ ఆలోచన అన్నారు. ఏదో ఒక అంశంపై మాట్లాడటం, అందుకు సంబంధించిన వారిని బ్లాక్ మెయిల్ చేయడం పనిగా పెట్టుకున్నారని, హరీష్‌రావు వసూల్‌రావు అయ్యారని ఆయన ఆరోపించారు. అసెంబ్లీలో క్రషర్ల అంశంపై మాట్లాడి వాటి యజమానులను బ్లాక్ మెయిల్ చేశారని, క్రషర్ల యజమానుల నుంచి ఎమ్మెల్సీ నవీన్ రావు మధ్యవర్తిగా కోటి రూపాయల చొప్పున వసూలు చేశారని ఆయన ఆరోపించారు. చిత్తశుద్ధి ఉంటే క్రషర్ల యజమానుల నుంచి డబ్బులు తీసుకోలేదని హరీష్ రావు ప్రమాణం చేయాలన్నారు.

# ఎన్నికలు ముగిసిన వెంటనే ధరల భారం

- టిపిసిసి అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిన వెంటనే వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను రూ.ఒక వెయ్యి వరకు పెంచడాన్ని టిపిసిసి అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. ఇది కేంద్ర ప్రభుత్వ క్రూరత్వానికి ఉదాహరణ అని విమర్శించారు. ఎన్నికల ముందు ధరలు నియంత్రించి, తర్వాత పెంచడం కేంద్రం అసలు ఉద్దేశ్యాన్ని బయటపెడుతోందన్నారు. డీజిల్ ధరలు పెరగడంతో పాటు గ్యాస్ ఖర్చులు కొన్ని రాష్ట్రాల్లో రూ.1500 వరకు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అంతర్జాతీయ మార్కెట్‌ను సాకుగా చూపుతూ పన్నులు పెంచడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్రోల్, డీజిల్ ధరలు కూడా పెంచే యత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. వెంటనే ఇంధన ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రజలపై భారాలు మోపుతున్న కేంద్ర విధానాలను ప్రజలు ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు.



తెలంగాణ నూతన డిజిపిగా బాధ్యతలు స్వీకరించిన సివి ఆనంద్ లోక్‌భవన్‌లో శనివారం గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు.

# అన్ని రకాల సౌకర్యాలతో నూతన ఉస్మానియా ఆస్పత్రి

- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అత్యాధునిక సాంకేతికత పరిజ్ఞానంతో అన్ని రకాల సౌకర్యాలతో నూతన ఉస్మానియా ఆస్పత్రి ఉండబోతున్నదని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. పేషెంట్లతో పాటు, ఉస్మానియాలో పనిచేసే సిబ్బంది, డాక్టర్లకు సౌకర్యవంతంగా ఉండేలా ఆస్పత్రిని డిజైన్ చేస్తున్నామన్నారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా మెడికల్ కాలేజీ గ్రౌండ్స్‌లో శనివారం 'ఉస్మానియా ఎంబిబిఎస్ విద్యార్థుల 175వ స్నాతకోత్సవం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో గవర్నర్ శివప్రతాప్ శుక్లా, మంత్రి దామోదర రాజనర్సింహ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వారు పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ విసి డాక్టర్ రమేష్ రెడ్డి, డిఎంఇ నరేంద్ర కుమార్, ఉస్మానియా ప్రిన్సిపల్ రాజారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ పేషెంట్లతో పట్ల మానవత్వంతో వ్యవహరించాలని సూచించారు. ధనార్జనే ధ్యేయంగా ఉండకూడదని, డాక్టర్లకు ప్రభుత్వం తరపున అన్ని రకాల సహకారం అందిస్తామన్నారు. వచ్చే ఏడాది చివరి నాటికి కొత్త ఉస్మానియా ఆస్పత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. కొత్త భవనం అందుబాటులోనికి రాగానే అత్యాధునిక వైద్య సదుపాయాలు, సూపర్ స్పెషాలిటీ సేవలు, అత్యవసర చికిత్సలు మరింత విస్తృతంగా అందిస్తామన్నారు.



# తక్షణమే చెరువుల పునరుద్ధరణ పనులు

- నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా చెరువుల పునరుద్ధరణ పనులను తక్షణమే చేపట్టాలని నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వేసవికాలం కావడంతో పూడికతీత పనులకు అధిక ప్రాధాన్యతను ఇస్తూ గ్రామీణ కుంటలు చెరువుల నుంచి పెద్ద నీటి వనరుల వరకు అన్ని స్థాయిల్లో పనులు తక్షణమే ప్రారంభించాలని స్పష్టం చేశారు. శనివారం జల్ సౌధలో సాగునీటి అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, కొత్త మార్గదర్శకాలు కోసం ఎదురు చూడకుండా ఇప్పటికే ఉన్న గైడ్‌లైన్స్‌ను అనుసరించి పనులు ప్రారంభించాలని సూచించారు. అదేవిధంగా చెరువుల పరిరక్షణ, సాగు నీటి నిర్వహణకు సంబంధించి తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చిన్న నివేదిక ఆధారంగా జిల్లాల స్థాయిలో చెరువుల కమిటీలను తక్షణమే ఏర్పాటు చేయాలని, రైతులకు అధిక ప్రాధాన్యతను ఇస్తూ ప్రభుత్వ ప్రతినిధులు, స్థానిక అధికారులు భాగస్వామ్యంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. పూడిక తీత పనులకు సంబంధించి గత నెలన్నర క్రితమే ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఇప్పటీవరకు పనులను ప్రారంభించకపోవడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోరెండు నెలలు మాత్రమే సమయం ఉన్నందున ప్రణాళికాబద్ధంగా పునరుద్ధరణ చేపట్టాలని సూచించారు. జూరాల ప్రాజెక్టు, మూసీ ప్రాజెక్టుల్లో కూడా పూడికతీత పనులను తక్షణమే ప్రారంభించాలని అధికారులకు స్పష్టం చేశారు. చెరువుల పరిరక్షణలో భాగంగా ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టిఎల్) నిర్ధారణ, ఆక్రమణల తొలగింపు, క్యాచ్‌మెంట్ రక్షణ చర్యలను సాగునీటి, రెవెన్యూ, వ్యవసాయ శాఖలు సమన్వయంతో అమలు చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో రైతు కమిషన్ ఛైర్మన్ ఎం.కోదండరెడ్డి, సభ్యులు భవానిరెడ్డి, రాములు నాయక్, నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

# దొర కుటుంబాన్ని తరిమేస్తేనే రాష్ట్రం బాగుపడుతుంది

- టిపిసిసి జనరల్ సెక్రెటరీ గజ్జెల కాంతం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో కెసిఆర్ కుటుంబం తెలంగాణ ప్రజలను శాసించే కుటుంబమని, దొర కుటుంబాన్ని రాష్ట్రం నుండి తరిమేస్తేనే రాష్ట్రం బాగుపడుతుందని టిపిసిసి ప్రధాన కార్యదర్శి గజ్జెల కాంతం అన్నారు. గాంధీభవన్‌లో శనివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కెసిఆర్ కుటుంబం తెలంగాణను దోచుకుందని టిఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత అంటున్నారని, కెటిఆర్ ఎన్ని మాట్లాడినా అధికారంలోకి రారన్నారు. కెసిఆర్ అధికారంలోకి వచ్చాక ఎనిమిది లక్షల కోట్ల అప్పు చేసి మూడు లక్షల కోట్లు దోచుకున్నారని, దోచుకున్న ఆస్తులన్ని ప్రజలకు ఇచ్చే వరకు బిఆర్ఎస్‌ను ప్రజలు క్షమించబోరన్నారు. కెసిఆర్ ముఖ్యమంత్రి అయ్యాక ప్రగతిభవన్‌లో, ఫామ్‌హౌస్‌లో పడుకున్నారని, ప్రజల కోసం ఏనాడు ఆలోచించలేదన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో కొన్నింటిని ఇప్పటికే అమలు చేసిందని, ఆరు నెలల్లో ప్రజలకిచ్చిన అన్ని హామీలను సిఎం రేవంత్ రెడ్డి నెరవేర్చనున్నారని, కాంగ్రెస్ పార్టీ గురించి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురించి మాట్లాడే అర్హత కెసిఆర్‌కు లేదన్నారు. కవిత ఒక పార్టీ పెట్టారని, హరీష్ రావు ఒక పార్టీ పెట్టనున్నారని ఆయన చెప్పారు.

# కొనుగోలు కేంద్రాల ప్రక్రియ వేగవంతం చేయాలి

- రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:** ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రక్రియను వేగవంతం చేయాలని రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. శనివారం రంగారెడ్డి జిల్లా మంచాల మండలం నోముల గ్రామం రైతు సంఘం బృందం ఆధ్వర్యంలో పర్యటించి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పర్శీలించి తూనికలు, కొలతలు సక్రమంగా ఉన్నాయని రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పశ్య పద్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ సీజన్‌లో 90లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరిస్తామని ప్రకటన చేసిన నేటికి అదనపు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవటం సిగ్గుచేటని విమర్శించారు. నోముల గ్రామంలో కొనుగోలు కేంద్రం సమీపంలో డిసిఎంఎస్, ఐకెపి అధికారుల నిర్లక్ష వైఖరి కారణంగా రైతులు వరి కుప్పలు పోసుకొని అధికారుల కోసం పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అకస్మాత్తుగా అకాల వర్షాలు కురిస్తే వరి ధాన్యం మొత్తం తడిసి తేమ కోల్పోతే రైతులకు నష్టం వాటిల్లుతుందని అన్నారు. వర్షాలకు, ఎండలకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే ప్రమాదం ఉంది కావున వర్షం నుండి రక్షణ కల్పించటానికి కొనుగోలు కేంద్రాల వద్ద మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరారు. రైతులు ధాన్యాన్ని మధ్య దళారులకు విక్రయించి మోసపోవద్దని సూచించారు. అనంతరం మంచాల మండలం తహసీల్దార్‌కు వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకురాలు సంధ్య, నరేందర్, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు కొంతం మాదవ రెడ్డిలు పాల్గొన్నారు.

# 'నీట్' కేంద్రాల వద్ద 163 సెక్షన్

- జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు క్లోజ్!

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్‌యూజీ పరీక్ష 2026)కు సర్వం సిద్ధమైంది. దేశ వ్యాప్తంగా ఆదివారం (మే 3న) జరగనున్న ఈ పరీక్షకు ఎన్టీఏ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ప్రతిష్ఠాత్మక పరీక్ష నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేస్తున్నారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో పరీక్షా కేంద్రాల వద్ద ఆదివారం ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు బీఎన్ఎస్ఎస్‌లోని 163 సెక్షన్ (గతంలో 144 సెక్షన్) అమలులో ఉంటుందని అధికారులు ప్రకటించారు. ఈ మేరకు ఓ పబ్లిక్ నోటీసును విడుదల చేశారు. పరీక్షా కేంద్రానికి 200 మీటర్ల పరిధిలో ఐదుగురు అంతకన్నా ఎక్కువ మంది గుమిగూడటం నిషిద్ధమని నోటీసుల్లో పేర్కొన్నారు. పరీక్ష కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు మూసి ఉంటాయని తెలిపారు. ఈ పరీక్ష సజావుగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా.ఎం.రమేశ్ విజ్ఞప్తి చేశారు. ఈ ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**ఎన్టీఏ కీలక అడ్వైజరీ...** వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం దేశవ్యాప్తంగా జరిగే ఈ పరీక్షకు దాదా పు 22.79లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరు కానున్నారు. ఆదివారం మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జరిగే ఈ పరీక్ష కోసం విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకోవాలని ఇప్పటికే ఎన్టీఏ అధికారులు సూచించారు. మధ్యాహ్నం 1.30గంటలు దాటితే పరీక్షా కేంద్రం గేట్లు మూసివేస్తారని తెలిపారు. అలాగే, ఆదివారం పలు చోట్ల వర్షం కురిసే అవకాశం ఉన్నందున తదనుగుణంగా విద్యార్థులు ఏర్పాట్లు చేసుకోవాలంటూ ఎన్టీఏ శనివారం ఓ అడ్వైజరీ జారీ చేసింది. అడ్మిట్ కార్డు, ఫొటోగ్రాఫ్‌లు తడిసిపోకుండా ఉండేందుకు ట్రాన్స్‌పరెంట్ పౌచ్‌లను వాడాలని సూచించింది. విద్యార్థులకు ఏవైనా సందేహాలు ఉంటే 01140759000/01169227700 నంబర్లకు కాల్ చేయడం లేదా neetug 2026@nta.ac.inకు మెయిల్ చేయడం ద్వారా తమను సంప్రదించవచ్చని పేర్కొంది.

# నేటి నుంచి సిపిఐ(ఎం) మార్కెట్ యార్డుల బాట

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వరి కోతలు ఊపందుకున్న నేపథ్యంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించేందుకు సోమవారంనుంచి సిపిఐ(ఎం)ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని మార్కెట్ యార్డులు ,కొనుగోలు కేంద్రాలను సందర్శించనుందని రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తెలిపారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా సాగు చేసిన వరి, మొక్కజొన్న, ఇతర పంటల కొనుగోలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, కొనుగోలు కేంద్రాల్లో నెల కొన్న అస్తవ్యస్త పరిస్థితుల వల్ల అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు, ప్రభుత్వం స్పందించడం లేదని ఆయన ఆరోపించారు. ఈ సమస్యను పరిశీలించేందుకు నేటి నుంచి సిపిఎం బృందాలు రాష్ట్రంలోని అన్ని మార్కెట్ యార్డులు ,కొనుగోలు కేంద్రాలను సందర్శించనున్నాయని వెల్లడించారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఐకెపి, పిఎసిఎస్, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీల ఆధ్వర్యంలో కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 11న అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు.

## మావోయిస్టుల 'మందు పాతర్లు' ముప్పు

# అడవుల్లో భద్రతా దళాల గాలింపు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఛత్తీస్‌ఘఢ్‌లో జరిగిన తాజా ఐఈడి పేలుడు ఘటన మరోసారి మావోయిస్టుల వ్యూహాలను వెలుగులోకి తెచ్చింది. పోలీసులను, భద్రతా బలగాలను లక్ష్యంగా చేసుకుని అడవుల్లో గతంలోనే పెద్ద ఎత్తున పాతిపెట్టిన మందు పాతర్లు (ఐఇడి) ఇప్పుడు ప్రధాన సవాలుగా మారాయి. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర భద్రతా దళాలు అప్రమత్తమై విస్తృత స్థాయిలో గాలింపు చర్యలు చేపడుతున్నాయి. కగార్ ఆపరేషన్‌కు ముందు పోలీసులను లక్ష్యంగా చేసుకుని మావోయిస్టులు అడవుల్లో పలుచోట్ల ముందు జాగ్రత్త చర్యగా మందు పాతర్లు అమర్చారు. ప్రస్తుతం మావోయిస్టుల దాదాపుగా జన జీవన స్రవంతిలోకి వచ్చిన విషయం తెలిసిందే. అయితే అడవుల్లో అమర్చిన మందుపాతర్ల వల్ల పశువుల కాపర్లు, వంట కోసం కట్టెలకు వెళ్లే వారికి, పోలీసులకు ప్రమాదం పొంచి ఉంది. అయితే అడవుల్లో ఎక్కడెక్కడ మందుపాతర్లు అమర్చారో పోలీసులకు తెలియదు. అయితే లొంగిపోయిన మావోయిస్టుల సహకారంతో వీటిని వెతికి మందు పాతర్లను నిర్వీయం చేసేందుకు తెలంగాణ పోలీసులతో పాటు కేంద్ర భద్రత బలగాలు సిద్దమయ్యాయి. బస్తర్, కాంకేర్, నారాయణపూర్, దంతేవాడ వంటి అటవీ ప్రాంతాల్లో మావోయిస్టులు గతంలో భారీగా ఐఈడీలు అమర్చినట్లు సమాచారం. ముఖ్యంగా భద్రతా దళాల కదలికలు జరిగే మార్గాలు, గ్రామాల మధ్య రహదారులు, అడవి దారులు వంటి ప్రదేశాల్లో ఈ పేలుడు పరికరాలను దాచిపెట్టడం వారి సాధారణ వ్యూహంగా మారింది. దీని వల్ల ప్రతి అడుగు ముందుకు వేయడం భద్రతా సిబ్బందికి ప్రాణపణంగా మారుతోంది. ఇటీవల లొంగిపోయిన మావోయిస్టుల ద్వారా లభించిన సమాచారం ఆధారంగా పోలీసులు వందలాది మందు పాతర్లను గుర్తించి నిర్వీర్యం చేశారు. అయినప్పటికీ, ఇంకా అనేక ప్రాంతాల్లో అవి దాగి ఉండే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకే డీమైనింగ్ ఆపరేషన్లు మరింత ముమ్మరం చేశారు. ప్రస్తుతం డ్రోన్ సర్వైలెన్స్, మెటల్ డిటెక్టర్లు, బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్లు, ట్రాకర్ కుక్కల సహాయంతో శోధన కొనసాగుతోంది. ప్రతి ఆపరేషన్లో ముందుగా రహదారులను పరిశీలించి, అనంతరం దళాలు కదిలేలా కఠిన భద్రతా నిబంధనలు అమలు చేస్తున్నారు. అయినప్పటికీ, అడవుల విస్తీర్ణం, భూభాగం క్లిష్టత వల్ల ప్రమాదం పూర్తిగా తొలగిపోలేదు. తాజా ఘటనలో ఐఈడీ నిర్వీర్యం చేస్తుండగానే పేలిపోవడం, మావోయిస్టులు ఉపయోగిస్తున్న పేలుడు పరికరాల ప్రమాదకర స్వరూపాన్ని మరోసారి గుర్తు చేసింది. ఈ నేపథ్యంలో భద్రతా దళాలు మరింత జాగ్రత్తగా, సమన్వయంతో ఆపరేషన్లు కొనసాగిస్తున్నాయి.

మొత్తంగా చూస్తే, మావోయిస్టుల 'మందు పాతర్లు' ఇప్పుడు పెద్ద భద్రతా సవాల్గా మారగా, వాటిని పూర్తిగా నిర్మూలించడానికి కేంద్ర–రాష్ట్ర దళాలు అడవుల్లో 'సైలెంట్ వార్' కొనసాగిస్తున్నాయి. ఈ పోరాటంలో ప్రతి రోజు ఒక సవాలుగా మారుతున్న పరిస్థితి కనిపిస్తోంది.

# పర్యాటకుల భద్రతపై కట్టుదిట్టమైన చర్యలు

- వాటర్ ఫ్లీట్ ఆపరేషన్లకు మార్గదర్శకాలు జారీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ జిల్లా నర్మదా నదిపై జరిగిన బోటు ప్రమాదంలో 9 మంది జలసమాధి ఘటనపై తెలంగాణ టూరిజం శాఖ మేల్కొంది. పర్యాటకుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో వాటర్ ఫ్లీట్ కార్యకలాపాల్లో భద్రతను మరింత బలోపేతం చేయడానికి టూరిజం శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. అన్ని బోటింగ్ యూనిట్లలో కఠిన భద్రతా నిబంధనలు అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ మార్గదర్శకాలను ఎలాంటి మినహాయింపులు లేకుండా అమలు చేయాలని యూనిట్ మేనేజర్లకు స్పష్టం చేసింది.

యూనిట్ మేనేజర్లకు పూర్తి బాధ్యత ప్రతి యూనిట్ మేనేజర్ కార్యకలాపాల సమయంలో తప్పనిసరిగా ప్రత్యక్షంగా హాజరు కావాలి. ముఖ్యంగా వారాంతాలు, సెలవుదినాలు, పీక్ సీజన్‌లలో అప్రమత్తంగా ఉండాలి. భద్రతా నియమాల అమలు, ప్రమాదాల నివారణపై పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది. రోజువారీ భద్రతా తనిఖీ నివేదికను తప్పనిసరిగా నమోదు చేయాలి.ఓవర్‌లోడింగ్‌కు నో బోటింగ్ చేసే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా లైఫ్ జాకెట్ ధరించాలి. ఎటువంటి వయస్సు మినహాయింపు లేదు. బోట్ల సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించడాన్ని పూర్తిగా నిషేధించారు. ప్రతి రోజు బోట్ల ఇంజిన్, ఇంధనం, అత్యవసర పరికరాలు, కమ్యూనికేషన్ వ్యవస్థలను తనిఖీ చేయాలి. బలమైన గాలులు, భారీ వర్షాలు, తక్కువ విజిబిలిటీ లేదా అధిక ఉష్ణోగ్రతల పరిస్థితుల్లో వెంటనే బోటింగ్ సేవలను నిలిపివేయాలని ఆదేశించారు. వాతావరణ సమాచారం నిరంతరం పర్యవేక్షిస్తూ ముందస్తు చర్యలు తీసుకోవాలి. ప్రతి యూనిట్‌లో ఫస్ట్ ఎయిడ్ కిట్లు, లైఫ్ బాయ్స్, తాళ్లు వంటి రక్షణ పరికరాలు తప్పనిసరిగా ఉండాలి. ప్రతి షిఫ్ట్‌లో కనీసం ఒక సిబ్బంది బేసిక్ లైఫ్ సపోర్ట్, వాటర్ రెస్క్యూ శిక్షణ పొందినవారై ఉండాలి. రద్దీ నియంత్రణకు ప్రత్యేక చర్యలు జెట్టీల వద్ద రద్దీని నియంత్రిస్తూ క్యూలైన్ వ్యవస్థను అమలు చేయాలి. వృద్ధులు, చిన్నపిల్లలు, వికలాంగులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

**జెట్టి భద్రతపై ప్రత్యేక దృష్టి ..**

బోర్డింగ్, డీబోర్డింగ్ సౌకర్యాలు సురక్షితంగా ఉండేలా చూడాలి. ఫ్లోటింగ్ ప్లాట్‌ఫారమ్‌లు, యాంకరింగ్ వ్యవస్థలను నిరంతరం తనిఖీ చేయాలి.



సిబ్బంది క్రమశిక్షణ తప్పనిసరి పీక్ సమయాల్లో సెలవులు అనుమతించరు. సిబ్బంది యూనిఫారంలో అప్రమత్తంగా ఉండాలి. నిర్లక్ష్యం లేదా విధుల పట్ల అలసత్వం చూపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోజువారీ నివేదికలు తప్పనిసరి ప్రతి రోజు భద్రత, ఘటనలపై నివేదికను జీఎం (వాటర్ ఫ్లీట్)కు సమర్పించాలి. ఎటువంటి లోపం జరిగినా వెంటనే తెలియజేయాలి. ఈ మార్గదర్శకాలను ఉల్లంఘించిన వారిపై సస్పెన్షన్ చర్యలు లేదా ఉద్యోగం నుండి తొలగింపు వరకు కఠిన చర్యలు తీసుకుంటామని టూరిజం శాఖ స్పష్టం చేసింది.

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
పటాన్‌చెరు సర్కిల్-46, శేరిలింగంపల్లి జోన్.

**Short Tender Notice No. Engg-04/CMC/PTC-C-46/2026-27, తేది: 30.04.2026**

**NIT No.** Short Tender Notice No. Engg-04/CMC/PTC-C-46/2026-27, తేది: 30.04.2026, పని పేరు: పటాన్‌చెరు సర్కిల్-46 లో SRPS మరియు SFల నియామకం-2 సంఖ్యలు. **అంచనా విలువ / ఇసివి:** రూ.30.12 లక్షలు, **డౌన్‌లోడ్ ప్రారంభ తేది:** 04.05.2026 ఉ.10.30గం.లకు, **బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం:** 11.05.2026 మ.12.00గం.ల వరకు, ఇ.ఇ. **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పటాన్‌చెరు సర్కిల్-22, ఫోన్: 9154167952. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @https://www.tender.telangana.gov.in పటాన్‌చెరు సర్కిల్-46లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పటాన్‌చెరు సర్కిల్-46, ఎస్ఎల్‌పి జోన్, సిఎంసి.

DIPR R.O. No. : 1795-PP/CL/ADVT/2026-27, Date: 02-05-2026

తెలంగాణ ప్రభుత్వం, దేవాదాయ ధర్మాదాయ శాఖ
**శ్రీ మైసమ్మ దేవత శివాలయ రామాలయ దేవస్థానము**
మైసిగండి గ్రా, కడ్తాల్ మం, రంగారెడ్డి జిల్లా-509358

**బహిరంగ వేలము ప్రకటన** **తేది: 02-05-2026**

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ! శ్రీ మైసమ్మ దేవత శివాలయ రామాలయ దేవస్థానము నందు 2026-2027 సంవత్సరమునకు అనగా తేది: 01-07-2026 నుండి 30-06-2027 వరకు ఈ దిగువ కనబరిచిన 2 హక్కులకు లైసెన్స్ బహిరంగ వేలము ద్వారా ఇచ్చుటకు తేది: 15-05-2026 శుక్రవారము ఉ. 10-30 ల నుండి ఆలయ ఆవరణలో వేలము పాటలు నిర్వహించబడును. లైసెన్స్ హక్కు కాలపరిమితి తేది: 01-07-2026 నుండి 30-06-2027 వరకు (ఒక సంవత్సరము) ఉండును.

| క్ర.సం. | వేలము వివరములు | డిపాజిట్ |
|---|---|---|
| 1 | శాక్తేయ మొక్కుబడుల రశీదు రుసుము వసూలు చేసుకొను హక్కు | 5,00,000 |
| 2 | పూలు, పూజా సామాగ్రి అమ్ముకొను హక్కు | 5,00,000 |

పైన చూపబడిన వేలము పాటలకు సంబంధించి ఇతర నియమ నిబంధనలను దేవాలయ కార్యాలయములో తెలుసుకొనగలరు. కరపత్రములో ఉన్న షరతులు వర్తించబడును. సెల్: 9989174398. ఇతర షరతులు, వివరములకు దేవస్థాన కార్యాలయములో సంప్రదించగలరు.

శ్రీమతి ఆర్. లక్ష్మీ శిరోళి
ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్

శ్రీమతి స్నేహలత
కార్యనిర్వహణాధికారి

DIPR R.O. No. : 1770-PP/CL/ADVT/2026-27, Date: 02-05-2026



## మెరుగైన సౌకర్యాలతో న్యాయ ప్రక్రియ మరింత వేగంః కలెక్టర్ మనుచౌదరి

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** రోజు రోజుకు పెరుగుతున్న కేసుల దృష్ట్యా న్యాయస్థానాల్లో కక్షిదారులకు, న్యాయవాదులకు మెరుగైన సౌకర్యాలు, వసతులు కల్పించటం ద్వారా న్యాయ ప్రక్రియ వేగంగా కొనసాగేందుకు దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ మనుచౌదరి అన్నారు. శనివారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కేంద్ర న్యాయస్థానంలో నూతనంగా నిర్మించిన కోర్టు హాలును రాష్ట్ర హైకోర్టు జస్టిస్ నందికొండ నర్సింగరావు, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి మరియు మేడ్చల్ జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి కె.లక్ష్మణ్, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయ్ సేన్‌రెడ్డిలతో కల్సి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయాధికారులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, పోలీసు అధికారులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## మాదకద్రవ్యాలకు నో చెప్పండి

### అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

**ప్రజాపక్షం/జవహర్ నగర్ః** 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం జవహర్ నగర్ లోని ఆర్మీ డెంటల్ కాలేజీలో మాదకద్రవ్యాల అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రభుత్వం యాంటీ నార్కోటిక్ బ్యూరో ను ఏర్పాటు చేసిందని, ముఖ్యంగా మేడ్చల్ పరిసరాల్లో సింథటిక్ డ్రగ్స్ కట్టడికి ఈగల్ కోర్స్ పేరుతో ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. డ్రగ్స్ రవాణా చేసే ముఠాలపై, నిబంధనలు ఉల్లంఘించే ఫార్మా కంపెనీలపై ఉక్కుపాదం మోపుతున్నామని అధికారులు హెచ్చరించారు. ఎవరైనా డ్రగ్స్ విక్రయించినా, వినియోగించినా వెంటనే 1903 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు రహస్యంగా ఉంచుతామని బాలల హక్కుల కమిషన్ సభ్యులు సరిత, చందన తెలిపారు. పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు నిరంతరం నిఘా ఉంచాలని, యువత వ్యసనాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని జాయింట్



డైరెక్టర్ మోతి, అదనపు డిసిపి నరసింహారెడ్డి సూచించారు. జవహర్‌నగర్ ప్రాంతాన్ని డ్రగ్స్ రహిత జోన్ గా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ సహకరించాలని ఎక్సైజ్ అధికారి నవీన్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి శారద, విద్యాశాఖ అధికారి హేమలత, ఏఎస్పీ (నార్కోటిక్) రమేష్, డ్రగ్ కంట్రోలర్ ఏడి లక్ష్మీ నారాయణ, ఐసిడిఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆర్మీ డెంటల్ కాలేజీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రభుత్వం, పోలీసులు ప్రజలు కలిసి కట్టుగా పోరాడాలని అధికారు లు ఈ సభ ద్వారా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఆర్ఐ సత్యనారాయణ, ఆర్మీ డెంటల్ కాలేజ్ విద్యార్థులు, స్థానికులు, యువత పాల్గొన్నారు.



## పదిలో మేడ్చల్ జిల్లా టాపర్ వై.లక్ష్మీనారాయణకు అభినందన

**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ సర్కిల్ బోరంపేట్ గ్రామానికి చెందిన వై.లక్ష్మీ నారాయణ ఇటీవలే పదో తరగతి పరీక్షల్లో మేడ్చల్ జిల్లాలోనే అత్యధిక మార్కులు సంపాదించి బోరంపేట్ గ్రామానికి ప్రభుత్వం పాఠశాలకు ఎంతో గర్వకారణమని దుండిగల్ సర్కిల్ బిజెపి అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి అన్నారు. అనంతరం విద్యార్థిని శాలువాతో సత్కరించారు. విద్యార్థిని అభినందిస్తూ సహాయసహకారాలు అందిస్తామని, బౌరంపేట పాఠశాల విద్యార్థులకు, ఉత్తమ సేవలు అందించిన ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలిపారు. బౌరంపేట్ మాజీ 17వ వార్డు కౌన్సిలర్ పీసరి బాలమణి కృష్ణారెడ్డి, ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సింగాపురం జంగారెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు అమ్మగారి ప్రభాకర్ రెడ్డి, మున్సిపల్ కోశాధికారి కొమ్ము ప్రశాంత్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## నూతన కౌన్సిలర్‌లకు ఘన సన్మానం

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** అలియాఆబద్ మున్సిపల్‌లో నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్‌లను ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు గౌనె హన్మంతరెడ్డి శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో శామీర్‌పేట మండల ప్రైవేట్ పాఠశాలల నుంచిఅలియాబాద్ మున్సిపాలిటి 4 వ వార్డు కౌన్సిలర్ దీపిక వరప్రసాద్‌రెడ్డి (సెయింట్ మేరిస్ హై స్కూల్ ) తుర్కపల్లి, 5 వ వార్డు కౌన్సిలర్ కన్‌రెడ్డి మాలతి మాధవరెడ్డి (సరస్వతి విద్యానికేతన్)లాల్‌గడిమలక్‌పేటకు వారిని ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు గౌనె హన్మంతరెడ్డి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట ట్రస్మా అధ్యక్షుడు మాధవరెడ్డి, కోశాధికారి దివ్యజ్యోతి, ట్రస్మా సభ్యులు శివశంకర్, పంచాక్షరి, సూరజ్, వరప్రసాద్‌రెడ్డి, వివిధ పాఠశాలల కరస్పాండెంట్‌లు, ప్రిన్సిపల్స్, తదితరులు పాల్గొన్నారు.





# ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలందరికీ అందాలనేదే లక్ష్యం

### 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'లో స్పీకర్ ప్రసాద్‌కుమార్

**ప్రజాపక్షం/వికారాబాద్ః**ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పథకాలు, రాష్ట్ర ప్రజలకు అందాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 99 రోజుల 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' ప్రారంభించింది అన్నారు. వికారాబాద్ నియోజకవర్గంలో అభివృద్ధికి 600 కోట్లతో రోడ్లు వేయించామన్నారు. ప్రతిగ్రామంలో 50లక్షలతో సిసిరోడ్లు వేయించామన్నారు. ఎన్నికల హామీలు కొన్ని కొన్ని పథకాల ను అమలు చేస్తున్నా ఇందులో ఇందిరమ్మ ఇండ్లు, రుణమాఫీ, సన్నబియ్యంవంటి పథకా లు అమలు చేస్తున్నాం అని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు గ్రామాలు, కాలనీలలోని ప్రజలకు తెలియజేయాలని అన్నారు, వికారాబాద్ నియోజకవర్గం అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామన్నారు. మర్పల్లి మండలానికి పబ్లిక్ స్కూల్ మంజూరు అయిందన్నారు.

జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి మాట్లాడుతూ 99రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామ సభలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామ పంచాయతీకి ప్రభుత్వ అదేశాల మేరకు బోర్‌వెల్స్ మంజూరు చేశామన్నారు. 594 గ్రామ పంచాయతీలలో ప్రభుత్వం అందిస్తున్న ప్రతి స్కీం ను అమలు చేస్తున్నామన్నారు. మంజూరైన నిధుల్లో అసంపూర్తిగా ఉన్న స్కూల్ భవనాలను పూర్తి చేస్తామన్నారు. జిల్లా ఎస్‌పి స్నేహమెహ్రా మాట్లాడుతూ రోడ్డు ప్రమదాలు జరగకుండా 'అలైవ్ అరైవ్' కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కలిపించామన్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, జెడ్‌పిటిసిఇఒ సుధీర్, మున్సిపల్ చైర్‌పర్సన్ అనన్య, మున్సిపల్ కమిషనర్ విక్రంసింహారెడ్డి, యంపిడిఒ విజయ్‌కుమార్, వైస్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి , మార్కెట్ కమిటీ చైర్మన్‌లు శ్రీనివాస్ ముదరాజు,మహేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**నీట్ ఎగ్జామ్స్ సెంటర్ పరిశీలించిన కలెక్టర్ దీపక్‌తివారి**

3న వికారాబాద్ జిల్లా నాలుగు సెంటర్లలో జరగనున్న నీట్ పరీక్ష నిర్వహణను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. శనివారం జిల్లా ఎస్‌పిస్నేహమెహ్రాతో కలిసి కొత్తగడి రెసిడెన్సియల్ స్కూల్ లోని సెంటర్‌ను పరి



శీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పరీక్ష కేంద్రాలలో అన్ని మౌలిక సదుపాయలు కల్పించాలని ఆదేశించారు. ఉదయం 11గంటలనుండి మధ్యాహ్నం 1.30 వరకు జరుగనున్న నీట్ పరీక్షకు అభ్యర్థు లు హాజరును బయోమెట్రిక్ విధానం ద్వారా తీసుకోవడం జరుగుతుందన్నారు. పరీక్ష రాసే అభ్యర్థులను సక్రమంగా తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రశ్నా పత్రాల తరలింపు కార్యక్రమం అన్ని శాఖల అధికారులు సమవన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

**ప్రజా సమస్యల పరిష్కారం కొరకు ప్రజావాణి డివిజన్ అధికారులను నియమాకం :**

ప్రజాసమస్యలను పరిష్కారం కొరకు నిర్వహిం చే ప్రజావాణి కార్యక్రమాన్ని రెవెన్యూ డివిజన్ అధికారిని నోడల్ అధికారిగా నియమించి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి తెలిపారు. ప్రజావాణి కార్యక్రమం ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరణ, స్వీకరించిన దరఖాస్తులను 30రోజు ల్లో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని , లేనిపక్షంలో తిరిస్కరణకు గల కారణాలతో దరఖాస్తుదారులకు సమాచారం అందించాలని తెలిపారు.

ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులు సంబంధిత వివరాలను పోర్టల్ లో నమోదు చేసిరశీదు అందించాలని, దరఖస్తుదారులకు ప్రజావాణి పోర్టల్‌లో తమ దరఖాస్తులను సమర్పించడానికి వచ్చే ప్రజలకు త్రాగునీరు, కుర్చీలు, అత్యవసర వైద్య సేవలను అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

**కాంగ్రెస్ పార్టీలో చేరిన కామారెడ్డి గూడ సర్పంచ్ శంకరమ్మ**

**వికారాబాద్ రూరల్ :** వికారాబాద్ మండల పరిధిలోని కామారెడ్డి గూడ గ్రామ సర్పంచు శంకరమ్మ శాసన సభ స్పీకర్ ప్రసాద్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా శంకరమ్మకు శుభాకాంక్షలు తెలి



పారు.మండల పార్టీ అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# సమాజాభివృద్ధిలో విద్యార్థుల పాత్ర కీలకం

### సంక్షేమ అధికారిణి బి.కృష్ణవేణి

**ప్రజాపక్షం/నవాబుపేట్ః** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ రోజు వికారాబాద్ జిల్లా నవాబుపేట్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో మిషన్ వాత్సల్య పథకం, జిల్లా మహిళా శిశు దివ్యాంగుల , వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల పంచాయతీ సభ మరియు మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా సంక్షేమ అధికారిణి బి.కృష్ణవేణి హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా సంక్షేమ అధికారిణి బి.కృష్ణవేణి మాట్లాడుతూ, మాదకద్రవ్యాల నిర్మూలనకు జిల్లాలో నష ముక్త్ భారత్ కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. యువతలో మాదక ద్రవ్యాల నియంత్రణకు వారిచే ప్రతిజ్ఞలు చేయిస్తున్నారు. తల్లిదండ్రులు ముఖ్యంగా చెడు అలవాట్లకు మద్యపానానికి బానిసలు కావొద్దని, పిల్లలు తల్లిదండ్రులను చూసి చెడు అలవాట్లకు, మద్యపానానికి, గంజాయికి అలవాటు పడుతున్నారని, తమ పిల్లలతో స్నేహితుల వలె మెలగాలని సూచించారు.

పిల్లల వ్యక్తిగత గదులు అదే విధంగా వారి యొక్క బ్యాగులను అప్పుడప్పుడు తనిఖీ చేస్తూ ఉండాలని తెలిపారు. తద్వారా పిల్లల యొక్క అలవాట్లు వారి ఆలోచనలను ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు తెలుసుకోవచ్చని తెలిపారు. యువత చెడు స్నేహాలను విడనాడాలని సూచించారు. మాదకద్రవ్యాలకు బానిస అయిన వారికి ప్రత్యేకమైన కౌన్సిలింగ్, పునరావాస కేంద్రాలు ద్వారా పునరావాసం పొందుతున్నారు. వివిధ కార్యక్రమాలు గ్రామస్థా





యిలో బాల పంచాయతీలు నిర్వహించి పిల్లల సమస్యలను గుర్తించాలని అన్నారు. పిల్లలకు ప్రత్యేకమైన గుర్తింపు ఇవ్వాలని వారిని బాలసభల ద్వారా సంఘటితపరచడంతో బాలల వ్యక్తిగత సమస్యలు చర్చకు వస్తాయి. తరువాత వారి యొక్క హక్కుల అమలుకు కృషి జరుగుతుందన్నారు. చట్టబద్ధమైన దత్తత గురించి ప్రజలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

చట్ట విరుద్ధమైన దత్తత తీసుకోరాదని తెలిపారు. హక్కులకు భంగం కలగకుండా చూస్తామని జిల్లాలో మదనపల్లి డిసిపిఒ శ్రీకాంత్, జిల్లాలో అత్యధికంగా నమోదవుతున్న బాల్యవివాహాల గురించి, అనాథ పిల్లల గురించి, చట్టబద్ధమైన దత్తత గురించి వివరించారు. గ్రామాల్లో బాల్యవివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిదని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు గ్రామ సర్పంచ్ నరసింహారెడ్డి మాట్లాడుతూ, యువత మత్తుకు బానిసలు కాకుండా చదువుకోవాలని ఉన్నతమైనటువంటి లక్ష్యాలను కలిగి ఉండాలని సూచించారు. గ్రామస్థాయిలో పిల్లల సంరక్షణ బాధ్యతతో పాటు బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేస్తామని, పిల్లల సంరక్షణ విషయంలో ముందస్తు సమాచారం ఇస్తామని తెలిపారు. జిల్లా స్థాయి పంచాయతీ ఆఫీసర్ సంధ్యారాణి ప్రతి గ్రామపంచాయతీలో ప్రతి ఆరు నెలలకు ఒకసారి బాలసభ నిర్వహించాలని అందులో ముఖ్యంగా గ్రామసభలో బాలసభలు గ్రామ సర్పంచ్ లకు, పంచాయతీ సెక్రెటరీలను కోరారు. గ్రామ పంచాయతీ ద్వారా పిల్లల యొక్క సమస్యలను గుర్తించి పరిష్కరించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎంఇఒ అబ్దుల్ రహమాన్, సిఐ అన్వర్ పాషా, రాఘవేని, భరోసా ఎస్సై శ్వేత, స్రవంతి, ఎంపి విజయ్ కుమార్, బాలల సంరక్షణ అధికారులు ఆంజనేయులు, రాజు నాయక్, యంగిస్తాన్ ఫౌండేషన్, ప్రతినిధులు సిరిక, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లేశం, ఉపాధ్యాయులు వివిధ గ్రామాల పంచాయతీ సెక్రెటరీలు, బాల బాలికలు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రియల్టర్ల కబంధ హస్తాల్లో పోతారం వాగు

### బండరాళ్లు, మట్టిపోసి వాగును ఆక్రమిస్తున్న రియల్టర్‌లకు అధికారుల అండదండలు

**ప్రజాపక్షం/శామీర్‌పేటః** ప్రభుత్వభూములకు, చెరువులకు, కుంటలకు రక్షణ



లేకుండా పోయిందని నీటి పారుకం గల వాగులను రియల్టర్లు, దళారులు ఆక్రమిస్తున్న సంబంధిత అధికారులకు పట్టింపు లేకుండా పోయిందని మూడుచింతలపల్లి మండల రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా చిన్నపర్వతాపూర్ రెవెన్యూ పరిధిలోని పోతారం వాగును కొందరు రియల్టర్లు బండరాళ్లు వేసి మట్టిపోసి పూడ్చుతున్న ఘటనలపై పలు దిన పత్రికల్లో వార్తా కథనాలు ప్రచురిస్తున్నా సంబంధిత శాఖల అధికారులు మొద్దు నిద్రలో ఉండి ఆక్రమణలను పట్టించుకోవడం లేదని రైతులు మండిపడుతున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు రాత్రికి రాత్రే టిప్పర్ల ద్వార మట్టిని తీసుకవచ్చి వాగును పూడ్చుతున్న కూతవేటు దూరంలో ఉన్న రెవెన్యూ అధికారులు ఇప్పటివరకు ఆపే ప్రయత్నం చేయలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇట్టి విషయమై ప్రజాపక్షం దినపత్రిక విలేకరి స్థానిక తహసీల్దార్ దృష్టికి తీసుకవెళ్లి వివరించిన అధికారులకు చెబుతాం మెమోలు జారీ చేస్తాం అని చెప్పడమే కానీ ఇప్పటివరకు ఏలాంటి చర్యలు చేపట్టలేదు. ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో ఇలాంటి ఆక్రమణలపై చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇర్రిగేషన్ శాఖ అధికారులు ఈ నెల 4న పోతారం వాగు ఆక్రమణకు గురవుతోందని రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేసిన ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఇప్పటికైన స్థానిక రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు పోతారం వాగును సందర్శించి సర్వే చేయాలని రైతులు కోరుతున్నారు.



## ప్రభుత్వం నిర్ణయించిన ధరకు మొక్కజొన్నను విక్రయించాలి : కలెక్టర్

**ప్రజాపక్షం/వికారాబాద్ః**మార్క్‌ఫెడ్, డిసిఎంఎస్ ఆధ్వర్యంలో వికారాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్న మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ దీపక్‌తివారీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల వద్ద ప్రభుత్వం నిర్ణయించిన ధరకు మొక్కజొన్నను విక్రయించాలని దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వ మద్దతు ధర 2400 మద్దతు నిర్ణయించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ ముదిరాజ్, మార్క్‌ఫెడ్ డిఎం రేఖ, డిసిఎంఎస్ మేనేజర్, సుదర్శన్‌రెడ్డి, వికారాబాద్ తహసీల్దార్ లక్ష్మి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు కో ఆప్షన్ మెంబర్లు కాంగ్రెస్‌కే

**ప్రజాపక్షం/పరిగి :** మున్సిపల్ కార్యాలయం లో జరిగినటువంటి మున్సిపల్ కో ఆప్షన్ ఎన్నికల్లో నాలుగు కో ఆప్షన్ మెంబర్లను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుందన్నారు. ఇందులో మైనార్టీ నుండి అక్బర్ హుసేన్, క్రిస్టయన్ మైనార్టీ నుండి కమల అనంద్, జనరల్ నుండి అంజనేయులు, సీనియర్ సిటిజన్ పిరంగి పద్మ, ఎన్నికై న వారికి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి శుభాకాంక్ష లు తెలిపారు. మున్సిపల్ అభివృద్ధిలో మీ యొక్క సలహాల్లో కీలకంగా వ్యవహరించాలని తెలియజేశారు. రాబోయే రాజుల్లో పరిగి మున్సిపల్‌ను అన్ని రకాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపా రు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత, వైస్ చైర్మన్ హనుమంతు కమల్ తదితరులు పాల్గొన్నారు.





## అలియాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా వెంకట్‌రెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మల్కాజ్‌గిరి జోనల్ కార్యాలయంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహించిన వెంకట్‌రెడ్డి అలియాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అలియాబాద్‌లో గతంలో కమిషనర్‌గా విధులు నిర్వర్తించిన చంద్రశేఖర్‌ను మున్సిపల్ చైర్ పర్సన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డి శాలువా కప్పి వీడ్కోలు పలికారు. అలాగే నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన వెంకట్‌రెడ్డికి మున్సిపల్ చైర్ పర్సన్ పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి పరుచుటకు కృషి చేయాలని చైర్ పర్సన్ కమిషనర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కమఠం కృష్ణారెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## దుండిగల్ డిప్యూటీ కమిషనర్‌గా డాక్టర్ ఎస్.వి.మణి కరణ్

**ప్రజాపక్షం/దుండిగల్ః**సాధారణ బదిలీలలో భాగంగా దుండిగల్ సర్కిల్ కు డిప్యూటీ కమిషనర్ గా డాక్టర్ ఎస్.వెంకట మణి కరణ్ బాధ్యతలు స్వీకరించరు, కమిషనర్ గా పలు మున్సిపాలిటీ లలో గతంలో పని చేశారు. సిఎంసి కమిషనర్ కు ఓఎస్డి పిఆర్ఓ గా పని చేసి ఉన్నారు.



## లయన్స్ క్లబ్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్‌గా అమర్‌నాథ్‌రావు ఎన్నిక

**ప్రజాపక్షం శామీర్‌పేట :** లయన్స్ అంతర్జాతీయ సేవా సంస్థ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విస్తరించి ఉన్న 8లయన్స్ జిల్లాలకు చెందిన 320 మల్టిపుల్ కౌన్సిల్ 11వ చైర్మన్‌గా 320 జిల్లా గవర్నర్ లయన్ అమర్‌నాథ్‌రావు ఎన్నికయ్యారు. శనివారం శామీర్‌పేట డివిజన్ అంతాయిపల్లి లోని ఎస్ఎన్ఆర్ కన్వెన్షన్‌లో జరిగిన సమావేశంలో ఎన్నికైనట్లు ప్రస్తుత చైర్మన్ టి.రాజేంద్రప్రసాద్ ప్రకటించారు. రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన మే 2,3వ తేదీల్లో మల్టిపుల్ పదవ మహాసభలు నిర్వహిస్తున్నారు. కౌన్సిల్ చైర్మన్‌గా ఎన్నికైన అమర్‌నాథ్‌రావు విద్యారంగం, లయనిజం రెండింటిలోను దూరదృష్టి కల్గిన మహోన్నత వ్యక్తిత్వం గల నాయకుడని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాబురావు, సునీల్‌కుమార్, జిల్లా గవర్నర్లు, వైస్ గవర్నర్లు, పూర్వ గవర్నర్లు, మల్టిపుల్ ఆర్ఒ కన్న పరుషరాములు, క్యాబినెట్ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి మర్రి ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## డిజిపికి పీసరి మహిపాల్‌రెడ్డి శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** తెలంగాణ రాష్ట్ర డిజిపిగా బాధ్యతలు స్వీకరించిన సివి ఆనంద్‌ను టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి శనివారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ రాష్ట్రానికి సివి ఆనంద్ డిజిపిగా రావడం సంతోషంగా ఉందన్నారు. పూలబొకేతో శుభాకాంక్షలు తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణకు సీవి ఆనంద్ ముందుంటరని పేర్కొన్నారు.

## డివిజన్ స్థాయిలో ప్రజావాణి

**ప్రజాపక్షం/తాండూరుః** రెవెన్యూడివిజన్ స్థాయిలో సోమవారం నుండి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తునట్లు జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోరకు రెవెన్యూ డివిజన్ స్థాయిలో నోడల్ అధికారిని నియమించి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహణకు చర్యలు చేపట్టడం జరుగుతుందని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. డివిజన్ స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులను 30రోజుల్లో పరిష్కరించెందుకు చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో తిరస్కరణ, అందుకు గల కారణాలతో దరఖాస్తుదారులకు సమాచారం అందజేయాలని సూచించారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తుల సంబంధిత వివరాలను పోర్టల్‌లో నమోదు చేసి రసీదు అందించాలని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు ప్రజావాణి పోర్టల్‌లో తమ దరఖాస్తు స్థితిని తెలుసుకోవచ్చనని తెలిపారు. ప్రజావాణి దరఖాస్తులు సమర్పించాడనికి వచ్చే ప్రజలకు తాగునీరు, కుర్చీలు, అత్యవసరమైన వైద్య సేవలను అందుబాటులో ఉండాలని సూచించారు. సోమవారం నుండి నిర్వహించే డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

# ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు ఊరట

- ఫీజులో మరోసారి 25 శాతం రాయితీ
- జిహెచ్ఎంసి సర్కిల్ కార్యాలయాల్లో హెల్ప్ డెస్కుల ఏర్పాటు
- అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) పరిధిలోని లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్ 2020) దరఖాస్తుదారులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. ఎల్ఆర్ఎస్ ఫీజులపై గతంలో ప్రకటించిన 25 శాతం రాయితీ గడువును ప్రభుత్వం మరో మూడు నెలల పాటు అవకాశం కల్పించింది. ఈ మేరకు జిఓ నెంబర్ 131 జారీ చేసింది. కొత్త ఉత్తర్వుల ప్రకారం, ఈ నెల 1 నుంచి జూలై 31 వరకు దరఖాస్తుదారులు 25 శాతం రిబేటుతో ఎల్ఆర్ఎస్ ఫీజులు చెల్లించుకునే అవకాశం పొందనున్నారు. గతంలో ఈ రాయితీ గడువు 2025 మే 31తో ముగిసింది. అయితే ప్రజలకు మరింత సౌలభ్యం కల్పించేందుకు ప్రభుత్వం గడువును తిరిగి పొడిగించింది. ఇక దరఖాస్తుదారులకు సహాయం అందించేందుకు జిహెచ్ఎంసి అన్ని సర్కిల్ కార్యాలయాల్లో ప్రత్యేక హెల్ప్‌లైన్ డెస్కులు, కాల్ సెంటర్లు ఏర్పాటు చేసింది. శనివారం నుంచి ఈ సేవలు ప్రారంభమయ్యాయి. ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇవి అందుబాటులో ఉంటాయి. హెల్ప్‌లైన్ డెస్కుల ద్వారా దరఖాస్తు స్థితి వివరాలు, పత్రాల లోపాలపై సూచనలు, ఫీజు చెల్లింపుల ప్రక్రియపై మార్గదర్శనం, అలాగే ఎల్ఆర్ఎస్ పోర్టల్ వినియోగంపై సాంకేతిక సహాయం అందించనున్నారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి చెందిన సిబ్బందిని ప్రత్యేకంగా నియమించి, ప్రజలకు సేవలు అందిస్తున్నారు. అదనంగా, హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియా పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం '99 రోజుల యాక్షన్ ప్లాన్'ను అమలు చేస్తోంది. ఇందులో భాగంగా ప్రత్యేక డ్రైవ్‌లు, మేళాలు నిర్వహిస్తున్నారు. భవన నిర్మాణ అనుమతుల సమయంలో ఓపెన్ స్పేస్ ఛార్జీలు చెల్లించే వారికి ఈ 25 శాతం రాయితీ వర్తించదని అధికారులు స్పష్టం చేశారు. కేవలం నిర్ణీత గడువులోపు పూర్తి ఫీజు చెల్లించిన వారికి మాత్రమే ఈ సౌకర్యం లభిస్తుంది. ప్రతి సర్కిల్ కార్యాలయంలో హెల్ప్ డెస్కుల సమాచారంతో కూడిన బ్యానర్లను ఏర్పాటు చేసినట్లు జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ తెలిపారు. ప్రజలు తమ సమీప సర్కిల్ కార్యాలయాన్ని సంప్రదించి, ప్రభుత్వం కల్పించిన ఈ 25 శాతం రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలని ఆయన సూచించారు.

## ఔటర్ రింగ్ రోడ్డుపై మరో కారు ప్రమాదం

వ్యాగన్ ఆర్ కారు బోల్తా.. ప్రయాణికులకు స్వల్ప గాయాలు

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై వరుసగా జరుగుతున్న కారు ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. శుక్రవారం ఒఆర్ఆర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయిన ఘోర ప్రమాదం మరవకముందే, శనివారం తుక్కుగూడ ఓ ఆర్ ఆర్ ఎగ్జిట్ 14 సమీపంలో మరో కారు ప్రమాదం చోటుచేసుకుంది.మారుతి సుజుకి తయారీకి చెందిన మారుతి వాగన్ వ్యాగన్ ఆర్ కారు వేగంగా ప్రయాణిస్తుండగా అకస్మాత్తుగా టైర్ పంచర్ కావడంతో డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోయాడు. దీంతో కారు డివైడర్‌ను ఢీకొని పల్టీలు కొట్టింది.ప్రమాద సమయంలో కారులో ఉన్న ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.ఈ ఘటనలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి.ప్రమాదాన్ని గమనించిన స్థానికులు, అక్కడుగా వెళ్తున్న వాహనదారులు వెంటనే స్పందించి గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి అధిక వేగమా, లేక టైర్ స్థితి బలహీనంగా ఉండటమే కారణమా అనే కోణంలో విచారణ కొనసాగుతోంది.ఈ ప్రమాదం కారణంగా కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. అనంతరం పోలీసులు వాహనాన్ని పక్కకు తరలించి ట్రాఫిక్‌ను సవ్యంగా నిర్వహించారు. ఇటీవల వరుసగా జరుగుతున్న ప్రమాదాల నేపథ్యంలో ఔటర్ రింగ్ రోడ్డుపై వేగ నియంత్రణ, వాహనాల సాంకేతిక స్థితిపై మరింత కట్టుదిట్టమైన చర్యలు అవసరమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## తెలంగాణ అభివృద్ధిలో ఆర్యవైశ్యుల పాత్ర కీలకం

మంత్రి వివేక వెంకటస్వామి



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో ఆర్యవైశ్యుల భాగస్వామ్యం కీలకమని... కాంగ్రెస్ ప్రభుత్వంలో వారికి తగిన ప్రధాన్యత కల్పిస్తున్నట్లు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఇబ్రహింపట్నం శాసన సభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డిలు తెలిపారు. శనివారం వనస్థలిపురంలోని జిఎస్ఆర్ కన్వేన్షన్ హాల్‌లో నిర్వహించిన ఆర్యవైశ్య మహాసభలో రాష్ట్ర అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన అమరవాది లక్ష్మీ నారాయణ గుప్త ప్రమాణస్వీకారం కార్యక్రమం మంత్రి, మండలి చైర్మన్, ఇబ్రహింపట్నం శాసన సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్యవైశులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అదుకుంటుందని, ప్రభుత్వం ఎల్లప్పుడూ ఆర్యవైశ్యులకు అండగా ఉంటుందని వారు పేర్కొన్నారు. అనంతరం ప్రమాణస్వీకారం చేసిన అమరవాది లక్ష్మీ నారాయణను శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రామ్‌రెడ్డి, ఆర్యవైశ్యుల సంఘం ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## తక్షణమే పాలమూరు- రంగారెడ్డిని పూర్తి చేయాలి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:**పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల ద్వారా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పది లక్షల ఎకరాలకు నీళ్లు ఇస్తామని గత బిఆర్ఎస్ ప్రభుత్వం 11ఏళ్ళ కిందట ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పెండింగ్ ప్రాజెక్టుల జెఎసి షాద్‌నగర్ శాఖ నాయకుడు అర్జునప్ప వివరించారు. శనివారం షాద్‌నగర్‌లో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అర్జునప్ప మాట్లాడుతూ ఉమ్మడి పాలమూరు జిల్లాలో 90శాతం ప్రాజెక్టు పూర్తి చేశామని ప్రజలను మోసం చేస్తున్నారే తప్పా ఒక్క ఎకరాలకు సాగునీరు అంధించలేదని మండిపడ్డారు. ఈ జిల్లాకు చెందిన వ్యక్తి ముఖ్యమంత్రి అయ్యారు కాబట్టి తక్షణమే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలని కోరారు. ఉమ్మడి జిల్లాలో పదిలక్షల ఎకరాలకు సాగునీరు అందించిన తరువాతే మిగతా ప్రాంతాలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నుండి డిండి ఎత్తిపోతల పథకం ద్వారా నల్గొండకు తరలించేందుకు కుట్రలు చేస్తున్నారని వాపోయారు.పాలమూరు జిల్లా రాజకీయ నాయకులు కళ్లు తెరిచి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి డిండి ప్రాజెక్టును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్‌ను తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టిజి శ్రీనివాస్, మందారం నరసింహులు, గొర్లరాము, బిజిలి సత్యం, రవికుమార్, తిరుమలయ్యలు పాల్గొన్నారు.

## మహిళాలు అన్ని రంగాల్లో రాణించడమే ప్రభుత్వ లక్ష్యం



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** మహిళాలను అన్ని రంగాల్లో రాణించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని తెలంగాణ రాష్ట్ర డైరీ డెవలప్మెంట్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి పేర్కొన్నారు. శనవారం బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ సచివాలయ నగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన మహిళా తీమ్ పార్క్ వద్ద ఇందిరా మహిళా శక్తి పథకం క్రింద ఏర్పాటు చేసిన తెలంగాణ విజయ డైరీ పార్లర్‌ను స్థానిక మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీ ప్రసన్న రామ్మోహన్ గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అమిత్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళాలకు కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు ఇచ్చి వారిని ఆర్థికంగా బలోపేతానికి కృషి చేస్తున్నా ప్రభుత్వం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అని కోనియాడారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్గిరి మున్సిపల్ అడిషనల్ కమిషనర్ రఘు ప్రసాద్, పిడి యుసిడి సురేష్, నాయకులు ముద్దగౌని మనీష్ గౌడ్, ప్రాజెక్టు అధికారి విక్రాంత్‌రెడ్డి, సీఓ రాకేష్, వేంకటేష్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర అభివృద్ధికి సహకరించండి



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** ఎల్‌బి నగర్ నియోజకవర్గంలో పలు డివిజన్‌లో నెలకొన్న సమస్యలను త్వరగా పరిష్కారం చూపే విధంగా నిధులు మంజూరు చేసి పరిష్కరించే విధంగా జోనల్ కమిషనర్ చర్యలు తీసుకోవాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఎల్‌బినగర్ జోనల్ కమిషనర్ వికాస్ మహతోను మర్యాదపూర్వకంగా వారి కార్యాలయంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి మాట్లాడుతూ ఇటీవల జిల్లా ఇంచార్జీ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు కలిసి నియోజకవర్గ సమస్యలపై వివరించడం జరిగిందని, సమస్యలపై సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో పరివేక్షణ చేసి డివిజన్‌లో ఉన్న ప్రతి సమస్యలను సత్వరమే పరిష్కరించే విధంగా అధికార యంత్రాగం చోరవ తీసుకోవాలని ఆయన కోరారు. ఆయన వెంట యువ నాయకులు యరమల రామచంద్ర రెడ్డి, జక్కిడి సత్యతేజ రెడ్డి తదితరులు ఉన్నారు.

## విద్యతోనే సమాజంలో గుర్తింపు లభ్యం

**ప్రజాపక్షం/కేశంపేట:** విద్యతోనే సమాజంలో గుర్తింపు వస్తుందనే విషయాన్ని ప్రతి విద్యార్థి గుర్తించుకోవాలని మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణువర్ధన్ రెడ్డి సూచించారు. శనివారం కేశంపేట మండలం పాపిరెడ్డిగూడ గ్రామంలో పాపిరెడ్డిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన 10వ తరగతి విద్యార్థులను శాలువాలతో సత్కరించి అభినంధించారు. ఈ సందర్భగా మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యంశాలను శ్రద్ధగా నేర్చుకుంటే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకునే అస్కారం ఉంటుందని అన్నారు. విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకొని విద్యను అభ్యసిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకోవడమే కాకుండా భవిష్యత్ బంగారు మయంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జ్యోతి నరేందర్‌రెడ్డి, వార్డు సభ్యులు నరేందర్, అబ్బి శ్రీనివాస్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చాలన్నదే ప్రజా ప్రభుత్వ సంకల్పం



తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి :** అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ (టియుఎఫ్ఐడిసి)చల్లా నర్సింహారెడ్డి అన్నారు. మార్చ్ 6 నుండి జూన్ 12 వరకు 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా శనివారం నియోజకవర్గ స్థాయి సభలలో భాగంగా రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో జరిగిన నియోజక వర్గ స్థాయి సమావేశంలో టియుఎఫ్ఐడిసి చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.చంద్రారెడ్డితో కలిసి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందుగా జయ జయహే తెలంగాణ రాష్ట్ర గేయంతో సభకు శ్రీకారం చుట్టారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. ఈ సందర్భంగా టియుఎఫ్ఐడిసి చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ కార్యక్రమాలలో అన్ని వర్గాల వారు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి అవగాహణ పెంపొందించుకోవాలని సూచించారు. అదే విధంగా రైతు భరోసా, రైతు బీమా, ఇందిరమ్మ ఇళ్ల పథకం, గృహ జ్యోతి, చేయూత పథకం,కళ్యాణలక్ష్మి,షాదీ ముబారక్ పథకాలు, కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ తదితర వాటి ద్వారా లబ్ధి పొందిన వారి వివరాలు చదివి వినిపించారు. అకంతరం జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)కె చంద్రారెడ్డి మా ట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, మును ముందు అమలు చేయనున్న పథకాల గురించి ప్రజలకు తెలియజేస్తూ,రాష్ట్ర ప్రగతి,సంక్షేమంలో వారిని భాగస్వామ్యం చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం "ప్రజా పాలన ప్రగతి ప్రణాళి" కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని అన్నారు. ప్రభుత్వం రైతు భరోసా పథకం,ఇందిరమ్మ ఇం డ్లు, మహాలక్ష్మి పథకం,మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 లకే గ్యాస్ సిలిండర్,గృహ జ్యోతి (200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్),కళ్యాణలక్ష్మి/షాదీ ముబారక్, చేయూత పథకం కింద పెన్షన్‌లు పకడ్బందీగా అమలు చే స్తూ రాష్ట్ర అభివృద్ధి ప్రయోజనాలను ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన ప్రతి కు టుంబం ఈ పథకాల ప్రయోజనాలను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ జగదీశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల అవగాహన కార్యక్రమం

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా,'బాలల భద్రత అండ్ రక్షణ, మాదక ద్రవ్యాలకు' వద్దు 'చెప్పే సంక్షేమ వారోత్సవాల' కింద, రంగారెడ్డి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో జిల్లా స్థాయి మాదక ద్రవ్యాల అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. సంక్షేమం,ఆరోగ్యం,పోలీస్,ఐసిడిఎస్,ఐసిపిఎస్‌తో పాటు ఇతర సంబంధిత శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమం చేపట్టారు. ఇందులో ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు,క్షేత్ర స్థాయి సిబ్బంది,సామాన్య ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

**చేవెళ్ల నియోజకవర్గంలో:** చేవెళ్లలోని కెజిఆర్ ఫంక్షన్ హాల్‌లో ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి స్థానిక ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి,ఎంఎల్‌ఎ కాలే యాదయ్యతో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు, రెవెన్యూ, ఆరోగ్యం, పోలీస్, ఐసిడిఎస్,ఐసిపిఎస్,పంచాయతీ రాజ్ వంటి వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో స్థానిక ఎంఎల్ఎ ప్రకాష్ గౌడ్,ఎం ఎల్ సి మీర్జా రహమత్ బేగ్, నాయకత్వంలో ఈకార్యక్రమం నిర్వహించబడింది.కార్యక్రమంలో ఆర్‌డిఓ,తహసీల్దార్,ఎంపిడిలు,సర్పంచులు,మున్సిపల్ కౌన్సిలర్లు, ఆరోగ్యం, పోలీస్, ఐసిడిఎస్,ఐసిపిఎస్, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**హయత్‌నగర్‌లో :** హయత్‌నగర్ ప్రాజెక్ట్‌లో, ఎలిమినేటి మాధవ రెడ్డి కమ్యూనిటీ హాల్‌లో, డిప్యూటీ కమిషనర్ బి. శ్రీనివాస్, జోనల్ కమిషనర్ వికాస్ మహత్, ఎంఎంసి అదనపు కమిషనర్ రవి ప్రసాద్‌ల సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఓ, ఎంపిడిఓలతో పాటు ఐసిడిఎస్, ఐసిపిఎస్, ఆరోగ్య, విద్యుత్, విద్యా శాఖల ప్రతినిధులు సహా జిల్లా అధికారులు పాల్గొన్నారు. స్వయం సహాయక బృందాలు కూడా పాలుపంచుకున్నాయి. ఈ జిల్లా కార్యక్రమాన్ని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌మార్గదర్శకత్వంలో నిర్వహించగా, సీనియర్ జిల్లా అధికారులు నిశితంగా పర్యవేక్షించారు.రంగారెడ్డి జిల్లా,కచారంలోని వర్ధమాన్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో జిల్లా సంక్షేమ అధికారి ఎల్ శ్రీలత సమక్షంలో జిల్లా స్థాయి కార్యక్రమం కూడా విజయవంతంగా నిర్వహించబడింది.జిల్లా సంక్షేమ అధికారి ఎల్ శ్రీలత,ఈగిల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఎ. శ్రీనివాస రావు,డిప్యూటీ డిఎం హెచ్‌ఓ , డా. శ్రీనివాస రావు,డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు,రవి కిరణ్ ,అవినాష్,యూనిసెఫ్ సీనియర్ కన్సల్టెంట్ఎ.డేవిడ్ , అశ్రిత ఎన్‌జిఓ డైరెక్టర్ఎ. నాగరాజ్,వర్ధమాన్ ఇంజనీరింగ్ కళాశాల డీన్‌లు ప్రొఫసర్ ఎం.డి. ఆసిఫ్, వివేక్ కులకర్ణి, తదితరులు మాదక ద్రవ్యాల దుర్వినియోగం వల్ల కలిగే ప్రమాదాలు , వ్యక్తులు, కుటుంబాలు, సమాజంపై దాని సుదూర పరిణామాల గురించి అవగాహన కల్పించడంపై ఈ సమావేశం దృష్టి సారించింది.

## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రజాపాలన లక్ష్యం

- తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయాలన్నదే ప్రజాపాలన లక్ష్యమని, ఆ దిశగా పనిచేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం షాద్‌నగర్ పట్టణంలోని రెడ్‌రోజ్ పంక్షన్ హాల్‌లో ఆర్‌డిఓ సరిత అధ్యక్షతన 99రోజుల ప్రణాళికపై నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో పాటు రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కొప్పిశెట్టి కిరణ్మయి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి అనేక చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. అన్నదాతలు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు కోతలు లేకుండా నిరంతర విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు. లోవోల్టేజీ సమస్య ఉన్న ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. రైతు భరోసా, రైతుభీమా వంటి అనేక పథకాలను అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు. ఇచ్చిన హామీలను ప్రణాళిక బద్దంగా అమలు చేస్తున్నామని దాంతో ప్రజలందరు సంతోషంగా ఉన్నారని వివరించారు.

### విద్య, వైద్యంపై ప్రజలందరు దృష్టి కేంద్రీకరించాలి : అదనపు కలెక్టర్

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేస్తున్న విద్య, వైద్య రంగాలపై ప్రజలందరు దృష్టి కేంద్రీకరించేందుకు కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కొప్పిశెట్టి కిరణ్మయి సూచించారు. గ్రామ పంచాయతీల్లో ఉన్న సర్పంచులు, ఇందిరమ్మ కమిటి సభ్యులు, మహిళా సమాఖ్య సభ్యులు లబ్దిదారులను ప్రొత్సహించి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునే విధంగా కృషి చేయాలని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పేదవాడికి ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలని సూచించారు. అర్హులైన పేదలకు ప్రభుత్వ పథకాలను అందించకుండా నిర్లక్ష్యం చేస్తే శాఖ పరమైన చర్యలు ఉంటాయని సూచించారు. విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని, ఇందుకు ప్రజలందరు సహాకరించాలని కోరారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటిలు అభివృద్ధి సాధిస్తేనే రాష్ట్రం అభివృద్ధి సాధించినట్లు అవుతుందనే విషయాన్ని గ్రహించాలని సూచించారు. ప్రభుత్వం ఎంతో సదుద్దేశంలో తీసుకువస్తున్న పథకాలను అర్హులైన ప్రజలందరు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ది సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ బసవేశ్వర్ అప్ప, వైస్ చైర్మన్ అందె మోహన్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సులోచన కృష్ణారెడ్డి, వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, ఏసిపి లక్ష్మి నారాయణ, కమీషనర్ సునీత, తహాశీల్దార్ నాగయ్య, ఎంపిడిఓ బన్సీలాల్‌తోపాటు సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రైతులు ఆధునిక వ్యసాయ పద్ధతులు పాటించాలి

వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి



**ప్రజాపక్షం/యాచారం :** రైతులు అధునిక వ్యవసాయ పద్ధతులను పాటించి అధిక లాభాలు పొందాలని ప్రొఫెసర్ జయశంకర్ విశ్వ విద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ జగన్ మోహన్‌రెడ్డి, డాక్టర్ వరప్రసాద్ అన్నారు. శనివారం యాచారం మండల పరిధిలోని గున్‌గల్ గ్రామంలో రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు కార్యక్రమం ద్వారా రైతులకు అవగాహణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు వచ్చే పంటను రైతులు సాగు చేసుకోవాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు వ్యవసాయరంగంలో మేలకువలు పాటించాలన్నారు. సేంద్రియ ఎరువులను వాడాలన్నారు. యూరియా వాడకాన్నితగ్గించి నేల ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. పంట మార్పిడి విధానాన్ని రైతులు అలవర్చుకోవాలన్నారు. రసాయనిక ఎరువల వాడకాన్ని తగ్గించాలన్నారు. సుస్థిర ఆదాయాన్ని పొదండం, మార్కెట్‌లో గిరాకి ఉన్న వరి రకాలను పండించాలన్నారు. సాగు నీటిని ఆదా చేసి భావితరాలకు అందించాలన్నారు. సేంద్రియ ఎరువుల పండించిన పంటలు అరోగ్యానికి ఎంతగానో మేలు చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాసాని బుచ్చిరెడ్డి,వ్యవసాయధికారి అర్ రవినాథ్, ఎఇఓ స్వేత, దాదాపు 50 మంది రైతులు పాల్గోన్నారు.

## ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవ్

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



**ప్రజాపక్షం/ ఇబ్రహీంపట్నం :** ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హెచ్చరించారు.శనివారం ఇబ్రహీంపట్నం మండలం బొంగ్లూర్ సమీపంలో ప్రమీదా గార్డెన్‌లో 99రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వివిధ శాఖల అధికారులతో నియోజక వర్గం స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో సంబంధిత అధికారులు పర్యటించి ప్రజలు ఎదుర్కోంటున్న సమస్యలు గుర్తించి పరిష్కారించాలని సూచించారు.గ్రామాలలో గృహజ్యోతి, గ్యాస్ సిలిండర్, రేషన్ కార్డులు, తాగు నీరు, ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణం పనులు, లోఓల్టేజీ సమస్యలు, అండర్ డ్రైనేజీ పనులు,రైతు భరోషా, డ్వాక్రా రుణాలు పెండింగ్‌లో లేకుండా చూడలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 31వరకు పెండింగ్ సమస్యలన్ని పరిష్కారించాలని అధికారులకు సూచించారు.గ్రామాల అభివృద్ధిలో ప్రజాప్రనిధులతో పాటు అధికారులు భాగస్వాములు కావలని పిలుపునిచ్చారు. అనంతరం నియోజక వర్గంలోని ఎస్‌ఎచ్‌జి మహీళ గ్రూపులకు రూ.219కోట్ల 2లక్షల చెక్కును మహీళలకు అందచేశారు. సమావేశంలో ఆర్‌డిఓ అనంతరెడ్డి,ఎఎంసి చైర్మన్‌లు కె గురునాథ్ రెడ్డి, చిలుక మధుసూధన్ రెడ్డి,అబ్దుల్లాపూర్,ఇబ్రహీంపట్నం,మంచాల, యాచారం, మండలాల తహాసీల్ధార్‌లు,ఎంపిడిఓలు,మున్సిపల్ కమీషనర్‌లు,ప్రజాప్రతినిధులు,వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గోన్నారు.

## డివిజినల్ స్థాయి ప్రజావాణికి ఏర్పాట్లు : అదనపు కలెక్టర్

**ప్రజాపక్షం/రంగారెడ్డి :**డివిజినల్ స్థాయిలో 4వ తేదీ సోమవారం నుండి నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె చంద్రా రెడ్డి సంబంధిత ఆర్‌డిఓలకు సూచించారు. శనివారం ప్రజా సమస్యల పరిష్కారం కొరకు నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని రెవెన్యూ డివిజన్ స్థాయిలో నిర్వహించుటకు తగిన ఏర్పాట్లుపై జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులకి దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కొరకు జిఓ 3 ప్రకారం ఆర్‌డిఓల ఆధ్వర్యం లో ఈ నెల 4వ తేదీ సోమవారం నుండి నిర్వహించే ప్రజావాణి కార్యక్రమ నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేపట్టాలని, సోమవారం ప్రణాళిక కోసం ఆర్‌డిఓలు వెంటనే డివిజనల్ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి ప్రణాళిక ప్రకారం ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.ఇక నుండి ప్రతి సోమవారం ప్రతి డివిజన్ స్థాయిలో ప్రజావాణి నిర్వహించడం జరుగుతుందని ఆయా డివిజిన్ ప్రజలకు తెలిసే విధంగా ప్రచారం చేయాలని సూచించారు.అదే విధంగా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో అన్ని అసెం బ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాల బూత్ స్థాయి అధికారులు మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. బి ఎల్ ఓలు ప్రతి ఇంటికి వెళ్లి 18 సంవత్సరాల వయసు పైబడిన వారి వివరాలు సేకరించాలని,నిబంధనల ప్రకారం మ్యాపింగ్‌తో పాటు డూప్లికేట్ ఓటర్లు, మరణించిన ఓటర్ల వివరాలను గుర్తించి ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి పరిశీలించి వివరాలను ధ్రువీకరించి సవరించాలని తెలిపారు. ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం పై ప్రజలలో అవగాహన కల్పించాలని ఓటర్లను చైతన్యపరచాలని తెలిపారు.

## ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు సేవలు అందించాలన్నదే లక్ష్యం

టిఎన్‌జిఓ తాలుకా అధ్యక్షుడు జక్కుల శ్రీనివాసులు

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు సేవలు అందించాలన్నదే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు టిఎన్‌జిఓ షాద్‌నగర్ తాలుకా అధ్యక్షుడు జక్కుల శ్రీనివాసులు తెలిపారు. శనివారం మున్సిపాలిటి పరిధిలోని 6వ వార్డు సాయిబాబా కాలనీ అభివృద్ధి కమిటీ అధ్వర్యంలో జక్కుల శ్రీనివాసులును పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జక్కుల శ్రీనివాసులు మాట్లాడుతూ ఉద్యోగ పర్వంలో తాను ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. తనకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ అన్ని విభాగాల ఉద్యోగులతో సమన్వయం చేసుకుంటూ కాలనీ వాసులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న తాను ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు తగిన వైద్యసేవలు అంధించి వారి మన్ననలు పొందుతున్నట్లు తెలిపారు. నాకు ఈ అవకాశం కల్పించిన వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా కాలనీ అభివృద్ధి కమిటి సమన్వయ కర్త డాక్టర్ వెంకన్న బాబు, గౌరవ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, మాజీ అధ్యక్షుడు బోర్వెల్ రాములు గౌడ్, అమర్నాథ్‌రెడ్డి, నాట్కో చంద్రశేఖర్‌రెడ్డి, సీనియర్ న్యాయవాది బెన్నూరి చంద్రయ్య, 26వ వార్డు కౌన్సిలర్ ఎస్‌పి శివ, రామిరెడ్డి, డిసిఎం సుధాకర్‌రెడ్డి, ఐటి రాజేష్ కుమార్, గుంటి రమేష్, మందారం నరసింహులు, బాలస్వామి, రమణారెడ్డి, పురుషోత్తంరెడ్డి, క్యాషియర్ శ్రీశైలం, పోలీస్ రవి, విష్ణు, సతీష్ కుమార్, అజయ్, వెంకటేష్‌లు పాల్గొన్నారు.



# ప్రజల ముంగిటకే పాలన... సమస్యల పరిష్కారమే లక్ష్యం

## సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన



**ప్రజాపక్షం/హైదరాబాద్/శేరిలింగంపల్లి :** ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా వారి నుండే తెలుసుకుని, ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించడమే తమ ప్రధాన లక్ష్యమని సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్(సిఎంసి) సృజన స్పష్టం చేశారు. సైబరాబాద్ మున్సిపల్ ప్రధాన కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్పొరేషన్‌లోని 76 వార్డుల్లో ప్రజలకు అవసరమైన సౌకర్యాలను వేగంగా కల్పిస్తున్నామని ఆమె తెలిపారు.

**ఫిర్యాదులపై 24 గంటల్లో స్పందన**

ప్రజల నుండి అందే వినతులు, ఫిర్యాదులను తానే స్వయంగా పర్యవేక్షిస్తున్నానని కమిషనర్ తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక చెక్‌లిస్టును రూపొందించినట్లు చెప్పారు. ఎక్స్, వాట్సాప్, సోషల్ మీడియా, ప్రజావాణి ద్వారా వచ్చే ఫిర్యాదులకు 24 గంటల్లోగా అధికారులు ప్రాథమిక సమాచారం అందించాలి. 48 గంటల్లో పూర్తి వివరాలు సేకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. ఒకవేళ ఫిర్యాదు పెండింగ్‌లో ఉంటే, దానికి గల కారణాలను రశీదులో స్పష్టంగా పేర్కొనాలని అధికారులను ఆదేశించామని తెలిపారు.

**చెత్త వేస్తే కఠిన చర్యలు – ట్రేడ్ లైసెన్స్ రద్దు !**

నగర పరిశుభ్రతపై కమిషనర్ కఠిన నిర్ణయాలు ప్రకటించారు. ప్రతి వ్యాపార సంస్థ సొంతంగా డస్ట్ బిన్ ఏర్పాటు చేసుకోవాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే మొదట నోటీసు, తర్వాత ట్రేడ్ లైసెన్స్ రద్దు, ఆపై భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించారు. రోడ్ల పక్కన కేవలం పాదచారులు, వాహనదారుల కోసం లిట్టర్ బిన్స్ మాత్రమే ఉంటాయ ని, ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించేలా ప్ర ణాళిక లు రూపొందిస్తున్నామని చెప్పారు. చెత్తను కాల్చే వారిపై ప్రత్యేక నిఘా ఉంచి వారిలో మార్పు తెచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే కొత్తగా ఎలక్ట్రిక్ (ఈ) చెత్త వాహనాలను ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు.

**త్వరలో అందుబాటులోకి ఫ్లైఓవర్లు, రహదారులు**

☞నగర రవాణా వ్యవస్థను మెరుగుపరిచేందుకు చేపట్టిన పనుల గడువును కమిషనర్ ప్రకటించారు.

☞**ఏప్రిల్ 2027 నాటికి :** త్రిబుల్‌ఐటి, ఖాజాగూడ, ఆల్విన్ కాలనీ మియాపూర్ ఫ్లైఓవర్లు పూర్తి కానున్నాయి.

☞**అక్టోబర్ 2026 నాటికి :** అమీన్‌పూర్ చందానగర్ 4 లేన్‌ల రోడ్డు విస్తరణ పూర్తి.

☞**ఏప్రిల్ 2027 నాటికి :** అంజయ్యనగర్ రోడ్డు విస్తరణ పూర్తి.

☞**సుందరీకరణ :** కార్పొరేషన్ పరిధిలోని 74 జంక్షన్‌లను ట్రాఫిక్ ఐలాండ్స్‌గా, 21 ఫ్లైఓవర్ల కింద ల్యాండ్‌స్కేపింగ్ గార్డెన్స్‌లుగా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు.

☞**నాలా పనులు :** 217 కి.మీ. నాలాల్లో ఇప్పటికే 80 శాతం పూడికతీత పూర్తయిందని, మిగిలిన పనిని మే 15 లోపు పూర్తి చేస్తామన్నారు.

**ఆర్థికంగా ధీమా – నిధుల కొరత లేదు**

కార్పొరేషన్ ఆర్థిక పరిస్థితిపై కమిషనర్ వివరాలు తెలిపారు. ఎర్లీబర్డ్ స్కీమ్ ద్వారా ఏప్రిల్ నెలలోనే రూ. 510.33 కోట్ల ఆస్తి పన్ను వసూలైందని వెల్లడించారు. టౌన్ ప్లానింగ్ విభాగం ద్వారా మరో రూ. 1000 కోట్ల ఆదాయం వస్తుందని అంచనాగా ఉందన్నారు. గత బకాయిలు, కొత్త పనులకు కలిపి సుమారు రూ. 400 కోట్లు అవసరమని, ఇప్పటికే పన్నుల రూపంలో తగినంత నిధులు ఉన్నందున పనులకు ఎలాంటి ఆటంకం ఉండదని కమిషనర్ స్పష్టం చేశారు. ఉద్యోగుల కొరతపై ప్రభుత్వం సానుకూలత టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాల్లో సిబ్బంది కొరత ఉన్న మాట వాస్తవమేనని, అయితే ఉన్న వనరులతోనే మెరుగైన సేవలందిస్తున్నామని సృజన చెప్పారు. ఖాళీ పోస్టుల భర్తీకి ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఆమె ఈ సందర్భంగా తెలిపారు.

# ఉచిత మెడికల్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలి

## ముఖ్య న్యాయ మెజిస్ట్రేట్ పి.అరుణ కుమారి



ప్రజాపక్షం / సిటీ బ్యూరో : ఉచిత మెడికల్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలని హైదరాబాద్ జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, ముఖ్య న్యాయ మెజిస్ట్రేట్ పి.అరుణకుమారి అన్నారు. ప్రధానంగా అనారోగ్యంతో ఉన్నవారు, వృద్ధులు, పిల్లలు ఉపయోగించుకోవాలని చెప్పారు. హైదరాబాద్ జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంపొందించడంతో పాటు అవసరమైన వారికి, పేద వారికి ఉచితంగా ఆరోగ్య సేవలు అందించేందుకు ఈ క్యాంప్ నిర్వహిస్తున్నారన్నారు. ఈ క్యాంప్‌లో సాధారణ ఆరోగ్య పరీక్షలు, రక్తపోటు, షుగర్, హృద్రోగ సంబంధిత ప్రాథమిక పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జర్మాంటెన్ హాస్పిటల్ ఛైర్మన్ మహ్మద్ జవాద్ జార్ ఖాన్, డాక్టర్ మహ్మద్ వసీం, అడ్వకేట్ హుస్సేన్, గోల్కొండ స్టేషన్ హౌజ్ ఆఫీసర్, డిప్యూటి తహసిల్దార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక



**ప్రజాపక్షం/చార్మినార్:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక యాక్షన్ ప్లాన్‌లో భాగంగా శనివారం చాంద్రాయణ గుట్ట అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని హఫీజ్‌బాబానగర్ కోహినూర్ ఫంక్షన్ హాల్ బండ్లగూడ ఎంఆర్ఓ ప్రవీణ్ ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ హాజరై గత రెండున్నర సంవత్సర కాలంలో జరిగిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు అమలు గురించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపి అసదుద్దీన్ ఓవైసీకి జెడ్‌సీ సత్యనారాయణ పుష్పగుచ్ఛం అందించి శాలువాకప్పి సన్మానించారు. ఇదిలాఉండగా... చార్మినార్ జెడ్‌సీ సత్యనారాయణ, యాకుత్‌పురా జాఫర్ హుస్సేన్ మేరాజ్ శనివారం జెడ్‌సి కార్యాలయంలో సమావేశమయ్యారు.ఇటీవల నూతనంగా జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సత్యనారాయణకి ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ బోకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

# యశోద హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఇన్సీకాన్ -2026

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సికింద్రాబాద్ యశోద హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఇన్సీకాన్ 2026 పేరుతో అంటు వ్యాధులు, క్లిష్ట సంరక్షణపై జాతీయ స్థాయి శాస్త్రీయ సదస్సు హైటెక్ సిటీలోని వెస్టిన్ హోటల్లో ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో దేశ, విదేశాలకు చెందిన 500 మందికి పైగా వైద్య నిపుణులు పాల్గొంటున్నారు. యశోద హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి ముఖ్య అతిథిగా హాజరై సదస్సును ప్రారంభించారు. ఐసియు ఇన్ఫెక్షన్లు, ఫంగల్ వ్యాధులు, సెప్సిస్ నిర్వహణ, యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్, టిబి, హెచ్ఐవి వంటి అంశాలపై నిపుణులు చర్చిస్తున్నారు. ఆధునిక నిర్ధారణ పద్ధతులు, కొత్త చికిత్స విధానాలపై కూడా సదస్సులో ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఇలాంటి సదస్సులు వైద్య నిపుణుల మధ్య జ్ఞాన మార్పిడికి దోహదపడడంతో పాటు రోగుల చికిత్స ఫలితాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని నిర్వాహకులు తెలిపారు.

# కార్మికుల హక్కుల కోసం పోరాడాలి

**ప్రజాపక్షం/ఫలక్‌నుమా:** కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతూనే ఉండాలని పలువురు నేతలు పిలుపునిచ్చారు. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మహమ్మద్ అబ్బాస్ జంగంమెట్ ఎంసిహెచ్ క్వార్టర్స్‌లో జరిగిన మేడే ఉత్సవాలలో పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో సిపిఎం జంగంమెట్ డివిజన్ కార్యదర్శి కృష్ణ నాయక్, కిషన్‌కృష్ణ నాయక్, రాంకుమార్, శ్రీను, జంగయ్య, కుమార్, సంగీత, సబిత, స్వప్న, నారాయణ, అనిల్, అక్కుబాయి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో 104.90 శాతం రేషన్ కార్డులకు సరుకుల పంపిణీ

**ప్రజాపక్షం/సిటీబ్యూరో** :హైదరాబాద్ జిల్లాలో గత మూడునెలల్లో 104.90శాతం రేషన్ కార్డులకు సరుకులు పంపిణి సజావుగా జరిగిందని చీఫ్ రేషనింగ్ అధికారి రాజిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 62,373.682 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేశామన్నారు. మే, జూన్ నెలల గోధుమల పంపిణీ ఈనెల పదిహేను వరకు కొనసాగుతుందని చెప్పారు. లబ్దిదారులు తమ సరుకులను వీలైనంత త్వరగా పొందాలని తెలిపారు. అలాటే ఈకెవైసి ప్రక్రియ పూర్తి చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు,

# అద్దెకు ఇందిరమ్మ ఇండ్లు

## -అద్దెలు వసూలు చేసుకుంటున్న నేతలు

**ప్రజాపక్షం/చాంద్రాయణగుట్ట:** పట్టణ పేదల కోసం దివంగత సీఎం వైఎస్ఆర్ ప్రభుత్వం నిర్మించి ఇచ్చిన గృహాలను నాయకులు అద్దెలకు ఇస్తున్న వైనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ వ్యవహారం బండ్లగూడ మండలం పరిధిలో నల్లవాగు హిందూ శ్మశాన వాటిక ఎదురుగా ఉన్న ఇందిరమ్మ ఇండ్ల భవన సముదాయంలో నెలకొంది. ప్రభుత్వం ఇండ్లను నిర్మించినా ఎవరికీ కేటాయించకపోవడంతో కొందరు కబ్జాలో ఉండగా.. మరికొందరు స్థానిక నేతలు ఇండ్లను అద్దెకు ఇస్తూ.. నెలవారీ అద్దె దక్కించుకోవడం స్థానికంగా తీవ్ర విమర్శలకు తావిస్తున్నది. ఈ విషయంపై అటు రెవెన్యూ, ఇటు మున్సిపల్ అధికారులు ఎవరూ నోరు మెదపడం లేదు. ఇకనైనా హైదరాబాద్ జిల్లా కలెక్టర్ స్పందించి ఇందిరమ్మ ఇండ్ల వ్యవహారాన్ని తేల్చాలని స్థానికులు కోరుతున్నారు.

# మాజీ కేంద్ర మంత్రి మల్లికార్జున్‌కు అంతర్జాతీయ గౌరవం



**ప్రజాపక్షం/బంజారాహిల్స్:** మాజీ కేంద్ర రక్షణ శాఖ మంత్రి డాక్టర్ మల్లికార్జున్‌కు అంతర్జాతీయ గౌరవం లభించింది. ప్రపంచంలో అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాల్లో ఒకటైన ఇటలీలోని బొలోనియాలో ఉన్న జాన్స్ హాప్కిన్స్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ ఇంటర్నేషనల్ స్టడీస్ క్యాంపస్‌లో కొత్తగా నిర్మించిన టెర్రస్‌కు డాక్టర్ మల్లికార్జున్ టెర్రస్ అని పేరు పెట్టారు. ఇది అంతర్జాతీయ స్నేహ సంబంధాలకు ప్రతీకగా నిలిచింది. డాక్టర్ మల్లికార్జున్ 1969 తెలంగాణ ఉద్యమంలో విద్యార్థి నాయకుడిగా ప్రజా జీవితంలో ప్రవేశించారు. అనంతరం రక్షణ, రైల్వే వంటి కీలక కేంద్ర మంత్రిత్వ శాఖలను నిర్వహించారు.

# సభను విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం/జూబ్లీహిల్స్:** ఈనెల 10న జరిగే ప్రధాని నరేంద్ర మోడీ సభను విజయవంతం చేయాలని బీజేపీ అధికార ప్రతినిధి ఎన్వీఎస్ సుభాష్ పార్టీ వర్గాలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం, శ్రీకృష్ణానగర్ డివిజన్, స్రవంతి నగర్ కాలనీలో మోడీ జనాగ్రహ సభ సన్నాహక సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశంలో ప్రోగ్రాం ఇన్చార్జ్ బరిగల జ్ఞానేశ్వర్, జూబ్లీహిల్స్ అసెంబ్లీ బిజెపి సీనియర్ నాయకులు ప్రేమ్ కుమార్, గంగరాజ్, పులి రామ్మోహన్, బడుగు సతీష్, వీరితోపాటు ఇన్చార్జులు, బూత్ అధ్యక్షులు ఏ.ప్రశాంత్ కుమార్, ఫణిల్ కుమార్, కరణ్ సింగ్, కార్తీక్, నాగార్జున, శ్రీనివాస్, కుమారి, రాణి బాయ్, రాధా, కరుణ శ్రీ, సుమలత, తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి: ఎమ్మెల్సీ రహమత్‌బేగ్

**ప్రజాపక్షం/గోషామహల్:** ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ రహమత్‌బేగ్ పిలుపునిచ్చారు. హిందీనగర్ స్పోర్ట్స్ భవన సముదాయంలో శనివారం నాంపల్లి మండల అధికారుల ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వ ఫలాలు అందాలని పేర్కొన్నారు. సమావేశంలో ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, నాంపల్లి మండల తహసీల్దార్ మహమ్మద్ నయీముద్దీన్, నోడల్ ఆఫీసర్ మమత, డిసి ఉమా ప్రకాష్, నాంపల్లి సర్కిల్ సివిల్ సప్లయ్ అధికారి పుష్పలత, సీడీపీఓ కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమిలో హరితహారం చెట్ల తొలగింపు కలకలం

## జెసిబితో భూమి చదును.. చర్యల కోసం గ్రామస్తుల డిమాండ్





**ప్రజాపక్షం/వీపనగండ్ల:** పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా గత ప్రభుత్వ హయాంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ భూమిలో నాటిన చెట్లను తొలగించిన ఘటన మండల పరిధిలోని వల్లభాపూర్ గ్రామంలో కలకలం రేపింది. ఒక విశ్రాంత ఉద్యోగి ఈ చర్యకు పాల్పడినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామానికి సమీపంలోని కోటగట్టుపై సర్వే నెంబర్ 520 లో సుమారు 114 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈభూమిలో గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో హరితహారం కార్యక్రమం కింద సుమారు ఆరు వేల మొక్కలను నాటి, ఏడు సంవత్సరాలకు పైగా సంరక్షించారు. ఈ మొక్కల పెరుగుదలపై సంబంధిత అధికారులు కూడా పర్యవేక్షణ చేపట్టినట్లు సమాచారం. అయిలే, ఇటీవల గ్రామ పంచాయితీ ఎన్నికల తరువాత పరిస్థితులు మారాయి. తనకు అనుకూలమైన వర్గం అధికారంలోకి రావడంతో, ఓ విశ్రాంత ఉద్యోగి ఈ ప్రభుత్వ భూమిపై హక్కు ఉందని పేర్కొంటూ హరితహారం చెట్లను జెసిబితో తొలగించి, వాటికి నిప్పంటించి, భూమి ని చదును చేయించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఘటన జరుగుతున్న సమయంలో నే గ్రామ మాజీ సర్పంచ్ రవీందర్‌రెడ్డి సహా పలువురు గ్రామస్తులు సం బంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ, ఎటువంటి చర్యలు తీసుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యమే ఈ విధమైన అక్రమాలకు దారితీసిందని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. హరితహారం కార్యక్రమం ద్వారా పెంచిన చెట్లను నిర్మూలించడం పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగించడమే కా కుండా, ప్రభుత్వ ఆస్తులను కబ్జా చేయడమేనని స్థానికులు అంటున్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములను కాపాడటంలో అధికారులు విఫలమవుతున్నారా? హరితహారం వంటి పథకాల అమలు కేవలం కాగితాలకే పరిమితమవుతోందా? అనే ప్రశ్నలు ఈ ఘటనతో మళ్లీ తెర పైకి వచ్చాయి.

**చెట్ల తొలగింపుపై చర్యలు తీసుకుంటాం: ఎంపిడిఒ శ్రీనివాసరావు**

ప్రభుత్వ భూమిలో హరితహారం కార్యక్రమం కింద నాటిన చెట్ల తొలగింపు అంశంపై విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకుంటామని ఎంపిడిఒ శ్రీనివాసరావు తెలిపారు. గ్రామంలోని కోటగట్టుపై నాటిన చెట్లను తొలగించినట్లు మాజీ సర్పంచ్ రవీందర్ రెడ్డి తన దృష్టికి తీ సుకువచ్చినట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న ఎంపిడిఒ, పంచాయితీ కార్యదర్శిని ఘటన స్థలాన్ని పరిశీలించి పూర్తి స్థాయి నివేదిక అందించాలని ఆదేశించారు. నివేదిక ఆధారంగా వాస్తవాలు నిర్ధారణ అయినట్లయితే, ప్రభుత్వ భూమిలో చెట్ల తొలగింపునకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్ప ష్టం చేశారు. వల్లభాపురం గ్రామంలోని కోటగట్టుపై హరితహారం కార్యక్రమంలో భాగంగా చెట్లు నాటిన విష యం నిజమేనని పంచాయితీ కార్యదర్శి స్వాతి తెలిపారు. అయితే, ఆ ప్రాంతంలో చెట్లను తొలగించిన ఘటనపై ఇప్పటివరకు ఎవరూ అధికారికంగా తనకు ఫిర్యా దు చేయలేదని ఆమె స్పష్టం చేశారు. అందువల్ల ఈ విషయంపై తనకు పూర్తి సమాచారం లేదని పేర్కొన్నారు.

# ఘనంగా అన్నమాచార్య జయంతి

**ప్రజాపక్షం/త్యాగరాయగానసభ:** నవ్య నాటక సమితి అన్నమాచార్య మిషన్ ఆధ్వర్యంలో తాళ్ళపాక అన్నమాచార్య 618వ జయంతి కార్యక్రమం త్యాగరాయగానసభలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పారుపల్లి శ్రీరంగనాధ్‌కు అన్నమయ్య సంకీర్తన గాన నిపుణబిరుదు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ ప్రభుత్వ సలహాదారు కేవీ రమణచారి, డాక్టర్ ఓలేటి పార్వతీశం, వసుంధర, ఆచార్య ఫణీంద్ర, డాక్టర్ ఆర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొనగా.. ఈ సందర్భంగా ప్రదర్శిదర్శించిన అన్నమయ్య శ్రీకృష్ణ సౌరభం నృత్య రూపక ప్రదర్శన ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నది

# కెటిఆర్ నివాళ్లు



**ప్రజాపక్షం/సుల్తాన్‌బజార్:** ఔటర్ రింగ్‌రోడ్‌లో జరిగిన ఘోర ప్రమాదంలో మృతిచెందిన సరిసిల్ల వాసుల పార్థివ దేహాల వద్ద పుష్పగుచ్చాలు ఉంచి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నివాళ్లు అర్పించారు. శనివారం ఉదయం ఉస్మానియా ఆసుపత్రి మార్చురీకి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. సిరిసిల్ల ప్రాంతానికి చెందిన ఆరుగురు వ్యక్తులు ఇలా అకాల మరణం చెందడం పట్ల ఆయన తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను సిరిసిల్లకు తరలించే వరకు నాయకులంతా అక్కడే ఉండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. విషాద ఘటనతో ఆసుపత్రి ప్రాంగణంలో బాధితుల రోదనలు మిన్నంటాయి. నివాళ్లు అర్పించిన వారిలో బిఆర్ఎస్ గోషామహల్ ఇంచార్జ్ ఆర్వి మహేందర్‌కుమార్, సురేష్ ముదిరాజ్, రమేష్ గుప్తా, నవీన్ వర్మ, సందీప్ తదితరులున్నారు.

# పాలకులం కాదు సేవకులం



**ప్రజాపక్షం/వెంగళరావునగర్:** పాలకులం కాదు... సేవకులం...అనే నినాదంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతోందని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం మధురానగర్‌లోని సాగి రామకృష్ణంరాజు కమ్యూనిటీ హాల్‌లో శనివారం జరిగిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక నియోజకవర్గం స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ జెడ్‌సీ సంతోష్ బాదావత్, స్పెషల్ ఆఫీసర్, షేక్‌పేట్ ఎంఆర్వో అనితరెడ్డి, డీసీ సురేష్, మధురానగర్ ఎస్‌హెచ్‌ఓ హెచ్.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# విశ్వశాంతి సంకీర్తనాయజ్ఞం




**ప్రజాపక్షం/చిక్కడపల్లి:** తొలి తెలుగు వాగ్గేయకారుడు అన్నమాచార్యుల 618వ జయంతి సందర్భంగా పద్మశ్రీ డా.శోభారాజు స్థాపించిన అన్నమాచార్య భావనావాహిని ఆధ్వర్యంలో ట్యాంక్‌బండ్ దగ్గర ఉన్న అన్నమాచార్యుల విగ్రహం వద్ద విశ్వశాంతి సంకీర్తనాయజ్ఞం భక్తిభావంతో వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక గురువులు, అన్నమాచార్య భావనా వాహిని విద్యార్థులు, ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

# హాస్పిటాలిటీ దిగ్గజాలకు సన్మానం



**ప్రజాపక్షం/బంజారాహిల్స్:** విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే లక్ష్యంగా రెజెన్సీ కాలేజ్ ఆఫ్ క్యూలినరీ ఆర్ట్స్ అండ్ హోటల్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో రెజెన్సీ లీడర్‌షిప్ అవార్డ్స్ 202526 వేడుక జరిగింది. కార్యక్రమానికి ప్రభుత్వ పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వాణి ప్రసాద్ ముఖ్యఅతిథిగా విచ్చేసి విజేతలకు అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో రెజెన్సీ కాలేజ్ ఆఫ్ క్యూలినరీ ఆర్ట్స్ అండ్ హోటల్ మేనేజ్మెంట్ ప్రిన్సిపాల్ రమేష్‌కుమార్‌రెడ్డి, ఓయూ వాణిజ్య విభాగం ప్రొఫెసర్ గడ్డం నరేష్‌రెడ్డి, ఎస్.జితేంద్రకుమార్ నాయక్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# ఒకే నెంబర్ ప్లేట్‌తో రెండు వాహనాలు

**ప్రజాపక్షం/సైదాబాద్:** ఒకే నెంబర్ ప్లేట్‌తో రెండు వాహనాలను నడుపుతున్న వ్యక్తిపై సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. వాహనాలు తనిఖీలు చేస్తున్న సందర్భంలో ఒకే వాహనం నెంబర్ ప్లేట్‌ను రెండింటికి వినియోగిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు నిందితుడు సయ్యద్ హుస్సేన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకోవడం జరిగింది.

# ఘనంగా నారద జయంతి



**ప్రజాపక్షం/సుల్తాన్‌బజార్:** మహర్షి నారదుడు ధర్మాచరణ పరాయణుడని, ప్రపంచపు మొట్టమొదటి పాత్రికేయుడని పలువురు వక్తలు కొనియాడారు. సమాచారభారతి ఆధ్వర్యంలో కోఠిలో శనివారం నారద జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రసార మాధ్యమాలలోని వివిధ విభాగాలకు చెందిన పలువురు జాతీయవాద పాత్రికేయులకు సమాచార భారతి అధ్యక్షుడు ఆచార్య గోపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు వల్లీశ్వర్, జాతీయ మానవ హక్కుల సంఘం సభ్యురాలు విజయభారతి చేతుల మీదుగా సత్కారాలు జరిగాయి.

# మధురానగర్ సంక్షేమ సమితి కార్యవర్గం




ప్రజాపక్షం/వెంగళరావునగర్: మధురానగర్ కాలనీ సంక్షేమ సమితి నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షుడు ఎంపికయ్యారు. కమిటీలో.. అధ్యక్షుడు ఎన్వీ మనోహర్‌రావు, ఉపాధ్యక్షుడు సీహెచ్ గంగారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికవడం జరిగింది. ఈసీ మెంబర్స్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి నూతన అధ్యక్షుడిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని అసోసియేషన్ ఇంచార్జి కార్యదర్శి సీ.హనుమంతరావు తెలిపారు. సమావేశంలో కోశాధికారి కే.సుగుణ, సభ్యులు రామరాజు, సుధాకర్, సాయి కుమార్, శ్రీనివాస్, ఉప్పలయ్య, బిక్షపతి, ఓం ప్రకాష్, వెంకటేశ్వర్‌రావు, హనుమంతరావు, సంపత్ కుమార్, అజిత్ సింగ్, హరిత, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

# ప్రెస్‌క్లబ్‌లో ఉచిత వేసవి శిక్షణ శిబిరాలు

**ప్రజాపక్షం/ఖైరతాబాద్:**ఎండాకాలంలో చిన్నారులకు ఆహ్లాదం, ఆనందం అందిస్తూ వారిలో ఉత్సాహం నింపేందుకు ప్రెస్‌క్లబ్ హైదరాబాద్, తెలంగాణ రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాట్) ఉచిత వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నాయి. ఈనెల 6 నుంచి జూన్ 6 వరకు సోమాజిగూడలోని ప్రెస్ క్లబ్ ఆవరణలో ఉదయం 6 నుంచి 9 గంటల వరకు చెస్, క్యారమ్, యోగా, జుంబా, పెయింటింగ్ విభాగాల్లో శిక్షణ శిబిరాలు నిర్వహిస్తారు. ప్రెస్ క్లబ్ సభ్యులు, జర్నలిస్టుల పిల్లలతో సహా చుట్టుపక్కల చిన్నారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవచ్చు. ఆసక్తి ఉన్నవాళ్లు ఈనెల 4వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఎంట్రీలు (ఫోన్: 8374452215) నమోదు చేసుకోవాలి. మరిన్ని వివరాలకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య సెల్: 8374452215లో సంప్రదించాలి.

తగ్గిన అరెస్టులు...

# పెరిగిన దాడులు!

## గత ఆర్థిక సంవత్సరంలో రికార్డుస్థాయిలో ఆస్తుల జప్తు చేసిన ఇడి

**న్యూఢిల్లీ :** గత ఆర్థిక సంవత్సరంలో మనీ లాండరింగ్ కేసులకు సంబంధించి ఇడి (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) చేసిన అరెస్టుల సంఖ్య సుమారు 27 శాతం తగ్గింది. అయితే ఇదే కాలంలో జప్తు చేసిన ఆస్తుల విలువ మాత్రం రికార్డు స్థాయిలో రూ. 81,000 కోట్లకు పైగా నమోదైందని అధికారిక గణాంకాలు వెల్లడించాయి. మార్చి 31తో ముగిసిన 2025–26 ఆర్థిక సంవత్సరంలో 'మనీ లాండరింగ్ నివారణ చట్టం (పిఎంఎల్‌ఎ)లోని కఠిన నిబంధనల కింద ఈ కేంద్ర సంస్థ నిర్వహించిన సోదాలు లేదా దాడుల సంఖ్య దాదాపు రెట్టింపై 2,892కి చేరింది. గత ఆర్థిక సంవత్సరంలో, మోసాలకు గురైన బాధితులకు జప్తు చేసిన ఆస్తులను తిరిగి అప్పగించాలనే తన లక్ష్యాన్ని ఇడి రెట్టింపు స్థాయిలో అధిగమించింది. ఈ కాలంలో ఆ సంస్థ రూ. 32,000 కోట్లకు పైగా విలువైన ఆస్తులను బాధితులకు తిరిగి ఇప్పించింది. ఏప్రిల్ 2025లో 26 ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో, రూ. 15,000 కోట్ల విలువైన ఆస్తులను బాధితులకు తిరిగి అప్పగించాలనే లక్ష్యాన్ని ఈ సంస్థ నిర్దేశించుకుంది. సంస్థ తన వార్షిక నివేదికలో సమర్పించిన గణాంకాలను పిటిఐ సేకరించి విశ్లేషించగా, ఈ ఆర్థిక సంవత్సరంలో ఇడి156 మందిని అరెస్టు చేసినట్లు తేలింది. అంతకుముందు 2024–25లో ఈ సంఖ్య 214గా ఉండగా, ఇప్పుడు సుమారు 27 శాతం తగ్గుదల నమోదైంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో అరెస్టుల సంఖ్య 272గా ఉంది. తాము మరింత నిర్దిష్టమైన, సాక్ష్యాధారాల ఆధారిత దర్యాప్తులను చేపడుతుండటమే అరెస్టుల సంఖ్య తగ్గడానికి కారణమని ఇడి




వివరణ ఇచ్చింది. ఒకే ఆర్థిక సంవత్సరంలో (2026) తాము చేపట్టిన చరిత్రలోనే అత్యధిక తాత్కాలిక ఆస్తుల జప్తు గురించి వివరిస్తూ— 712 ఉత్తర్వుల ద్వారా రూ. 81,422 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేయడం ద్వారా, జప్తు విలువలో ఏకంగా 171 శాతం భారీ పెరుగుదల నమోదైంది. నేరస్తులు చట్టవిరుద్ధంగా ఆర్జించిన నేరఫలాలను (ఆస్తులను) వారి నుండి పూర్తిగా దూరం చేయడానికి, వాటిపై వారికి ఉన్న హక్కులను తొలగించడానికి ఈ జప్తు ప్రక్రియ ఒక కేంద్ర సాధనంగా పనిచేస్తుందని ఆ సంస్థ తెలిపింది. ఇడి పూర్తిగా భౌతిక సోదాలపై ఆధారపడటం లేదని, దర్యాప్తు అధికారులు ఏకకాలంలో బహుళ డేటాబేస్‌ల నుండి ఆర్థిక నిఘాను త్రిభుజాకార పద్ధతిలో సేకరిస్తున్నారని, బ్లాక్ చైన్ విశ్లేషణల ద్వారా క్రిప్టో కరెన్సీ ప్రవాహాలను గుర్తించి, కార్పొరేట్, ఆస్తి రికార్డులను నిజ సమయంలో యాక్సెస్ చేస్తున్నారని నివేదిక పేర్కొంది. దీని ఫలితంగా, గత సంవత్సరంలో కోర్టుల ముందు దాఖలైన 457 ఫిర్యాదులతో పోలిస్తే, 26 ఆర్థిక సంవత్సరంలో ఇడి రికార్డు స్థాయిలో 812 ఛార్జిషీట్లను విజయవంతంగా దాఖలు చేసింది. అందుకే, కేసుల విచారణ కాలాన్ని గతంలో మూడునాలుగేళ్ల నుండి ఇప్పుడు ఒకటిఒకటిన్నర సంవత్సరాలకు ఇడి గణనీయంగా తగ్గించగలిగిందని నివేదిక పేర్కొంది. పిఎంఎల్‌ఎ దర్యాప్తులకు దారితీసేలా నమోదైన ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్స్ (ఇసిఐఆర్‌ఎస్) సంఖ్య, 25 ఆర్థిక సంవత్సరంలో దాఖలైన 775 కేసులతో పోలిస్తే, గత ఆర్థిక సంవత్సరంలో 39 శాతం పెరిగి 1,080 కేసులకు చేరిందని గణాంకాలు వెల్లడించాయి. పిఎంఎల్‌ఎ కింద ఇడి జప్తు చేసిన ఆస్తులను, పెట్టుబడిదారులు, గృహ కొనుగోలుదారులు, బ్యాంకుల వంటి మోస బాధితులకు తిరిగి అప్పగించే ఆస్తుల పునరుద్ధరణ విభాగంలో అత్యంత కీలకమైన సమాచారం కనిపించింది. 25 ఆర్థిక సంవత్సరంలో మోస బాధితులకు అప్పగించిన రూ. 15,263 కోట్లతో పోలిస్తే, గత ఆర్థిక సంవత్సరంలో ఈ ఏజెన్సీ రూ. 32,678 కోట్ల విలువైన ఆస్తులను పునరుద్ధరించింది. 26 ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో రూ. 15,000 కోట్ల విలువైన ఆస్తులను పునరుద్ధరించాలని ఇడి డైరెక్టర్ రాహుల్ నవీన్ లక్ష్యంగా పెట్టుకున్నారని గత ఏడాది పిటిఐ నివేదించింది. మనీ లాండరింగ్ కేసుల దర్యాప్తులో సహాయం కోరుతూ, ఇడి వివిధ దేశాలకు పంపిన 'లెటర్స్ రోగెటరీ' (ఎల్‌ఆర్), పరస్పర న్యాయ సహాయ ఒప్పందాల (ఎంఎల్‌ఎటి) అభ్యర్థనల వంటి న్యాయపరమైన విజ్ఞప్తుల సంఖ్య గణనీయంగా పెరిగిందని కూడా ఆ నివేదికలో గణాంకాలతో సహా ప్రస్తావించారు.

# టిఎంసి పిటిషన్‌పై ఆదేశాల జారీకి 'సుప్రీం' నో

## ఏప్రిల్ 13 నాటి 'ఈసి సర్క్యులర్' చట్టవిరుద్ధం కాదని స్పష్టీకరణ 'తృణమూల్ ' తరపున సీనియర్ న్యాయవాది కపిల్‌సిబల్ వాదనలు




**న్యూఢిల్లీ :** పశ్చిమ బెంగాల్‌లో ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎన్నికల సంఘం (ఈసి) కేంద్ర ప్రభుత్వ సిబ్బందిని మోహరించడాన్ని సవాల్ చేస్తూ తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) దాఖలు చేసిన పిటిషన్‌పై తదుపరి ఆదేశాలు జారీచేయడానికి సుప్రీంకోర్టు శనివారం నిరాకరించింది. ఎన్నికల సంఘం నిర్దేశించిన చట్రాన్ని సమర్థవంతంగా సమర్థిస్తూ న్యాయమూర్తులు జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చిలతో కూడిన ప్రత్యేక ధర్మాసనం మే 4న జరిగే ఓట్ల లెక్కింపు ప్రక్రియలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల మిశ్రమ భాగస్వామ్యానికి వీలు కల్పించే ఎన్నికల సంఘం ఏప్రిల్ 13 సర్క్యులర్ చట్టవిరుద్ధం కాదని పేర్కొంది. రెండు పూల్స్‌లో నుంచి సహ సిబ్బందిని నియమించే విచక్షణాధికారం ఎన్నికల సంఘానికి ఉందని బెంచ్ తెలిపింది. ఎన్నికల సంఘం తరపున హాజరైన డి.ఎస్.నాయుడు ఏప్రిల్ 13వ తేదీ నాటి సర్క్యులర్‌ను ఎన్నికల సంఘం దాని అసలు స్ఫూర్తితో పనిచేస్తుందన్న ప్రకటనను పునరుద్ఘాటించడం మినహా ఈ కేసులో తదుపరి ఉత్తర్వులు అవసరం లేదు. ఈ స్పష్టీకరణలతో ప్రత్యేక అనుమతి పిటిషన్ కొట్టివేయబడిందని ప్రత్యేక ధర్మాసనం తన ఉత్తర్వులో పేర్కొంది. 294 మంది సభ్యులున్న పశ్చిమ బెంగాల్ అసెంబ్లీకి ఏప్రిల్ 23, ఏప్రిల్ 29 తేదీలలో రెండు దశల్లో పోలింగ్ జరిగింది. ఏప్రిల్ 4న (సోమవారం) ఓట్ల లెక్కింపు జరుగనుంది. ఏప్రిల్ 30న వెలువరించిన తన తీర్పులో ఎన్నికల సంఘం ఆదేశం న్యాయపరిధి లేకుండా లేదా అస్పష్టమైన అనుమానాల ఆధారంగాజారీచేయబడిందన్న తృణమూల్ కాంగ్రెస్ వాదనను కలకత్తా హైకోర్టు తిరస్కరించింది. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పలు స్థాయిల పర్యవేక్షణ ఉందని పేర్కొంటూ , కేంద్ర ప్రభుత్వం లేదా ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగులు కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రభావితం కావచ్చనే ఆరోపణలను కూడా హైకోర్టు తోసిపుచ్చింది. కోర్టుకు సెలవు దినమైన శనివారం నాడు ప్రత్యేక విచారణకు దారితీసిన ఈ తీర్పుపై అప్పీలు చేయడానికి టిఎంసి సుప్రీం కోర్టును ఆశ్రయించింది. విచారణ సందర్భంగా సర్క్యులర్ చాలా స్పష్టంగా ఉన్నందున ఏదైనా తప్పు జరిగిందన్న తృణమూల్ కాంగ్రెస్ ఆందోళన నిరాధారమైనదని ఎన్నికల సంఘం పేర్కొంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల మిశ్రమం ఉంటుందని, ఓట్ల లెక్కింపు సమయంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఉంటారని ఎన్నికల సంఘం కోర్టుకు హామీని ఇచ్చింది. ప్రారంభంలో, తృణమూల్ కాంగ్రెస్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ తన వాదనలు వినిపిస్తూ ఆ సర్క్యులర్ ఏప్రిల్ 13నాటిదని, అయితే ఈ విషయం ఏప్రిల్ 29న తెలిసిందని చెప్పారు. ఓట్ల లెక్కింపులో అవకతవకలు చోటుచేసుకునే అవకాశం ఉందని వివిధ వర్గాల నుంచి ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయని ప్రధాన ఎన్నికల అధికారి తన లేఖలో పేర్కొన్నట్లు కపిల్ సిబల్ బెంచ్‌కు వివరించారు.

# డిఎంకె, కూటమి నేతలతో స్టాలిన్ వరుస సమావేశాలు

**చెన్నై :** తమిళనాడులో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఈ నెల 4వ తేదీన చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ సీనియర్ నాయకులతో తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ శుక్రవారం సమావేశమైయ్యారు. డిఎంకె కూటమి నాయకులను కలిసి విజయావకాశాలపై చర్చించారు. కొడైకెనాల్‌లో తన నాలుగు రోజుల విహార యాత్రను ముగించుకున్న తర్వాత, స్టాలిన్ తన పార్టీ సీనియర్ నాయకులను రెండుసార్లు కలిసి, వారిప్రాంతాల్లోని క్షేత్రస్థాయి పరిస్థితులపై చర్చించారు. దీని కొనసాగింపుగా డిఎంకె అధినేత తన పార్టీ ప్రధాన కార్యాలయమైన 'అన్నా అరివాలయం'లో రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కె. సెల్వపెరుంతగైని, కొంగునాడు మక్కల్ దేశీయ కచ్చి (కెఎండికె) ప్రధాన కార్యదర్శి ఇ.ఆర్. ఈశ్వరన్‌లను కలిశారు. తమ తమ నియోజకవర్గాల్లో ఓట్ల లెక్కింపు పర్యవేక్షణకు సంబంధించి జరుగుతున్న ఏర్పాట్ల గురించి కూడా స్టాలిన్ ఆరా తీశారని డిఎంకె వర్గాలు తెలిపాయి. కెఎండికె రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో డిఎంకె గుర్తుపై పోటీ చేస్తోంది. స్టాలిన్ కూటమి నాయకులతో సమావేశమైనప్పుడు పార్టీ ఉప ప్రధాన కార్యదర్శి ఎ. రాజా, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆర్.ఎస్. భారతి, కమ్యూనికేషన్స్ విభాగం అధిపతి టి.కె.ఎస్. ఇళంగోవన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం కార్యదర్శి టి.ఆర్.బి. రాజా తదితరులు అక్కడ ఉన్నారు. డిఎంకె 164 నియోజకవర్గాల్లో పోటీ చేస్తుండగా, దాని మిత్రపక్షమైన కాంగ్రెస్ 28 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తోంది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు ఏప్రిల్ 23న జరిగాయి, ఓట్ల లెక్కింపు మే 4న జరగనుంది.

# పుణెలో దారుణం..

## నాలుగేళ్ల చిన్నారిపై 65 ఏళ్ల వృద్ధుడి హత్యాచారం : నిందితుడి అరెస్ట్



**పుణె :** మహారాష్ట్రలోని పుణె పరిధిలో దారుణం జరిగింది. నాలుగేళ్ల చిన్నారిపై 65 ఏళ్ల వృద్ధుడు అత్యాచారానికి పాల్పడి, హత్య చేశాడు. ఈ ఘటనతో స్థానికులు ఆందోళనకు దిగారు. చివరకు పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివి. పూనే, భోర్ తహసీల్ పరిధిలోని ఒక గ్రామంలో శుక్రవారం ఈ ఘటన జరిగింది. నాలుగేళ్ల చిన్నారిని ఒక వృద్ధుడు ఫుడ్ ఇప్పిస్తానని చెప్పి, తనతో తీసుకెళ్లాడు. దగ్గర్లోని ఒక పశువుల పాకలోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. అనంతరం చిన్నారిని చంపేశాడు. అయితే, చిన్నారి పాప కనిపించకపోవడంతో తల్లి దండ్రులు, ఇతర కుటుంబ సభ్యులు తీవ్రంగా వెతికారు. పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఒక ఇంటి సిసి కెమెరాలో ఈ ఘటనకు సంబంధించిన దృశ్యం రికార్డైంది. వృద్ధుడు చిన్నారిని తీసుకెళ్తున్నట్లు రికార్డ్ కావడంతో విషయం బయటపడింది. ఘటన అనంతరం నిందితుడు అక్కడి నుంచి పారిపోయాడు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ జరిపారు. ఈ ఘటన గురించి తెలియడంతో స్థానికులు తీవ్ర ఆందోళన నిర్వహించారు. బెంగళూరు–ముంబై హైవేను దిగ్బంధించారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని, వెంటనే అరెస్టు చేయాలని డిమాండ చేశారు. అంతేకాదు, 15 రోజుల్లోగా ఛార్జిషీటు దాఖలు చేయాలని కోరారు. వీరి ఆందోళనతో కొంతసేపు ట్రాఫిక్ స్తంభించింది. వెంటనే పోలీసు ఉన్నతాధికారులు, ఇతర అధికారులు నిరసనకారుల వద్దకు చేరుకున్నారు. నిందితుడిని త్వరగా అరెస్టు చేస్తామని, కఠిన శిక్ష పడేలా చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం నిందితుడిని అరెస్టు చేశారు. మరోవైపు ఈ ఘటనపై అక్కడి ప్రతిపక్షం మండిపడింది. ప్రభుత్వ వైఫల్యం వల్లే ఇలాంటి దారుణాలు జరుగుతున్నాయని విమర్శించింది. అయితే, నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం చెప్పింది.

# పెట్రో ధరలను నియంత్రించాలి

## ధరలు పెరుగుతాయని ప్రజల్లో అశాంతి నెలకొంది : మాయావతి




**లక్నో :** వాణిజ్య ఎల్‌పిజి సిలిండర్ ధర పెంపుపై బహుజన్ సమాజ్ పార్టీ అధినేత్రి మాయావతి తీవ్రంగా స్పందించారు. వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్, ఇతర పెట్రోలియం ఉత్పత్తుల ధరలు కూడా తప్పక పెరుగుతాయనే ఆందోళనలతో ప్రజల్లో ఒక రకమైన అశాంతి నెలకొందని ఆమె పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం మాయావతి ఎక్స్‌లో పోస్టు చేశారు. 'దేశంలో వాణిజ్య గ్యాస్ సిలిండర్ల తీవ్ర కొరత నెలకొన్న ఈ తరుణంలో, ఒకేసారి రూ. 993 మేర ధర పెరగడం, సామాన్య ప్రజల దైనందిన జీవితంపై దాని ప్రభావం, ఎలక్ట్రానిక్ మీడియాతో సహా అన్ని వార్తా మాధ్యమాల్లో ప్రధాన వార్తలుగా నిలుస్తున్నాయి. వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్, ఇతర పెట్రోలియం ఉత్పత్తుల ధరలు కూడా తప్పక పెరుగుతాయనే భయాలతో ప్రజల్లో ఒక రకమైన అశాంతి నెలకొంది. దీనికి అసలు కారణం ఏదైనప్పటికీ— అది అమెరికా–ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య సంఘర్షణ కావచ్చు లేదా మరేదైనా కావచ్చు. వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు ముందు పెట్రోలియం ఉత్పత్తులు, ఇతర నిత్యావసరాల ధరలను చాలా వరకు నియంత్రణలో ఉంచిన ప్రభుత్వం, అదే విధానాన్ని కొనసాగించాలి. ప్రజల సంక్షేమం, శ్రేయస్సు అనే విస్తృత ప్రయోజనాల దృష్ట్యా, అలా చేయడం దేశానికి సముచితంగా ఉంటుంది' అని మాయావతి అన్నారు. ఢిల్లీలో కూడా, కొత్త ధరల ప్రకారం వాణిజ్య సిలిండర్ల ధర ఇప్పుడు రూ. 3,000 మార్కును దాటుతుందని ఆమె తెలిపారు. ద్రవ్యోల్బణ భారం కింద ఇప్పటికే సతమతమవుతున్న దేశంలోని అత్యధిక సంఖ్యలో ఉన్న పేద, మధ్యతరగతి పౌరులపై, పెట్రోలియం ఉత్పత్తుల ధరల పెరుగుదల చూపే ప్రభావాన్ని పూర్తిగా అంచనా వేసిన తర్వాతే ప్రభుత్వం విధానాలను రూపొందించుకోవాలని ఆమె సూచించారు. శుక్రవారం నాడు, 19 కిలోల వాణిజ్య ఎల్‌పిజి సిలిండర్ ధర అత్యంత భారీగా, అంటే రూ. 993 మేర పెరిగింది.

# 'పుచ్చకాయలో కల్తీ లేదు'

## విషప్రయోగంపై అనుమానాలు

## ముంబయిలో ఫ్యామిలీ డెత్ కేసులో వెలుగులోకి కీలక వివరాలు



**ముంబయి :** మహారాష్ట్రలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందిన ఘటనపై మిస్టరీ మరింత ముదురుతోంది. బిర్యానీ, పుచ్చకాయ తిన్న కొన్ని గంటలకే వారు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారగా, తాజాగా వెలుగులోకి వచ్చిన వివరాలు కేసుకు కొత్త మలుపు తీసుకొచ్చాయి. వాళ్లు తిన్న పుచ్చకాయలో ఎలాంటి కల్తీ జరగలేదని పరీక్షల్లో తేలింది. ముంబయికి చెందిన అబ్దుల్లా డోకాడియా, ఆయన భార్య నస్రీన్, ఇద్దరు కుమార్తెలు ఆదివారం (ఏప్రిల్ 25) తెల్లవారుజామున వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురై వరుసగా మృతి చెందారు. మరణానికి ముందు వారు బిర్యానీ, పుచ్చకాయ తీసుకోవడంతో ఫుడ్ పాయిజనింగ్ అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్(ఎఫ్‌డిఎ) అధికారులు ఆహార నమూనాలను పరీక్షించారు. మరణానికి ముందు వారు తిన్న ఆహారంలో కల్తీ జరగలేదని ఎఫ్‌డిఎ పరీక్షల్లో తేలింది. ముఖ్యంగా పుచ్చకాయలో సింథటిక్ రంగులు లేదా కృత్రిమ తీపి పదార్థాల ఆనవాళ్లు లభించలేదని స్పష్టం చేశారు. కృత్రిమ రసాయనాల ఆనవాళ్లు గానీ లభించలేదని అధికారులు వెల్లడించారు. అయితే బ్యాక్టీరియా పరీక్షలు జరపలేదని, అందువల్ల సూక్ష్మ జీవులు కారణమై ఉండొచ్చని అధికారులు పేర్కొన్నారు. మరోవైపు, విషపదార్థాల వినియోగం కోణాన్ని కూడా తోసిపుచ్చలేమని తెలిపారు.

గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ కేరళలో

# హోటల్ యజమానుల నిరసనలు




**పాలక్కాడ్ :** వాణిజ్య గ్యాస్ సిలిండర్ల ధరల పెంపుపై ప్రజల నుంచి పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా హోటల్ రంగంలో ఉన్న వ్యాపారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తాజాగా వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర ఒక్కసారిగా రూ. 1000 మేర పెరగడాన్ని నిరసిస్తూ కేరళలోని పాలక్కాడ్‌లో హోటల్, రెస్టారెంట్ యజమానులు శనివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. నిరసనకారులు గ్యాస్ సిలిండర్ల చిత్రాలు, ప్లకార్డులు పట్టుకుని పట్టణం గుండా ర్యాలీ చేశారు. టెలివిజన్ ఛానెళ్లలో ప్రసారమైన దృశ్యాల ప్రకారం వారు ఒక స్ట్రెచర్‌పై రెండు సిలిండర్లను పెట్టి వాటికి పూలమాల వేసి మోసుకెళ్తున్న దృశ్యాలు వార్తా చానెళ్లలో ప్రసారమవుతున్నాయి. వాణిజ్య గ్యాస్ సిలిండర్ల అధిక ధరల దృష్ట్యా తమ వ్యాపారాలను కొనసాగించడం కష్టమవుతుందని హోటల్, రెస్టారెంట్ యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాణిజ్య గ్యాస్ సిలిండర్ల కొరత కారణంగా తమలో చాలామంది గతంలో తమ సంస్థలను మూసివేయవలసి వచ్చిందని, చాలావరకు ఇటీవలే తిరిగి తెరిచామని వారు తెలిపారు. 'కానీ వాణిజ్య గ్యాస్ సిలిండర్ల ధరలలో ఆకస్మిక పెరుగుదల మా కార్యకలాపాలను ప్రభావితం చేసింది' అని నిరసనకారులు అన్నారు. విలేకరుల ప్రశ్నలకు సమాధానంగా రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల రెస్టారెంట్ యజమానులు, కార్మికులు కూడా ఇలాంటి ఆందోళనలనే వ్యక్తం చేశారు. వాణిజ్య ఎల్‌పిజి సిలిండర్ల ధరలను రూ.993 మేర పెంచినందుకు నిరసనగా, మే 6న రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేయనున్నట్లు కేరళ హోటల్, రెస్టారెంట్ అసోసియేషన్ (కెహెచ్‌ఆర్‌ఎ) శుక్రవారం ప్రకటించింది. ఎల్‌పిజి ధరలను అన్యాయంగా పెంచారని ఆరోపిస్తూ, దానికి నిరసనగా ఆ రోజు కేరళ వ్యాప్తంగా అన్ని హోటళ్లు, రెస్టారెంట్లు మూతపడతాయని ఎహెచ్‌ఆర్‌ఎ రాష్ట్ర అధ్యక్షుడు జి. జయపాల్ తెలిపారు. గత ఐదు నెలల్లో ఒక్క సిలిండర్ ధర మొత్తం రూ.1,498 పెరిగిందని ఆయన తెలిపారు. మే 6న వ్యాపార సంస్థలు మూతపడతాయని, జిల్లా కేంద్రాలు, ఆయిల్ కంపెనీ కార్యాలయాల ముందు నిరసన ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు.


తెలంగాణ ప్రభుత్వము
జిల్లా కలెక్టర్ వారి కార్యాలయము (భూసేకరణ)
నాగర్ కర్నూల్ జిల్లా

**No.G2/477/2026** **తేదీ: 16.04.2026**
**Gaz. No.71/2026**

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19 (1) ప్రకారము

**ఫారం. 6**

**ప్రాథమిక ప్రకటన**

నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలములోని పంజుగుల గ్రామ పరిధి నందు ఈ క్రింది షెడ్యూల్లో ఉదహరించిన **ఎ.5.18 గుంటలు** భూమి మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకం క్రింద ప్రజా ప్రయోజనార్థం అనగా డిస్ట్రిబ్యూటరి కెనాల్ - 64 (Major-2/Minor-L5) నిమిత్తం సేకరించవలసిన అవసరం ఉన్నదని జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్ గారు భావిస్తున్నారు. కాబట్టి **ఎ. 5.18 గు.** భూమి డిస్ట్రిబ్యూటరి కెనాల్ - 64 (Major-2/Minor-L5) మిత్తం భూసేకరణ ద్వారా సేకరించుటకు గాను ప్రాథమిక ప్రకటన చేయడమైనది. సేకరించడానికి నిర్ధారించిన భూముల వివరాలు సంక్షిప్తంగా క్రింది ప్రకారం గలవు.

**షెడ్యూల్**

గ్రామము: పంజుగుల మండలం: కల్వకుర్తి జిల్లా: నాగర్‌కర్నూల్

| క్ర. సం. | సర్వే నెం./ ఎస్.డి. నెం. | పట్టా/ఇనాం etc., | భూవర్గీకరణ మెట్ట/తరి | భూసేకరణకు ప్రతిపాదించిన విస్తీర్ణము ఎ./గుంటలు | పట్టాదారు పేరు, అనుభవదారు పేరు మరియు ఏవైన హక్కులు గల యితర వ్యక్తులు | సరిహద్దులు ఉ | ద | తూ | ప | చెట్లు | | నిర్మాణములు | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1 | 477 | పట్టా | మెట్ట | 0.13 | బోడ పర్వతాలు తండ్రి కిష్టయ్య (0.07)<br>బోడ సాయమ్మ భర్త రాములు (0.06)<br>బోడ రాములు తండ్రి కిష్టయ్య<br>బోడ లక్ష్మమ్మ భర్త కృష్ణయ్య<br>బోడ ఆంజనేయులు తండ్రి రాములు<br>బోడ విజయ్ తండ్రి రాములు<br>నెంట లింగమయ్య తండ్రి కాశన్న<br>ప్రభుత్వ భూమి | 481 | VB | 478 | VB | లేవు | లేవు | లేవు | లేవు |
| 2 | 478 | పట్టా | మెట్ట | 0.38 | గోరెంట్ల పవన్ తండ్రి కృష్ణయ్య (0.22)<br>బోడ రాములు తండ్రి కిష్టయ్య (0.08)<br>గోరెంట్ల కృష్ణయ్య (0.08)<br>బోడ పర్వతాలు తండ్రి కిష్టయ్య<br>బోడ సాయమ్మ భర్త రాములు<br>గోరెంట్ల తీర్పతయ్య తండ్రి మల్లయ్య<br>బోడ శ్రీలత భర్త ఆంజనేయులు | 479 | 477 | 475 | 477 | లేవు | లేవు | లేవు | లేవు |
| 3 | 475 | లావుణి పట్టా | మెట్ట | 0.01 | కె పార్వతమ్మ భర్త రామస్వామి (0.01) మరియు ఇతరులు | 471 | 476 | 472 | 478 | లేవు | లేవు | లేవు | లేవు |
| 4 | 472 | పట్టా | మెట్ట | 0.28 | కె పార్వతమ్మ భర్త రామస్వామి (0.28)<br>వీరపాకుల రాములు తండ్రి ముత్యాలు<br>వీరపాకుల లక్ష్మయ్య తండ్రి బాలయ్య<br>వీరపాకుల రాంచంద్రయ్య తండ్రి బస్వయ్య<br>వీరపాకుల గణేష్ తండ్రి బస్వయ్య<br>వీరపాకుల శాంతమ్మ భర్త హుస్సేన్<br>వీరపాకుల రామస్వామి తండ్రి సాయిలు | 471 | 475 | 473 | 475 | లేవు | లేవు | లేవు | లేవు |
| 5 | 473 | పట్టా | మెట్ట | 1.00 | పార్వతమ్మ(0.12)<br>బడె బస్వయ్య (0.06)<br>వెంకటయ్య తండ్రి చిన్న రాములు (0.04)<br>ఎల్లయ్య తండ్రి సాయన్న (0.04)<br>పుల్లయ్య తండ్రి మొగులాలు (0.02)<br>తిరుపాలు తండ్రి పెద్ద రాములు (0.04)<br>చిన్న వెంకటయ్య (0.04)<br>ఎల్లయ్య (0.04)<br>వీరపాకుల రామస్వామి తండ్రి పర్సయ్య<br>లక్ష్మయ్య తండ్రి చంద్రయ్య<br>వీరపాకుల ఎట్టయ్య తండ్రి బక్కయ్య<br>వీరపాకుల దేవమ్మ భర్త బాల్రాం<br>వీరపాకుల వెంకటయ్య తండ్రి చంద్రయ్య<br>వీరపాకుల బాలయ్య తండ్రి దుర్గయ్య<br>వీరపాకుల బాలమ్మ భర్త వెంకటయ్య<br>వీరపాకుల రామస్వామి తండ్రి ముత్తయ్య<br>వాడాల మొగులయ్య తండ్రి పుల్లయ్య<br>వీరపాకుల వెంకటయ్య తండ్రి రాములు<br>వాద్యాల భీమయ్య తండ్రి పుల్లయ్య<br>కొంగల్ల పార్వతమ్మ భర్త రామస్వామి<br>వీరపాకులఎల్లయ్య తండ్రి శాయన్న<br>బడె బసువయ్య తండ్రి ఎంకయ్య<br>వీరపాకుల రామస్వామి తండ్రి రాములు<br>వీరపాకుల రాజమ్మ భర్త ఎల్లయ్య<br>వంగూరి లత భర్త శేఖర్ రెడ్డి<br>వి చంద్రమ్మ భర్త చంద్రయ్య<br>వీరపాకుల ఎల్లమ్మ భర్త ఎల్లయ్య<br>వీరపాకుల పరుషరాములు తండ్రి రాములు<br>వీరపాకుల నాగయ్య తండ్రి రాములు<br>వీరపాకుల వెంకటయ్య తండ్రి రాములు<br>వీరపాకుల పరుషరాములు తండ్రి ఎల్లయ్య<br>వీరపాకుల ఈశ్వరయ్య తండ్రి చిన్నఎల్లయ్య<br>వీరపాకుల శ్రీరామ్ తండ్రి చిన్నఎల్లయ్య<br>వీరపాకుల బాలయ్య తండ్రి పర్మయ్య<br>వీరపాకుల ఈశ్వరమ్మ భర్త బడె బసవయ్య<br>బీరమ్మ భర్త మల్లయ్య<br>వీరపాకులు రామేశ్వరి భర్త నాగయ్య<br>వీరపాకుల తిరుపాలు తండ్రి పెద్ద రాములు<br>ఇ రమేష్ బాబు తండ్రి నిరంజన్<br>వీరపాకుల శివుడు తండ్రి సత్యమయ్య<br>వీరపాకుల శ్యామలమ్మ భర్త బాలస్వామి<br>ఇ జ్యోతి భర్త వెంకటయ్య<br>సాయిబాబు యాదవ్ తండ్రి గొసుల రాములు<br>వీరపాకుల లక్ష్మమ్మ భర్త లక్ష్మయ్య<br>మిరియాల అంబారీష్ తండ్రి కృష్ణయ్య<br>కొంగళ్ళ శివ తండ్రి బీరయ్య | 452 | 475 | 449 | 472 | లేవు | లేవు | లేవు | లేవు |
| 6 | 449 | పట్టా | మెట్ట | 0.36 | ఉషన్న తండ్రి చిన్నయ్య, శీనయ్య తండ్రి రాములు, రేణుక నాగరాజు తండ్రి లక్ష్మయ్య, మాసయ్య తండ్రి మల్లయ్య, లావణ్య భర్త వెంకటయ్య (0.36)<br>వీరపాకుల రామస్వామి తండ్రి పర్సయ్య<br>వీరపాకుల వెంకటయ్య తండ్రి చంద్రయ్య<br>పల్లె ఎల్లమ్మ భర్త మల్లయ్య<br>వీరపాకుల దేవమ్మ భర్త బాల్రాం<br>వీరపాకుల మాసయ్య తండ్రి మల్లయ్య<br>వీరపాకుల వెంకటయ్య తండ్రి మశన్న<br>వాడాల మొగులయ్య తండ్రి పుల్లయ్య<br>వీరపాకుల నాగమ్మ భర్త మైసయ్య<br>వీరపాకుల బాలస్వామి తండ్రి గట్టయ్య<br>వీరపాకుల పరుషరాములు తండ్రి చంద్రయ్య<br>వీరపాకుల లక్ష్మయ్య తండ్రి సంజన్న<br>వాద్యాల భీమయ్య తండ్రి పుల్లయ్య<br>మట్ట శ్రీనివాస్ తండ్రి భీమయ్య<br>వీరపాకుల శ్రీనివాసులు తండ్రి పెద్ద రాములు<br>వీరపాకుల చంద్రమ్మ భర్త ఎట్టయ్య<br>వాడాల వెంకటయ్య తండ్రి పుల్లయ్య<br>గుండెల రేణుక భర్త లింగమయ్య<br>వీరపాకుల రాంచంద్రయ్య తండ్రి బస్వయ్య<br>వీరపాకుల గణేష్ తండ్రి బస్వయ్య<br>వీరపాకుల నిరంజన్ తండ్రి బుగ్గయ్య<br>వీరపాకుల శివుడు తండ్రి సత్యమయ్య<br>ఇ జ్యోతి భర్త వెంకటయ్య | 451 | 448 | 446 | 473 | లేవు | లేవు | లేవు | లేవు |
| 7 | 446 | పట్టా | మెట్ట | 0.36 | నంబి శేఖర్ తండ్రి వెంకటయ్య (0.10)<br>వాడాల మొగులయ్య తండ్రి పుల్లయ్య (0.07)<br>కొంగళ్ళ మల్లయ్య తండ్రి అంజయ్య (0.13)<br>లక్ష్మయ్య (0.03)<br>వెంకటయ్య (0.03)<br>కొంగళ్ళ అంజయ్య తండ్రి బాలయ్య<br>నంబి వీరప్ప తండ్రి జంగయ్య<br>వాద్యాల భీమయ్య తండ్రి పుల్లయ్య<br>వాద్యాల కృష్ణమ్మ భర్త మొగులయ్య<br>నంబి లక్ష్మయ్య తండ్రి జంగయ్య<br>నంబి శ్రీను తండ్రి వెంకటయ్య<br>వాద్యాల చిట్టి భర్త భీమయ్య | 450 | 447 | 445 | 449 | లేవు | లేవు | లేవు | లేవు |
| 8 | 445 | పట్టా | మెట్ట | 0.26 | ప్రతాప్ రెడ్డి (0.26)<br>నంబి వీరప్ప భర్త జంగయ్య<br>నంబి లక్ష్మయ్య తండ్రి జంగయ్య<br>నంబి శ్రీను తండ్రి వెంకటయ్య<br>నంబి శేఖర్ తండ్రి వెంకటయ్య<br>కంకాల జ్యోతి భర్త రామకృష్ణ<br>నంబి స్వాతి భర్త లక్ష్మయ్య | 454 | 444 | 454 | 446 | లేవు | లేవు | లేవు | లేవు |
| | | మొత్తము | | 5.18 | | | | | | | | | |

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్ట పరిహార నియమావళి 2014 రూల్ 19 (1)ని అనుసరించి సంబంధిత వ్యక్తులందరి దృష్టికి ఇట్టి విషయాన్ని తెస్తూ ఈ ప్రకటన జారీ చేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 12 లో గల అధికారాలను అనుసరించి జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్ గారు, ప్రత్యేక ఉపకలెక్టరు, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్, మరియు వారి సిబ్బందికి సదరు భూమిలో ప్రవేశించి సర్వే మరియు యితర పనులు చేపట్టుటకు అధికారమివ్వనైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి జిల్లా కలెక్టరు గారి అనుమతి లేకుండా షెడ్యూల్లో ప్రకటించిన భూములకు సంబంధించి క్రయ, విక్రయాలు లేదా ఏవిధమైన లావాదేవిలు జరుపరాదని తెలియచేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 15 ననుసరించి ప్రతిపాదిత భూసేకరణ పై ఏమైన అభ్యంతరములుగాని, ఆక్షేపణలు గాని ఉన్న యెడల సంబంధిత వ్యక్తులు ఈ ప్రకటన ప్రచురించబడిన తేది నుండి 60 (అరువది) దినములలోగా ప్రత్యేక ఉప కలెక్టరు, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్, గారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకోనవచ్చును.

భూసేకరణ తల పెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్టీల్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును. లేనిచో సీకరించబడవు.

పైన చూపిన భూమిని భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైనా పని దినములలో మరియు కార్యాలయ పని వేళలలో భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ కార్యాలయము, నాగర్‌కర్నూల్ నందు పరిశీలించుకొను నిమిత్తం అందుబాటులో ఉండును.

ఇట్టి ప్రతిపాదించిన భూసేకరణ తెలంగాణ ప్రభుత్వము నీటిపారుదల శాఖ G.O.Ms.No. 51, తేది: 25.07.2017 ద్వారా భూసేకరణ, నష్టపరిహారము, పునరావాస, పునరుపాధి కల్పన చట్టము, 2013 లోని అధ్యాయము - II మరియు అధ్యాయము - III అనగా సామాజిక ప్రభావిత అధ్యాయము మరియు ఆహార భద్రత నుండి మినహాయింపును ఇవ్వడము జరిగినది.

సం/-
స్పెషల్ డిప్యూటి కలెక్టర్ (భూ.సే), యూనిట్-I, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్

సం/-
అదనపు కలెక్టరు నాగర్‌కర్నూల్

సం/-
జిల్లా కలెక్టర్, నాగర్‌కర్నూల్

DIPR RO NO. 147/LA/PP/Advt/Pub/2026-27

# క్యూబాపై మళ్ళీ ట్రంప్ ఏకపక్ష ఆంక్షలు

ప్రభుత్వాన్ని ప్రజల నుండి వేరు చేసేందుకే కుట్ర : డయాజ్ కానెల్

విప్లవంకోసం ప్రాణత్యాగాలకు సిద్ధం

ఆర్థికంగా దెబ్బతీసేందుకే ఉగ్రవాద జాబితాలో చేర్చారు

మీడియాలో వాస్తవాల వక్రీకరణ కథనాలపై ఆవేదన

**హవానా:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి క్యూబాపై ఏకపక్షంగా కొత్త ఆంక్షలు విధించారు. ఈ మేరకు ఒక ఉత్తర్వు జారీ చేశారు. ఇరాన్ తర్వాత తమ లక్ష్యం కరీబియన్ దేశం క్యూబాయేనని పదే పదే ప్రకటనలు చేస్తున్న డోనాల్డ్ ట్రంప్ ఆ దేశంపై అత్యంత కఠిన ఆర్థిక ఆంక్షలు విధించారు. ఇరాన్ ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీసేందుకు హోర్ముజ్ జలసంధి నుండి చమురు నౌకల రాకపోకలను ఏ విధంగా స్తంభింపజేసి కొత్త నాటకం అమలు చేస్తున్నారో అదే పద్ధతిలో క్యూబాను మరింత దెబ్బతీసేందుకు క్యూబా కీలక అధికార వర్గాలను లక్ష్యంగా చేసుకుని మే ఒకటో తేదీ నుండి కొత్త ఆంక్షలు విధించారు. విదేశీ బ్యాంకులతో కలిసి పనిచేసే క్యూబన్లకు ఈ ఆంక్షలను వర్తింపజేశారు. క్యూబా ఆర్థిక వ్యవస్థను తుడిచిపెట్టే ఉద్దేశంతోనే ఆంక్షలు విధించినట్లు ఈ సందర్భంగా ట్రంప్ చెప్పారు. ఇంధనం, రక్షణ రంగం, సంబంధిత ముడిఖనిజ వనరులు, లోహాలు, గనులు, ఆర్థిక సేవలు, భద్రతారంగాలకు చెందిన క్యూబన్లపై దృష్టి పెట్టారు. వీరంతా క్యూబా ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా ఉంటారు. అమెరికా భద్రతకు, విదేశాంగ విధానానికి బెడదగా మారిన, అందుకు బాధ్యులైనవారిపై ఆంక్షలు విధిస్తున్నట్లు ఉత్తర్వులో ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా ఆంక్షలను క్యూబా తీవ్రంగా వ్యతిరేకించింది. ఆ దేశ అధ్యక్షుడు, క్యూబా కమ్యూనిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ మొదటి కార్యదర్శి మిగ్యుల్ డయాజ్–కానెల్ బెర్ముడెజ్ ''కేనల్ రెడ్' డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై స్పానిష్ పొలిటికల్ సైంటిస్టు ఇగ్లిసియాస్ టుర్రియన్‌కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో, క్యూబా ప్రభుత్వాన్ని, ప్రజలనుండి ప్రజల మద్దతు నుండి వేరుచేయడమే లక్ష్యంగా ఆంక్షల కుట్రకు పాల్పడిందన్నారు. కానీ క్యూబా నాయకత్వమంతా సామాన్య ప్రజలలో ఒకభాగమేనని, తాము కులీన వర్గాల నుండి రాలేదని, నాయకత్వం యావత్తూ సామాన్య ప్రజల నుండే వచ్చిందన్నారు. ''విప్లవం కోసం క్యూబన్లు ప్రాణత్యాగాలకు సిద్ధంగా ఉన్నారు'' అని చెప్పారు. క్యూబా ఆర్థిక పరిస్థితి, అమెరికా ఆర్థిక, వాణిజ్య, ద్రవ్యపరమైన ఆంక్షలు, వాటి పరిణామాలను వివరించారు. క్యూబా గురించి మీడియాలో వాస్తవాలను వక్రీకరించే కథనాలు ప్రచారంలోకి వచ్చాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. క్యూబా విప్లవసాధంలో, కార్యక్షేత్రంలో ఈనాటిక సర్వసైన్యాధ్యక్షుడు ఫిడెల్ కాస్ట్రో రూజ్ భావజాల స్ఫూర్తి ఇప్పటికీ కనిపిస్తోందన్నారు. సంక్లిష్ట సమయాల్లో నిరంతరం ఆయన స్ఫూర్తిదాయకంగా నిలుస్తారన్నారు. 1990వ దశకంలో ఉన్న సోషలిస్టు బ్లాక్ క్యూబాకు ఎంతో గొప్ప అండదండలుగా నిలిచిందని, ఈనాడు ఆ సోషలిస్టు బ్లాకు కుప్పకూలిపోయినప్పుడు తాము సృజనాత్మకంగా ఆలోచించి ముందుకు వెళ్ళామని అన్నారు. బొలివేరియన్ విప్లవం, చైనా, వియత్నాంలతో సంబంధాల, ఇచ్చిన మద్దతు క్యూబాను కొత్త దశకు వెళ్ళేందుకు వీలు కల్పించాయని, ముఖ్యంగా ట్రంప్ అధికారంలోకి వచ్చాక 2019 నుండి పరిస్థితులు గుణాత్మకంగా భిన్నరూపం సంతరించుకున్నాయన్నారు. అఈనాడు తాము ''బ్లాకేడ్'' (దిగ్బంధనం) అనే ఒక ప్రత్యేక దశలో ఉన్నామని చెప్పారు. స్వేచ్ఛామార్కెట్ గురించి మాట్లాడే పెట్టుబడిదారీ వ్యవస్థ క్యూబాను ఆర్థికంగా దెబ్బతీసేందుకు, దిగ్బంధనం కోసం ఉగ్రవాద దేశాల జాబితాలో చేర్చిందని విమర్శించారు. సామ్రాజ్యవాద వ్యవస్థ తన నిబంధనలను తానే ఉల్లంఘిస్తూ ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తోందన్నారు.

**అమెరికాకు క్యూబా ముప్పు హాస్యాస్పదం**

ప్రపంచంలో అతిశక్తిమంతమైన దేశం, సైనికంగా బలమైన ఆయుధాలు చేకూర్చుకున్న అమెరికాకు క్యూబా దేశం ముప్పుగా పరిణమించిందని చెప్పడం హాస్యాస్పదమైన విషయమని క్యూబా విదేశీ వ్యవహారాలమంత్రి బ్రూనో రోడ్రిగ్జ్ పర్రిల్లా సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. ''సాపేక్షంగా క్యూబా చాలా చిన్నదేశం, అభివృద్ధి చెందుతున్న దేశం, ఆది నుండీ ఆర్థిక యుద్ధంతో సతమతమవుతున్నదేశం, కానీ ప్రపంచంలో ఆర్థిక, సైనిక, సాంకేతిక రంగాలలో మహాశక్తిగా ఉన్న అమెరికాకు క్యూబా ముప్పుగా మారిందని ఆ దేశ విదేశాంగశాఖ వాదించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మౌలికంగా క్యూబా శాంతియుత దేశమని, తన భూభాగాన్ని దుర్వినియోగం చేసేందుకు ఇతరులను అనుమతించబోదని, ఎవ్వరిపైనా దాడి చేయదని, ఉగ్రవాదం, అంతర్జాతీయ వ్యవస్థీకృత నేరాలు వంటివాటికి వ్యతిరేకంగా చాలా స్వచ్ఛమైన చరిత్ర క్యూబాకు ఉందని అన్నారు. ఈ సమాచారమంతా అమెరికా గూఢచారి వర్గానికి తెలుసుని, తప్పుతోవ పట్టించే వాదనలతో ఎలాంటి సాకులూ సృష్టించలేరని హెచ్చరించారు.



# జర్మనీ నుండి 5 వేలమంది సేనల ఉపసంహరణ

6–12 నెలల్లో ప్రక్రియ పూర్తి చేస్తామని పెంటగాన్ వెల్లడి

ఒక స్పష్టత ఇవ్వండి: ట్రంప్‌ను కోరిన నాటో

**వాషింగ్టన్:** జర్మనీ నుండి 5000 మంది సేనలను ఉపసంహరించాలని అమెరికా రక్షణమంత్రిత్వ శాఖ భావిస్తోంది. అమెరికా రక్షణమంత్రి హెగ్సెత్ నుండి ఉత్తర్వులు రావడంతో రాబోయే ఆరు నుండి 12 నెలలలోపు ఈ ఉపసంహరణ ప్రక్రియ పూర్తి చేయాలని యోచిస్తున్నట్లు పెంటగాన్ అధికార ప్రతినిధి సేన్ పార్నెల్ ఒక ప్రకటనలో చెప్పారు. ఇరాన్‌తో యుద్ధం విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్, జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ మధ్య నెలకున్న వివాదం నేపథ్యంలో పెంటగాన్ నుండి ఈ ప్రకటన వచ్చింది. ఈ ప్రకటన వెలువడిన వెంటనే నాటో స్పందించింది. సేనల ఉపసంహరణపై ఒక స్పష్టత ఇవ్వాలని కోరింది. ఈ విషయంపై అమెరికాను సంప్రదిస్తున్నట్లు పేర్కొంది. రాబోయే యుద్ధ పరిష్కారానికి జరుగుతున్న దౌత్య చర్యల్లో ఇరాన్ ప్రతినిధి బృందం అమెరికాను అవమానపరిచిందని వ్యాఖ్యానించిన మెర్జ్‌పై అమెరికా సెనేట్‌లో చేసిన ప్రసంగంలో ట్రంప్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించిన ఒక రోజు తర్వాత పెంటగాన్ నుండి ఈ సంకేతాలు వచ్చాయి. జర్మనీలో అమెరికాకు గణనీయస్థాయిలో సైనిక ఉనికి ఉంది. ఆ దేశంలో దాదాపు 36,000 మంది అమెరికా క్రియాశీల సైనికులు మోహరించి ఉన్నారు. స్పెయిన్, ఇటలీ వంటి వంటి నాటో కూటమి దేశాలు యుద్ధంలో తమకు సహకరించలేదని సెనేట్‌లో ట్రంప్ విమర్శించారు. కష్టకాలంలో తమకు ఎంతమాత్రం సహాయం చేయని మిత్రదేశాలలో తమ సేనలను ఎందుకు ఉంచాలి? అని సెనేట్ ప్రసంగంలో ట్రంప్ ప్రశ్నించారు. మెర్జ్ సోషల్ మీడియా ద్వారా చాలా దారుణంగా పోస్టింగులు పెడుతున్నారని, ఆ దేశంతో ఇంధనం, వలసలు వంటి అనేక సమస్యలు ఉన్నాయని అంతకు ముందు ట్రంప్ తన ట్రూత్ సోషల్ వేదికగా పేర్కొన్నారు. ఈ వారారంభంలో మెర్జ్ ఒక యూనివర్సిటీలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, పశ్చిమాసియాలో అనుసరించాల్సిన యుద్ధ వ్యూహం అమెరికా వద్ద లేదని, వారు ఈ యుద్ధం నుండి బయటపడేందుకు వారి దగ్గర ఉన్న వ్యూహాత్మక నిష్క్రమణ మార్గం ఏమిటో తనకు అర్థం కావడం లేదని విమర్శించారు. మరో వైపు ఇరానియన్ ప్రతినిధులు కూడా చర్చలు జరపడంలో, చర్చలు జరపకుండా ఉండటంలో చాలా నైపుణ్యంగలవారని, చర్చలకు వచ్చినఅమెరికన్ ప్రతినిధులను ఎలాంటి ఫలితం లేకుండా వెనక్కు పంపిస్తున్నారని, ఇరాన్ నాయకత్వంవల్ల యావత్ అమెరికా దేశం అవమానాలకు గురవుతోదని అన్నారు. దీనిపై ట్రంప్ సోషల్ మీడియా ద్వారా స్పందిస్తూ, ఇరాన్ అణ్వాయుధాన్ని మెర్జ్ సమర్థిస్తున్నారని, ఆయన ఏం మాట్లాడుతున్నారో ఆయనకే తెలియడంలేదని, అందువల్ల జర్మనీ ఆర్థికవ్యవస్థగానీ, ఇతర విషయాల్లోగానీ ఇంత అధ్వాన్నంగా ఉండటంలో ఎంతమాత్రం ఆశ్చ ర్యం లేదని విమర్శించారు.



# జర్మన్ ఛాన్సలర్ రాజీనామా చేసేవరకూ... ఆరోపణలు కొనసాగుతాయ్:దిమిత్రియేవ్



**మాస్కో:** జర్మన్ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ తన తప్పులు సరిదిద్దుకోవడం నేర్చుకునేవరకూ లేదా తన పదవికి రాజీనామా చేసేవరకూ ఆయనపై ఆరోపణలు కొనసాగుతాయని విదేశాలతో ఆర్థిక సహకారం, పెట్టుబడులకు సంబంధించిన విషయాల్లో రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ప్రత్యేక దూత, సలహాదారు, రష్యా ప్రత్యక్ష పెట్టుబడుల నిధి సిఇఓ కిరిల్ దిమిత్రియేవ్ అన్నారు. జర్మనీ నుండి 5000 మంది అమెరికా సైన్యాలను రాబోయే ఆరు నుండి 12 నెలల వ్యవధిలో ఉపసంహరిస్తామని అమెరికా సైనిక కేంద్రం పెంటగాన్ అధికార ప్రతినిధి ప్రకటించిన వెంటనే డిమిత్రియేవ్ ఎక్స్ వేదికగా శనివారం స్పందించారు. ఇరాన్ వద్ద అణ్వాయుధం ఉండటాన్ని మెర్జ్ సమర్థిస్తున్నారని ట్రంప్ అంతకుముందు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఐతే అమెరికా సెనేట్‌లో చేసిన ప్రసంగంలో మిత్రదేశాల నుండి అమెరికా సేనలను ఉపసంహరిస్తామని ప్రకటించడం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ''మెర్జ్ తన తప్పులను సరిదిద్దుకోవడం నేర్చుకునే వరకూ లేదా తన పదవి నుండి వైదొలగేవరకూ ఆయనపై ఇదేవిధంగా ఆరోపణల పరంపర పెరుగుతూనే ఉంటుంది'' అని దిమిత్రియేవ్ ఎక్స్ వేదికగా స్పందించారు.

స్పెయిన్, ఇటలీల నుండి కూడా సేనలను ఉపసంహరిస్తారా? అని గడచిన గురువారం పాత్రికేయులు ట్రంప్‌ను ప్రశ్నించినప్పుడు, ''ఖచ్చితంగా ఆ విషయం ఆలోచిస్తాను, ఎందుకు అలా చేయకూడదు? ఇటలీ మాకు ఎలాంటి సాయం చేయడం లేదు, స్పెయిన్ దేశమైతే మరీ దారుణం'' అని వ్యాఖ్యానించారు. యూరప్‌లో రక్షణశాఖ సైనిక మోహరింపులపై సమీక్ష చేసిన తర్వాతే తాము నిర్ణయం తీసుకున్నామన్నారు. ఆరేళ్ళక్రితం కూడా జర్మనీ నుండి సైన్యాన్ని ఉపసంహరించడం లేదా ఆ సైన్యాన్ని నాటోలోని ఇతర మిత్రదేశాలకు తరలించాలని ప్రతిపాదన వచ్చినప్పటికీ అది వీగిపోయింది. ఐతే, జర్మనీ రక్షణమంత్రి బోరిస్ పిస్టోరియస్ శనివారం బెర్లిన్‌లో జర్మన్ ప్రెస్ ఏజన్సీ ప్రతినిధితో మాట్లాడుతూ, అమెరికా తీసుకున్న నిర్ణయం తమకు ఆశ్చర్యం కలిగించలేదని చెబుతూనే, ''ఐరోపాలో, ముఖ్యంగా జర్మనీలో అమెరికా ఉనికికీ, జర్మనీ ప్రయోజనాలకు అమెరికా సేనలు ఉండటం ఎంతో ముఖ్యమైన విషయం'' అన్నారు. 12,000 మంది అమెరికా సేనలను జర్మనీ నుండి యూరప్‌లోని ఇతర నాటో కూటమి దేశాలకు లేదా తిరిగి అమెరికాకు తరలించాలని 2020లో చేసిన ప్రతిపాదనను కాంగ్రెస్ స్తంభింపజేయగా, ఆ తర్వాత అధ్యక్షుడు జో బైడెన్ ఆ నిర్ణయాన్ని వెనక్కు తీసుకున్నారు. అదే సమయంలో ట్రంప్ స్పందిస్తూ, జర్మనీ చాలా బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తోందని, నాటో పేర్కొన్న రెండూ శాతం సైనిక వ్యయాన్ని కూడా కేటాయించడం లేదని అన్నారు.

**నాటో కూటమి విచ్ఛిన్నదశ : టస్క్**

నాటో కూటమి విచ్ఛిన్నదశ కొనసాగుతోందని పోలెండ్ ప్రధాన మంత్రి డోనాల్డ్ టస్క్ వ్యాఖ్యానించారు. జర్మనీ నుండి 5000 మంది అమెరికా సైన్యాలను ఉపసంహరించాలని ఆ దేశ రక్షణమంత్రి హెగ్సెత్ శనివారం పెంటగాన్‌కు ఒక ఉత్తర్వు జారీ చేయడంతో పలువురు నాయకులు వ్యాఖ్యానాలు చేయడం ప్రారంభించారు. దీంట్లో భాగంగా డోనాల్డ్ టస్క్ స్పందిస్తూ, అమెరికా–యూరప్ మధ్య కొత్త శత్రువు ఎక్కడో లేరని అన్నారు. ''ట్రాన్స్ అట్లాంటిక్ సమాజానికి ముప్పు బాహ్య శత్రువు నుండి రాలేదు, మన కూటమి నిరంతరం విచ్ఛిన్నమవుతోంది, అదే మన శత్రువు, ఈ వినాశకరమైన ధోరణిని తిప్పికొట్టడానికి మనందరం చేయగలిగినదంతా చేయాలి'' అని ఎక్స్ వేదికగా ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుతం జర్మనీలో 38,000 మంది అమెరికా సైనికులు అతిపెద్దభాగంగా మోహరించి ఉన్నారని ఆయన అంచనా వేశారు.

# నాలుగేళ్ళలో రష్యాకు ఏడు బిలియన్ డాలర్ల నష్టం

జెలెన్‌స్కీ... చమురు సదుపాయాలపై మళ్ళీ ఉక్రేన్ దాడి

**మాస్కో:** రష్యా చమురు సదుపాయాలపై ఉక్రేన్ మరోసారి దాడి చేసింది. దీంతో ఆ ప్రాంతమంతా తీవ్ర కాలుష్యం వ్యాపించింది. ఇటీవల క్షిపణి, డ్రోన్ సామర్థ్యాలను గణనీయంగా పెంచుకున్న ఉక్రేన్ ఇటీవలి రోజుల్లో రష్యాలోని లోలోపలి భూభాగాల్లోకి చొచ్చుకు వెళ్ళి దాడులు చేస్తోంది. రష్యా చమురు కేంద్రాలపై దాడులు ప్రారంభించింది. రాగా ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఒక ప్రకటన చేస్తూ, గడచిన నాలుగు సంవత్సరాలుగా జరిగిన యుద్ధంలో రష్యాకు ఏడు బిలియన్ డాలర్ల మేరకు నష్టం వాటిల్లిందని, ప్రధానంగా ఈ నష్టం రష్యా చమురు ఎగుమతులపైనే పడిందని చెప్పారు. 1500 కి.మీ దూరంలో ఉన్న లక్ష్యాలను తమ డ్రోన్లు, క్షిపణులు దెబ్బతీస్తున్నాయని చెప్పారు. ఏప్రిల్ 18న మూడోసారి ఆయిల్ రిఫైనరీపై ఉక్రేన్ చేసిన దాడి వీడియోలను ఆ దేశం విడుదల చేసింది.

ఉక్రేన్ చేసిన తాజా దాడుల ఉపగ్రహ చిత్రాల్లో, ఈ పొగలు, కాలుష్యం నల్లసముద్రంలో ఉన్న రష్యా పర్యాటక ప్రాంతాలలో టూరిస్టులకు కూడా శ్వాసకోశ సమస్యలు సృష్టించాయని వెల్లడైంది. ఈ దాడులతో రష్యా చమురు ఎగుమతులకు సమస్యలు వచ్చాయి. ఈ ఎగుమతులు తగ్గిపోయాయి. ఐతే ఎంతమేరకు ఉక్రేన్ దాడులవల్ల రష్యా చమురు ఎగుమతులకు ఆర్థికనష్టం వాటిల్లిందన్న విషయం ఇంకా స్పష్టంగా వెల్లడి కాలేదు. ఐతే ఈ దాడులవల్ల పర్యావరణ కాలుష్యం విపరీతంగా పెరిగింది. ఉక్రేన్ డ్రోన్లు రష్యా చమురు రిఫైనరీపై దాడి చేశాయి.

## నిలిచిన ధాన్యం

(మొదటి పేజీ తరువాయి)

అన్ని చోట్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం అయ్యాయి. రైతులు తీసుకొచ్చిన ధాన్యం సకాలంలో కొనుగోలు చేయడం లేదు. కారణం ప్రధానంగా గన్నీ బ్యాగ్ల కొరత తీవ్రంగా ఉంది. రఘునాథపల్లి మండలంలోని కంచనపల్లి గ్రామంలో ఏకంగా గన్నీ బ్యాగ్‌లు లేకపోవడం వలనే కొనుగోలు చేయడం లేదని బోర్డు పెట్టిన పరిస్థితి. వరి ధాన్యం పరిస్థితియే కాదు మొక్కజొన్నల పరిస్థితి కూడా ఇదే. గన్నీ బ్యాగ్‌ల కొరత తీవ్రంగా ఉంది. కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగ్‌లు లేకపోవడం వలనే కాంటాలు వేయడం లేదని ఏకంగా బోర్డులు పెట్టారు. ఇక లారీల పరిస్థితి కూడా అంతే.

కాంటా వేసిన తరువాత ఒకొర రైతు 20 నుండి 30 రోజుల పాటు కళ్లాల వద్దనే లారీల కోసం ఎదురు చూస్తున్నారు. గతంలో ప్రతి మిల్లుకు కొన్ని కొనుగోలు కేంద్రాలను కేటాయించే వారు. అలా సమస్య ఈజీగా పూర్తి అయ్యేది. ఇప్పుడు ఏ కొనుగోలు కేంద్రాన్ని చెందిన ధాన్యం ఏ మిల్లులు వెళ్తుందో కూడా తెలియదు. లారీ లోడ్ అయిన తరువాత యాప్‌లో చెక్ చేస్తే ఆ లారీ ఏ మిల్లుకు కేటాయించబడితే ఆ మిల్లుకు వెళ్లి అన్‌లోడ్ చేయాలి. దీనితో ఆలస్యం అయ్యే పరిస్థితి ఉంది. శామీర్‌పేటలో ఓ రైతు నెల రోజులుగా ధాన్యం లిఫ్టింగ్ కోసం ఎదురు చూస్తున్న పరిస్థితి.

**గన్నీ బ్యాగ్‌లు, లారీల కొరత తీర్చాలి**

'జనగామ జిల్లాల్లో ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరగడం లేదు. దీనితో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గన్నీ బ్యాగ్‌లు సైతం సరిగా లేవు. లారీ లు ఎప్పుడు వస్తాయో తెలియదు. దీనితో కళ్ళాల్లో ధాన్యం పేరుకుపోతుంది. ఆకాల వర్షాల నేపథ్యంలో రైతులు ప్రతి రోజు పరదాలు కప్పుతున్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో స్పీడ్ పెంచాలి. ప్రధానంగా గన్నీ బ్యాగ్‌లు, లారీల కొరత తీరిస్తే కొంత మేరకైనా సమస్య పరిష్కారం అయ్యే అవకాశం ఉంది. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.'

**– ఆది సాయన్న,**
తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం, జనగామ జిల్లా అధ్యక్షుడు

## పేలిన ఐఇడి

(మొదటి పేజీ తరువాయి)

గాయపడిన బస్తర్ ఫైటర్స్‌కు చెందిన పరమానంద్ కోర్రామ్ (29)ను హెలికాప్టర్‌లో రాయ్‌పూర్ ఆసుపత్రికి తరలించారు. కానీ ఆయన చికిత్సపొందుతూ మరణించారు. వీరిలో సుఖ్‌రామ్ బిజాపూర్ జిల్లాకు చెందినవారు కాగా, మిగిలిన ముగ్గురూ కాంకేర్ జిల్లాలో వివిధ ప్రాంతాలకు చెందినవారు.ఇది అత్యంత విషాదకరమైన సంఘటన అని ఛత్తీస్‌గఢ్ ఉపముఖ్యమంత్రి విజయ్ శర్మ అన్నారు. ప్రాణత్యాగం చేసిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలబడుతుందని, వారి పక్షాన ఉండి వారికి బాగోగులు చూస్తుందని చెప్పారు. లొంగిపోయిన మావోయిస్టులు తెలియజేసిన సమాచారం ప్రకారం, పాతిపెట్టిన మందుపాతరలు పేలకుండా వైర్లు తొలగించి బయటకు తీసే కార్యక్రమాన్ని భద్రతాదళ ఉమ్మడి బృందం చేపట్టింది.

కాంకేర్ జిల్లా ఛోటే బేతియా పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆద్నర్ గ్రామంలో మందుపాతర తొలగిస్తుండగా ఉదయం 11.30 గంటల సమయంలో ఈ దుర్ఘటన జరిగిందని బస్తర్ రేంజ్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ సుందర్రాజ్ పత్తిలింగం పిటిఐ వార్తాసంస్థకు చెప్పారు. బస్తర్ రేంజ్‌లో ఉన్న కాంకర్ జిల్లా సహా మొత్తం ఏడు జిల్లాలలో గడచిన కొద్దినెలలుగా లొంగిపోయిన మావోయిస్టుల నుండి గూఢచారి వర్గాల నుండి మందుపాతరలు, డంప్‌లకు సంబంధించిన రహస్య సమాచారాన్ని సేకరించారు. ఛోటేబేతియా ప్రాంతంలో మందుపాతరలు ఉన్నాయని, మావోయిస్టులు చెప్పిన సమాచారం మేరకు ఒక ఆయుధాల డంప్‌ను శనివారం భద్రతాదళ బృందం మొదట గుర్తించింది. మరో ఐ.ఇ.డి కూడా సమీపంలోనే నేల అడుగున పాతిపెట్టిన విషయాన్ని గుర్తించారు. వైర్లుతొలగించి పేలకుండా చేసే ప్రయత్న ప్రక్రియలో పేలుడు సంభవించింది. ఐతే బహుశా వైర్లు తొలగించే ప్రక్రియలో ప్రమాదవశాత్తు వైర్లు ఒకదానికొకటి తలడంవల్ల పేలుడు సంభవించి ఉండవచ్చునని ప్రాథమికంగా అంచనావేసినట్లు ఐజిపి సుందర్రాజ్ చెప్పారు. భదతాదళాలు ఈ ప్రాంతంలో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయని చెప్పారు.

మార్చి 31న దేశాన్ని సాయుధ మావోయిస్టుల నుంచి విముక్తి పొందినట్లు ప్రకటించిన తర్వాత, రాష్ట్రంలో నక్సలైట్ కార్యకలాపాలకు సంబంధించి జరిగిన మొదటి పేలుడు ఘటన ఇది.



## 'ఆరోగ్య భద్రత'

(మొదటి పేజీ తరువాయి)

చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఉద్యోగ సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నాయకులతో చర్చించారు. ప్రధానంగా నాలుగు అంశాలపై ఉద్యోగ సంఘాలకు సిఎం స్పష్టతనిచ్చారు. ప్రతీ రెండు నెలలకు ఒకసారి గుర్తింపు సంఘాలతో సమావేశమై,సమస్యలపైన రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికను సమర్పించాలని సిఎం రేవంత్ రెడ్డి సూచించారు. తమది స్నేహపూర్వక ప్రభుత్వమని, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే బాధ్యత తమదని భరోసానిచ్చారు. తమ రెండేళ్లలో ప్రజా ప్రభుత్వంలో 67,760 ఉద్యోగ నియామకాలు చేపట్టామన్నారు. ప్రభుత్వం ఏ పథకాన్ని ప్రకటించినప్పటికీ,వాటిని ఉద్యోగులు తమ భుజాన వేసుకుని పని చేశారాని, ఉద్యోగుల సహకారంతోనే ప్రభుత్వ సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేయగలుగుతున్నామని సిఎం అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగుల కోసమే మొదటి నిర్ణయం తీసుకున్నామని, ఉద్యోగులకు ప్రతీ నెలా మొదటి తేదీన వేతనాలు అందేలా చర్యలు తీసుకున్నామని సిఎం గుర్తు చేశారు. ఉద్యోగ సంఘాలు స్వేచ్ఛగా ఎన్నికలను నిర్వహించుకునే అవకాశాన్ని కల్పించామని సిఎం అన్నారు. ఉద్యోగుల బదిలీల విషయంలో గందరగోళం తలెత్తకుండా ఒక ప్రణాళిక ప్రకారమే బదిలీలు చేపట్టామన్నారు. పెండింగ్‌లో ఉన్న టీచర్ల బదిలీల విషయంలో కూడా ఎటువంటి వివాదం లేకుండా పూర్తిచేశామని గుర్తు చేశారు.

**బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే పేరుకుపోయిన వేలకోట్ల రూపాయల బిల్లులు : భట్టి విక్రమార్క**

దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను చాలావరకు పరిష్కరించామని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం నాటికి ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ బిల్లులు లేవని, కానీ పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వంలో వేల కోట్ల రూపాయల బిల్లులు పేరుకుపోయాయని వివరించారు. దీనిపై ఒక కసరత్తు చేసి సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు వెళ్తున్నామన్నారు. వంద రోజుల్లో దాదాపు రూ.6 వేల కోట్లను పెన్షనర్ బకాయిలు చెల్లించేందుకు ప్రయత్నిస్తున్నామని, తమ ప్రభుత్వానికి ఉద్యోగుల పట్ల ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనమని ఆయన చెప్పారు. ఉద్యోగుల హెల్త్ కార్డులపైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మానవీయ దృక్పథంతో ఆలోచించారన్నారు. ఉద్యుగుల సమస్యల పరిష్కారానికి సిఎం ఒక ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తున్నారని భట్టి వివరించారు.

**'నిరసన' ఉపసంహరణ..** ఈ నెల 5వ తేదీన నిర్వహించనున్న అన్ని రకాల నిరసన కార్యక్రమాలను ఉప సంహరించు కుంటున్నట్టు ఉద్యోగ సంఘాల జెఎసి చైర్మన్ మారం జగదీశ్, టిజిఇజెఎసి చైర్మన్ లచ్చిరెడ్డి ప్రకటించారు. ఉద్యోగ సంఘాల డిమాండ్లపై సిఎం రేవంత్ రెడ్డి స్పష్టత నివ్వడం పట్ల వారు సిఎంకు, ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. సిఎం రేవంత్ రెడ్డితో జరిగిన సమావేశంలో ఉద్యోగ సంఘాల నాయకులు మారం జగదీష్ ,వి.లచ్చి రెడ్డి, ఏలూరి శ్రీనివాసరావు, జి. శ్రీనివాస్ రెడ్డి, పి. దామోదర్ రెడ్డి, జి.సదానందంగౌడ్, వి. రవీందర్‌రెడ్డి, వి. రాజశేఖర్, కె. రామకృష్ణ, ఎస్.రాములు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య విధాన పరిషత్‌లో 13,100 మందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని ఉద్యోగ సంఘాల నాయకులు అన్నారు. పిఆర్‌సి,హెల్త్ కార్డుల సమస్యలతో పాటు ఇతర డిమాండ్లను కూడా పరిష్కరించాలని వారు ముఖ్యమంత్రిని విజ్ఞప్తి చేశారు. సిఎం నేతృత్వంలో గతంలో చాలా వరకు ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించిందన్నారు.

## 'నైరుతి' రాక

(మొదటి పేజీ తరువాయి)

కంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ఐఎండి తెలిపింది. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలు, పశ్చిమ భారతంలో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఈశాన్య రాష్ట్రాల్లో, తూర్పు మధ్య భారతంలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రం సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే సూచనలు ఉన్నాయని ఐఎండి చెప్పింది. అయితే ఈ సారి మే నెలలో పగటిపూట మాత్రమే కాకుండా రాత్రి సమయాల్లోనూ వేడి ఎక్కువగా ఉంటుందని తెలిపింది. దక్షిణ ద్వీపకల్పంలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రం కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణంగా లేదా అంతకంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండి వివరించింది. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాల్లో సముద్రపు తేమతో కూడిన వేడి గాలులవల్ల ఎక్కువ ఉక్కపోత ఉంటుందని తెలిపింది.

## 184 ప్రొఫైల్స్ తొలగింపు

(మొదటి పేజీ తరువాయి)

మోసం చేసే ప్రయత్నాలను అడ్డుకుంది. బోనస్‌లు, రెఫరల్ కమిషన్లు, భారీ లాభాల పేరుతో ఆకర్షించే ఈ ప్రకటనల్లో ఐపీఎల్ అంచనాలు, ప్రముఖుల డీప్‌ఫేక్ వీడియోలను ఉపయోగించి ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నట్లు గుర్తించారు. ఈ వ్యవహారంలో నిబంధనలు ఉల్లంఘించిన నిర్వాహకులపై ఏప్రిల్ నెలలో 6 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. నిరంతర సైబర్ పెట్రోలింగ్‌లో భాగంగా ఇప్పటివరకు మొత్తం 427 సోషల్ మీడియా ప్రొఫైల్స్, 1903 పెయిడ్ ప్రకటనలను గుర్తించి తొలగించినట్లు వెల్లడించారు. ఈ అక్రమ కార్యకలాపాల వెనుక ఉన్న వ్యక్తులు, ఆర్థిక లావాదేవీలపై దర్యాప్తు కొనసాగుతోంది. తెలంగాణలో ఆన్‌లైన్ బెట్టింగ్, జూదం నిషేధితమని సైబర్ క్రైమ్ పోలీసులు స్పష్టం చేశారు. అధిక లాభాల పేరుతో వచ్చే యాప్‌లు, లింకులను నమ్మొద్దని సూచించారు. సోషల్ మీడియాలో ఇటువంటి లింకులను షేర్ చేయడం కూడా నేరమని హెచ్చరించారు. ప్రముఖుల పేరుతో వచ్చే డీప్‌ఫేక్ వీడియోలను నమ్మవద్దని సూచించారు. అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు లేదా అధికారిక పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని, అవసరమైతే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. సురక్షితమైన సైబర్ వాతావరణం కోసం కట్టుబడి ఉన్నామని, అక్రమ ఆన్‌లైన్ కార్యకలాపాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని సైబర్ క్రైమ్ డిసిపి అరవింద్‌బాబు తెలిపారు.

## ఆంక్షలు తప్పవ్

(మొదటి పేజీ తరువాయి)

విజయవంతంగా తన అధీనంలోకి తెచ్చుకుని అంతర్జాతీయ నౌకా వాణిజ్యాన్ని స్తంభింపజేసింది. ఐతే కొన్ని నౌక లు మాత్రం ఇరాన్ కోరిన విధంగా సుంకాలు చెల్లించి సురక్షితంగా జలసంధిని దాటి వెళుతున్నాయి. ఈ విషయం ఇరాన్ స్వయంగా ప్రకటించినప్పటికీ ఏ దేశ నౌకలు సుంకాలు చెల్లించాయో మాత్రం స్పష్టం చేయలేదు. సుంకాలు వసూలుచేసే ఇరాన్ యత్నాలతో ఆ దేశ ఓడరేవులపై దిగ్బంధానాన్ని అమెరికా అమలులోకి తెచ్చింది. డబ్బురూపేణా, ఆస్తుల రూపేణా,ఇతర పద్ధతులలో సుంకాలు చెల్లించాలని ఇరాన్ కోరుతోంది. ఇందులో ఛారిటబుల్ డొనేషన్స్ పద్ధతి కూడా ఉందని ఓఎఫ్ఎసి పేర్కొంది. ఏప్రిల్ 13న హోర్ముజ్ జలసంధిలో ఇరాన్ ఓడరేవులపై బ్లాకేడ్ అమలు చేస్తున్నట్లు అమెరికా ప్రకటించడంతో అంతకుముందురోజే జలసంధిని తెరచిన ఇరాన్ ఇరవైనాలుగ్గంటల్లోనే నిర్ణయం మార్చుకుని మళ్ళీ జలసంధిని మూసివేసి నౌకా వాణిజ్యాన్ని స్తంభింపజేసింది. ఈ విధంగా జలసంధి మూసివేతకు అమెరికాయే ప్రధాన దోషిగా మారింది. బ్లాకేడ్ ప్రారంభమైనప్పటినుండీ గడచిన 19 రోజులుగా 45 నౌకలను జలసంధి దాటి వెళ్ళకుండా వెనక్కు వెళ్ళగొట్టినట్టు అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. యుద్ధం ముగించేందుకు మూడు దశల చర్చలతో మూడు అంశాల ప్రణాళికను ఏప్రిల్ 26న ఇరాన్ ప్రతిపాదించింది. దీనిని ట్రంప్ నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. అదేవిధంగా హోర్ముజ్ జలసంధిలో ఆంక్షలు ఎత్తివేయాలని చైనా కూడా ఇరాన్‌కు విజ్ఞప్తి చేసింది. ఐక్యరాజ్యసమితిలో చైనా రాయబారి ఫు కాంగ్ శనివారం మాట్లాడుతూ, కాల్పుల విరమణ ఒప్పందాన్ని అమలు చేయడం తక్షణ అంశమని చెప్పారు. అదేవిధంగా ఇరువర్గాలు మంచి విశ్వాసంతో చర్చల బల్ల వద్దకు వెళ్ళి సంప్రదింపులు జరపాలని కోరారు. ఈ విషయంతో సంబంధం ఉన్న అని పక్షాలకూ దాదాపు ప్రతిరోజూ చైనా విదేశీమంత్రి వాంగ్ యీ ఫోన్ ద్వారా సంభాషిస్తూ విజ్ఞప్తులు చేస్తూనే ఉన్నారు.

**ఇరాన్ ప్రతిపాదన తిరస్కరించాం**

ఇరాన్‌తో ఆమోదయోగ్యమైన ఒప్పందం చేసుకోవాలని అమెరికా కోరుకుంటోందని, వారు చేసిన మూడు అంశాల ప్రణాళికను తిరస్కరించామని ట్రంప్ చెప్పారు. ఇరాన్ అణ్వాయుధ సామర్థ్యాన్ని నాశనం చేసి ప్రపంచాన్ని కాపాడామని, ఇరాన్ మత ఛాంధస నాయకత్వాన్ని తొలగించి బలహీనపరిచామని అన్నారు. ఫ్లోరిడా రాష్ట్రంలో తన మద్దతుదారులను ఉద్దేశించి ట్రంప్ ప్రసంగిస్తూ, ఇరాన్‌లో యుద్ధాన్ని ప్రస్తావించారు. దాడులవల్ల వారి నాయకత్వం గందరగోళంలో పడిందని, నిర్ణయం తీసుకోలేకపోతున్నారని, అందుకే కాల్పుల విరమణ ద్వారా ఎక్కువ గడువు ఇచ్చామని చెప్పారు.

ఇరాన్‌పై బీ–2 బాంబర్లతో దాడులు చేసి ఆ దేశాన్ని అదుపులో పెట్టామని, లేకపోతే ఈపాటికి పశ్చిమాసియా, యూరప్ దేశాలు ఇరాన్ అణ్వాయుధ దాడుల వల్ల విచ్ఛిన్నమైపోయి ఉండేవని అన్నారు. ''మనం ఈ యుద్ధం చేయాల్సి వచ్చింది, యుద్ధాన్ని పూర్తి చేయాల్సి వచ్చింది, ఎంతో బాగా యుద్ధం ముగించాం, మనం గెలుస్తున్నాం'' అన్నారు. ఒక ఆమోదయోగ్యమైన ఒప్పందం చేసుకోవాలని తాను కోరుకుంటున్నానన్నారు. ఒప్పందం కుదిరాక పెట్రోలు ధరలు తగ్గుతాయన్నారు. హోర్ముజ్‌లో దిగ్బంధనాన్ని తొలగించాలని, యుద్ధం ముగించాలని డిమాండ్ చేస్తుండగా ఈ ప్రతిపాదనను ట్రంప్ నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. ఈ విషయమే ఆయన మాట్లాడుతూ, మనం తొందరపాటు చర్యగా ఏదో ఒక ఒప్పందాన్ని అంగీకరించి వైదొగడంలేదని, మూడేళ్ళలోనే మళ్ళీ సమస్య తలెత్తాలా చేయకూడదని భావిస్తున్నామని, అందుకే ఒక ఆమోదయోగ్యమైన, మేలైన ఒప్పందం కోసం ఎదురుచూస్తున్నామని చెప్పారు. ఒప్పందం కుదిరే వరకూ హోర్ముజ్ జలసంధిలో ఇరాన్ ఓడరేవులపై దిగ్బంధనం కొనసాగుతుందని ట్రంప్ పదే పదే చేస్తున్న ప్రకటనను ఉద్ఘాటించారు.

**గల్ఫ్ మిత్రదేశాలకు 8.60 బిలియన్ డాలర్ల ఆయుధాలు**

ఒకవైపు కాల్పుల విరమణ జరిగినప్పటికీ గల్ఫ్‌దేశాల్లో ఉన్న మిత్రదేశాలకు అమెరికా ఆయుధ ఎగుమతులకు ఆమోదం తెలియజేసింది. ఇజ్రాయెల్, ఖతార్, యుకువైట్, నైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాలకు 8.60 బిలియన్ డాలర్లు విలువైన సైనిక ఆయుధాలను ఎగుమతి చేసేందుకు అమెరికా విదేశీమంత్రిత్వశాఖ శనివారం ఆమోదముద్ర వేసింది. ఇరాన్‌లో యుద్ధం ప్రారంభమై తొమ్మిది వారాలు పూర్తికాగా, ఇరాన్–అమెరికా మధ్య కాల్పుల విరమణ ఒప్పందం ప్రారంభమై మూడు వారా లు గడిచింది.

ఈ నేపథ్యంలో గల్ఫ్ మిత్రదేశాలకు ఆయుధాల విక్రయానికి అమెరికా ఆమోదముద్ర వేసింది. ఈ ఒప్పందం కింద అత్యాధునిక ఆయుధాలను ఈ దేశాలకు అమెరికా సరఫరా చేస్తుంది. గల్ఫ్‌దేశాలపై ఇరాన్ తీవ్రమైన దాడులు చేయడంతో ఆ దేశాలు బాగా నష్టపోయాయి. ముఖ్యంగా ఖతార్,యుఎఇ, సౌదీఅరేబియా దేశాలు దెబ్బతిన్నాయి. ఖతార్‌కు 4.01 బిలియన్ డాలర్లు విలువైన పేట్రియాట్ క్షిపణులు,శత్రువులను దెబ్బతీయగల అడ్వాన్స్‌డ్ ఆయుధాలు సమకూరుస్తారు.కువైట్‌కు 2.5 బిలియన్ డాలర్లు విలువైన విధ్వంసక ఆయుధాలు, ఇజ్రాయెల్‌కు 992.4 మిలియన్ డాలర్లు విలువైన ఆయుధాలు ఈ ఒప్పందం కింద సరఫరా చేస్తారు.

# మళ్లీ చిత్తైన ముంబై..!




ఐపిఎల్ అభిమానులు ఆసక్తి కనబరిచే ఎల్ క్లాసికో పోరులో మళ్లీ చెన్నై సూపర్ కింగ్స్‌దే పైచేయి. వాంఖడేలో ముంబై ఇండియన్స్‌ను చిత్తుగా ఓడించిన చెన్నై.. ఈసారి సొంతగడ్డపై పంజా విసిరింది. అన్షుల్ కంబోజ్(3–32) బంతితో విజృంభిచగా.. రుతురాజ్ గైక్వాడ్(67 నాటౌట్) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. ఇంప్యాక్ట్ సబ్ కార్తిక్ శర్మ(54 నాటౌట్)తో అర్ధ శతక భాగస్వామ్యం నెలకొల్పి ముంబైని ముంచాడు. ఈ సీజన్‌లో నాలుగో విజయంతో సీఎస్కే ఖాతాలో ఎనిమిది పాయింట్లు చేరాయి. ఐపిఎల్19లో చెన్నై సూపర్ కింగ్స్ నాలుగో విజయంతో మురిసింది. చెపాక్ స్టేడియంలో ముంబై ఇండియన్స్‌ను 159కే కట్టడి చేసిన చెన్నై స్వల్ప లక్ష్యాన్ని ఊదిపడేసింది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్(67 నాటౌట్), ఇంప్యాక్ట్ సబ్ కార్తిక్ శర్మ(54 నాటౌట్)లు ముంబై బౌలింగ్ దళాన్ని సమర్థంగా ఎదుర్కొని గెలుపు పునాది వేశారు. బౌండరీకి తరలించగా 8 వికెట్ల తేడాతో గెలుపొందింది సీఎస్కే.మోస్తరు ఛేదనలో బుమ్రా తన మొదటి ఓవర్లోనే డేంజరస్ సంజూ శాంసన్(11)ను బౌట్ చేసి తొలి వికెట్ అందించాడు. అనంతరం కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ67 నాటౌట్) జతగా ఉర్విల్ పటేల్(26) చెలరేగాడు. 5వ ఓవర్లో 6, 4, 6తో 18 రన్స్ రాబట్టిన ఉర్విల్.. గజన్‌ఫర్ ఓవర్లో పెద్ద షాట్ ఆడబోగా బంతి ఎడ్జ్ తీసుకొని వికెట్లకు తాకింది. పవర్ ప్లేలో 2 వికెట్ల నష్టానికి 62 పరుగులు చేసిన చెన్నైని గెలిపించే బాధ్యత తీసుకున్నారు గైక్వాడ ఇంప్యాక్ట్ సబ్ కార్తిక్ శర్మ(54 నాటౌట్). పాండ్యా ఓవర్లో మిడ్ వికెట్ దిశగా కొట్టిన సిక్సర్‌తో చెన్నై స్కోర్ వంద దాటింది. ముంబై బౌలర్లకు ఏమాత్రం అవకాశమివ్వకుండా అర్ధ శతక భాగస్వామ్యంతో గెలుపు దిశగా నడిపారు. గజన్‌ఫర్ వేసిన ఓవర్లో కార్తిక్ 4, 6, 4తో 14 రన్స్ పిండుకున్నాడు. అదే ఊపులో బౌండరీతో చెన్నైకి ఎనిమిది వికెట్ల విజయాన్ని కట్టబెట్టాడు. తొమ్మిది మ్యాచుల్లో రెండింట మాత్రమే గెలిచిన ముంబై ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించే పరిస్థితి తెచ్చుకుంది. గత మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదారబాద్‌పై 243 పరుగులు చేసిన ముంబై ఇండియన్స్ చెపాక్‌లో తడబడింది. సొంత మైదానంలో సీఎస్కే పేసర్ అన్షుల్ కంబోజ్(3–32) విజృంభణకు ముంబై స్టార్లు తేలిపోగా.. నమన్ ధీర్(57) సాధికారిక ఇన్నింగ్స్ ఆడాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా ఓపెనర్ రికెల్టన్(37)తో.. ఆపై సూర్యకుమార్ యాదవ్(21)తో కీలక పరగుఉల జోడించి అర్ధ శతకంతో ముంబైని ఆదుకున్నాడు. ఆఖర్లో దంచేస్తాడనుకున్న కెప్టెన్ హార్దిక్ పాండ్యా(18) పెద్ద షాట్లు ఆడలేకపోయాడు. బోల్ట్ సిక్సర్‌తో ముంబై నిర్ణీత ఓవరల్లో 159 పరుగులే చేసింది.

## ప్రపంచకప్ స్క్వాడ్‌లో అనుష్క శర్మ.. హ్యాట్రిక్ పేసర్‌కు పిలుపు



వన్డే ప్రపంచకప్ ఛాంపియన్‌గా అవతరించిన భారత మహిళల జట్టు మరో ఐసిసి ట్రోఫీ లక్ష్యంగా కదులుతోంది. ఇంగ్లాండ్ వేదికగా జూన్ 12 నుంచి మొదలయ్యే పొట్టి ప్రపంచకప్ కోసం సెలెక్టర్లు స్క్వాడ్‌ను ప్రకటించారు. టీమిండియాకు తొలి ప్రపంచకప్ అందించిన హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలో 15 మందితో కూడిన బృందాన్ని ఎంపిక చేశారు. డబ్ల్యూపీఎల్‌లో అద్భుతంగా రాణించిన అనుష్క శర్మ, హ్యాట్రిక్ పేసర్ నందిని శర్మ.. గాయంతో ఆస్ట్రేలియా పర్యటనకు దూరమైన యస్తికా భాటియాలకు స్క్వాడ్‌లో చోటు దక్కింది. టీ20 ప్రపంచకప్ లక్ష్యంగా పెట్టుకున్న భారత జట్టు ఆతిథ్య ఇంగ్లండ్‌తో రెండు ఫార్మాట్ల సిరీస్ ఆడనుంది. దాంతో, పొట్టి సిరీస్‌తో పాటు ప్రపంచకప్ కోసం శనివారం సెలెక్టర్లు స్క్వాడ్‌ను ప్రకటించారు. బిసిసిఐ సెక్రటరీ దేవజిత్ సైకియాతో సమావేశమైన సెలెక్షన్ కమిటీ చైర్మన్ అమితా శర్మ, కోచ్ అన్మోల్ మజుందార్, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌లు స్క్వాడ్ కసరత్తును పూర్తి చేశారు. వన్డే వరల్డ్‌కప్ ఆడిన బృందంలోని 12 మందితో పాటు డబ్ల్యుపిఎల్ స్టార్లను తీసుకున్నారు. ఆల్‌రౌండర్లుగా శ్రేయాంక పాటిల్, రాధా యాదవ్, దీప్తి శర్మలు ఎంపికవ్వగా.. ఆశ్చర్యంగా అమన్‌జోత్ కౌర్, మిస్టరీ స్పిన్నర్ వైష్ణవీ శర్మలకు చోటు దక్కలేదు. ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లిన భారతి ఫుల్‌మాలి, మోకాలి గాయంతో బాధ పడుతున్న కష్వీ గౌతమ్, మోకాలి గాయం నుంచి కోలుకున్న ఓపెనర్ ప్రతీకా రావల్‌ను పక్కన పెట్టేశారు. అయితే.. ఏకైక టెస్టు స్క్వాడ్‌లో సీనియర్లు హర్లీన్ డియోల్, స్నేహ్ రాణాతో పాటు ప్రతీకను ఎంపిక చేశారు.

**భారత స్క్వాడ్ :** హర్మన్‌ప్రీత్ కౌర్(కెప్టెన్), స్మృతి మంధాన, షఫాలీ వర్మ, రీచా ఘోష్(వికెట్ కీపర్), యస్తికా భాటియా(వికెట్ కీపర్), రాధా యాదవ్, జెమీమా రోడ్రిగ్స్, శ్రేయాంక పాటిల్, శ్రీ చరణి, అరుంధతి రెడ్డి, అనుష్క శర్మ, దీప్తి శర్మ, నందిని శర్మ, క్రాంతి గౌడ రేణుకా సింగ్.

**లార్డ్స్ టెస్టుకు భారత స్క్వాడ్ :** హర్మన్‌ప్రీత్ కౌర్(కెప్టెన్), స్మృతి మంధాన, షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, ప్రతీకా రావల్, శ్రీ చరణి, యస్తికా భాటియా, నందిని శర్మ, హర్లీన్ డియోల్, రేణుకా సింగ్, క్రాంతి గౌడ సయాలీ సత్ఘరే, స్నేహ్ రాణా.

# బిజినెస్

## టర్మ్ ఇన్సూరెన్స్‌లో... బీమా కంపెనీ ముఖ్యమే...

కరోనా తర్వాత చాలా మందికి బీమాపై అవగాహన పెరిగింది. దాని ప్రాధాన్యాన్ని గుర్తించినవారు ఆర్థిక ప్రణాళికలో తప్పనిసరిగా భాగం చేసుకుంటున్నారు. దీంతో మార్కెట్లో బీమా పథకాలకు మంచి డిమాండ్ ఉంది. అందులోనూ టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీలు తీసుకునేవారి సంఖ్య మరింత ఎక్కువైంది. అందుకే, టర్మ్ పాలసీని ఎంచుకునే ముందు తమ అవసరాలకు సరిపోయే విధంగా ఉండే పాలసీని ఎంచుకోవడంతో పాటు సరైన బీమా కంపెనీని సెలెక్ట్ చేసుకోవడం కూడా చాలా ముఖ్యమంటున్నారు నిపుణులు. మరి, కొత్తగా టర్మ్ పాలసీ తీసుకునే ముందు మంచి కంపెనీని ఎలా ఎంపిక చేసుకోవాలి? ఏ ఏ విషయాలను పరిగణనలోకి తీసుకోవాలో తెలుసుకుందాం.



**చెల్లింపులు :** పాలసీదారుడికి ఏదైనా అనుకోని ప్రమాదం జరిగినప్పుడు ఆ కుటుంబానికి డబ్బు వచ్చేది కంపెనీ చెప్పిన మాటలతో కాదు. క్లెయిమ్ సకాలంలో సెటిల్ చేసినప్పుడే అనే విషయం గుర్తుంచుకోవాలి. ఐఆర్‌డిఎఐ వెబ్‌సైట్‌లో ప్రతీ సంవత్సరం క్లెయిమ్ చెల్లింపుల నిష్పత్తిని ప్రచురిస్తారు. ఇందులో 98 శాతం పైన క్లెయిమ్ చెల్లింపుల నిష్పత్తి ఉన్న కంపెనీలనే సెలెక్ట్ చేసుకోవాలి. అప్పుడు మీ ఫ్యామిలీ సురక్షితంగా ఉంటుందని సూచిస్తున్నారు నిపుణులు.

### కంపెనీ ఆర్థిక బలం

మీరు కొత్త టర్మ్ పాలసీ తీసుకునేటప్పుడు కంపెనీ ఆర్థిక బలాన్ని అంచనా వేయాలి. ఎందుకంటే బీమా అనేది ఒక దీర్ఘకాలిక ఒప్పందంలాంటిది. ఈ వ్యవధిలో ఇన్సూరెన్స్ కంపెనీ దివాలా తీయకుండా ఉంటేనే మనకు భరోసా. అందుకే, పాలసీ తీసుకునేటప్పుడు తప్పనిసరిగా కంపెనీ స్వాల్వెన్సీ నిష్పత్తిని చెక్ చేయాలి. ఈ నిష్పత్తి కనీసం 1.5 కంటే ఎక్కువగా ఉండే దాన్ని ఎంచుకోవాలి. అలాంటి సంస్థలే బలంగా నిలదొక్కుకోగలుగుతాయని గమనించాలి.

### ప్రీమియం తక్కువగా ఉంటే

కొన్ని ఇన్సూరెన్స్ కంపెనీలు ఒకే వయసు, ఒకే పాలసీ విలువకు తక్కువ ప్రీమియం కట్టించుకోవచ్చు. ప్రీమియం చౌకగా ఉన్నంత మాత్రాన పాలసీ తీసుకోవడానికి అదే ప్రామాణికం కాదని గుర్తుంచుకోవాలి. ఇలా తక్కువ ప్రీమియం ఉండే పాలసీలు క్లెయిం చెల్లింపుల్లో ఇబ్బంది పెట్టే అవకాశాలు లేకపోలేదంటున్నారు నిపుణులు. అందుకే, టర్మ్ పాలసీ విషయంలో ప్రీమియం గురించి కాకుండా, వాస్తవంగా ఆ పాలసీ అందించే బెనిఫిట్స్ తెలుసుకుని తీసుకోవడం మంచిదంటున్నారు.

### ఫిర్యాదులు ఎక్కువగా ఉంటే?

టర్మ్ పాలసీ తీసుకోవడానికి ముందుగా మీరు తీసుకోవాలనుకుంటున్న కంపెనీ గురించి ఐఆర్‌డిఎఐ వెబ్‌సైటులో కొన్ని అంశాలు చెక్ చేయాలి. అందులో ముఖ్యంగా ఆ బీమా సంస్థపై ఉన్న ఫిర్యాదులను (కంప్లెయింట్స్) ఒకసారి పరిశీలించాలి. 10 వేల పాలసీలకు ఐదు కంటే తక్కువ ఫిర్యాదులు వస్తే ఆ కంపెనీని సాధారణంగా మంచి సంస్థ కింద పరిగణిస్తుంటారు. అంతకు మించితే ఒకటికి రెండుసార్లు ఆలోచించి పాలసీ తీసుకోవడం బెటర్ అంటున్నారు నిపుణులు. ఏదైనా బీమా సంస్థ ప్రాథమిక పాలసీతోపాటు కొన్ని అనుబంధాలనూ అందిస్తుంటే ఆ పాలసీని పరిశీలించొచ్చంటున్నారు నిపుణులు. ఆ పాలసీలో ముఖ్యంగా ప్రమాదవశాత్తూ మరణం, తీవ్రవ్యాధులకు రక్షణ కల్పించేలా రైడర్లు ఉండేలా చూసుకోవాలి. అదెవిధంగా, పాలసీని దశల వారీగా పెంచుకునే వీలు కల్పిస్తుందా? అనే అంశాలనూ పరిశీలించి తీసుకోవాలి.

### ఎలాంటి సేవలు అందిస్తున్నాయి?

ప్రస్తుతం చాలా వరకు అన్ని బీమా సంస్థలూ డిజిటల్ విధానంలోనే పాలసీదారులకు సేవలను అందిస్తున్నాయి. టర్మ్ పాలసీ కొనుగోలు నుంచి క్లెయిం వరకూ అన్నీ సులభంగా ఉండాలి. అంతేకానీ, అనవసరమైన పత్రాలను అడుగుతూ కాలయాపన చేసే కంపెనీలకు దూరంగా ఉండటమే మంచిదంటున్నారు. అన్నింటికంటే ముఖ్యంగా మీరు కుటుంబానికి ఆర్థిక రక్షణ కల్పించేలా టర్మ్ పాలసీ తీసుకుంటున్నప్పుడు, అది కష్టకాలంలో ఆదుకునేలా ఉండాలి. కాబట్టి, టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీని తీసుకునేటప్పుడే జాగ్రత్తగా ఉండి అన్ని విషయాలను అర్థం చేసుకుని మంచి సంస్థను ఎంపిక చేసుకోవడం చాలా అవసరమని సూచిస్తున్నారు నిపుణులు.

## దేశీయ వాహన విక్రయాలు భళా

**న్యూఢిల్లీ :** గత నెల ఏప్రిల్‌లో వాహన విక్రయాలు పెద్ద ఎత్తున జరిగాయి. ప్యాసింజర్ వెహికిల్స్ సేల్స్ 4.5 లక్షలుగా ఉన్నట్టు అంచనా. మారుతీ సుజుకీ, హ్యుందాయ్, కియా తదితర కంపెనీల కార్లకు భారీగా డిమాండ్ కనిపించింది. మారుతీ దేశీయ విక్రయాలు మునుపెన్నడూ లేనివిధంగా 1,91,122 యూనిట్లుగా ఉన్నాయి. దీంతో నిరుడు డిసెంబర్‌లో నమోదైన 1,82,165 యూనిట్ల రికార్డు కనుమరుగైంది. ఆల్టో, ఎస్‌ప్రెస్సో, సెలెరియో, వాగనార్ మాడళ్లకు ఆదరణ దక్కింది. ద్విచక్ర వాహన విభాగంలో హీరో, హోండా, సుజుకీ తదితర వాహనాల సేల్స్ బాగా పెరిగాయి.



# అధికారులు అంకిత భావంతో పనిచేయాలి

- మునుగోడు నియోజకవర్గంలో ఫార్మా కంపెనీలకు అనుమతులు ఇవ్వొద్దు
- గ్రామాలలో నీటి ఎద్దడి లేకుండా ముందస్తు జాగ్రతలు తీసుకోవాలి
- చండూరులో జరిగిన 99 రోజుల ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక నియోజవర్గ స్థాయి సమావేశంలో ఎమ్మెల్సీ నెల్లికంటి



**ప్రజాపక్షం/చండూరు :** వేసవి కాలంను దృష్టిలో పెట్టుకొని మునుగోడు నియోజవర్గంలోని ఏ ఒక్క గ్రామంలో నీటి ఎద్దడి లేకుండా ముందస్తూ జాగ్రతలు తీసుకొని ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ప్రజా ప్రతినిధులకు, అధికారులకు సూచించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మునుగోడు నియోజకవర్గ స్థాయి సమావేశం శనివారం చండూరులో జరిగింది. ఈ సమావేశానికి మునుగోడు నియోజకవర్గం ప్రత్యేక అధికారి, చండూరు ఆర్‌డిఒ వందనపు శ్రీదేవి అధ్యతన నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి మునుగోడు నియోజవర్గంలోని ఏడు మండలాలకు సంబందించిన అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరైయ్యారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం హాజరై మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచణ ప్రజా సమస్యల పరిష్కారానికి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. గ్రామ చంచాయతీలో గ్రామ సర్పంచ్ పంచాయతీ కార్యదర్శులు, మున్సిపాలిటీలలో కమిషనర్, చైర్మన్ కౌన్సిలర్లు ప్రజా సమస్యల పట్ల అంకిత భావంతో పనిచేయాలని అన్నారు. ప్రతి పేద కుటుంబానికి రేషన్ కార్డు , ఇల్లు లేని పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకునే విధంగా చూడాలని పేర్కొన్నారు. రెండున్నర సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు కావలసిన రేషన్ కార్డులు, సన్న బియ్యం, రైతు బరోసా, మహాలక్ష్మీ పథకాలతో ప్రజా పాలన అందింస్తుందని అన్నారు. మునుగోడు నియోజకవర్గం ఫ్లోరైడ్ పీడిత ప్రాంతం కాబట్టి ప్రజలకు ప్రతిరోజు మిషన్ భగీరథతో తాగునీరును అందించాలని అధికారును ఆదేశించారు. వేసవి కాలంను దృష్టిలో పెట్టుకొని ప్రజలకు త్రాగునీటి కొరత లేకుండా చూడాలన్నారు. విద్యుత్ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలని, రైతులకు కావలసిన నూతన ట్రాన్స్‌ఫార్మర్లు , లూజ్ లైన్‌లు ఎప్పడికప్పుడు పరిష్కరించాలని విద్యుత్ అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలును వేగవంతం చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. బెల్ట్ షాపులను పూర్తి స్థాయిలో అరికట్టాలని సంబంధిత అధికారులను కోరారు. మునుగోడు నియోజకవర్గంలోని గట్టుప్పల , వెల్మకన్నె లో ఫార్మా కంపెనీల ఏర్పాటుకు ఎట్టి సరిస్థితుల్లో అనుమతులు ఇవ్వొద్దని అధికారులకు సూచించారు. మునుగోడు నియోజకవర్గం అభివృద్ధికి ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్‌రెడ్డి , ఎమ్మెల్సీగా నేను మునుగోడును ఒక ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుటకు అధికారులు, ప్రజా ప్రతినిధులు అంకితభావంతో పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చండూరు ఆర్‌డిఒ వందనపు శ్రీదేవి, చండూరు జిల్లా పంచాయితీ అధికారి క.మురళి , ఎంపిడిఒ బండారు యాదగిరి, తహసీల్దార్ రమాకాంత్ శర్మ, చండూరు మున్సిపాలిటీ చైర్మన్ మల్లేశం , నియోజకవర్గంలోని అధికారులు , ప్రజా ప్రతినిధులు , తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యం

**పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ వస్తువుల ధరలు వెంటనే తగ్గించాలి : కర్రె భిక్షపతి**

**ప్రజాపక్షం/హసన్ పర్తి :** దేశంలో పేదరికం నిర్మూలించి సమానత్వాన్ని సమ సమాజాన్ని నిర్మించడానికి ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించుకోవలసిన ఆవశ్యకత ఆసన్నమైనదని హనుమకొండ జిల్లా సిపిఐ కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. శనివారం రోజున హసన్ పర్తి మండలం ఎల్లాపూర్ గ్రామంలో ముఖ్య కార్యకర్తల సమావేశం మండల కార్యదర్శి మెట్టు శ్యామ్ సుందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశమునకు ముఖ్యఅతిథిగా హాజరై బిక్షపతి మాట్లాడుతూ ప్రభుత్వ రంగంలోనే రిజర్వేషన్లు అమలు చేయడానికి అవకాశం ఉంటుందని సామాజిక న్యాయం జరుగుతుందని ప్రభుత్వ రంగాలను ప్రైవేటీకరించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఎన్నికల నిర్వహణలో ఈవీఎంల తొలగించాలని దామాషా ఎన్నికల పద్ధతి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సిలిండర్ ధరలు నిత్యవసర వస్తువుల ధరలు పెంచడం మూలంగా పేద ప్రజలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోలేక ఇబ్బందులు పడుతున్నారని వెంటనే ధరలు అదుపు చేయాలని డిమాండ్ చేశారు. ఐకెపి కేంద్రాలలో కల్లాలల్లో వడ్లు, మక్కలు పేరుకుపోయి ఉన్నాయని, అకాల వర్షం రాకముందే కొనుగోలు పూర్తి చేయాలని పేర్కొన్నారు. హనుమకొండ జిల్లాలో పెండ్యాల, రాంపూర్, హనుమకొండ, పరకాల, వంగపాడు ప్రాంతాలలో గుడిసెలు వేసుకున్న వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయించి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలన్నారు. ముచ్చర్ల గ్రామంలో అసైన్డ్ భూములను భూ అక్రమదారుల నుంచి రక్షించి నిరుపేదలకు పంచాలని లేనియెడల సిపిఐ భూ పోరాటం చేస్తుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, బికెఎంయు జాతీయ నాయకులు మోతె లింగారెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నేదునూరి రాజమౌళి, రేణిగుంట్ల రాజయ్య, ముజీగ అజయ్,వడ్లూరి సుధాకర్, భద్రయ్య రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.




## షరతులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

**తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాధం**



**ప్రజాపక్షం/పాల్వంచ :** ఆరుగాలం కష్టించి పలు ఇబ్బందులను ఎదుర్కొని పండించిన పంటను షరతులు లేకుండా కొనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాధం అన్నారు. సిపిఐ కార్యాలయం చంద్ర రాజేశ్వర రావు భవన్‌లో ఆసంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా విశ్వనాధం మాట్లాడుతూ ప్రభుత్వ నిభంధన మేరకు కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చిన ధాన్యాన్ని గోనె సంచులు లేవని, ప్యాడీ లేదంటూ, మరి కొందరు రైతులు యాప్‌లో రిజిష్ట్రేషన్ చేసుకోలేదంటూ పలు కారణాలు చూపెడుతూ ధాన్యం కొనుగోలు చేయటంలో అధికారుల నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. దీనితో వందలాది బస్తాల ధాన్యం కొనుగోలు కేంద్రాలలో మూలుగుతోందని వాపోయారు. వర్షాలు కురుస్తాయంటూ వాతావరణశాఖ హెచ్చరికలతో ఆరుగాలం కష్టించి పండించిన పంట వర్షానికి తడిసిపోతుందని రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు నిభంధనల మేరకు తీసుకొచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా తాలు ఉందని, తేమ శాతం ఎక్కువగా ఉందని, రంగు మారిందంటూ పలు కొర్రీలు సృష్టిస్తూ రైతాంగాన్ని ఆగమాగం చేయటం తగదని అధికారులకు హితవు పలికారు. వివరాలను యాప్‌లో నమోదు చేసుకొనే నిభంధనపై రైతులకు సరైన అవగాహన లేదని దీనితో పలువురు రైతులు యాప్‌లో తమ వివరాలను నమోదు చేసుకోలేదని తెలిపారు. వీరంతా తమ పంటను విక్రయించేందుకు దళారులను ఆశ్రయిస్తున్నారని దీనిని అవకాశంగా తీసుకొన్న పలువురు వ్యాపారులు అడ్డగోలుగా కొనుగోలు చేస్తూ రైతులను నిలువునా ముంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతాంగం క్వింటాకు 600 నష్టపోతున్నారని ఈ లెక్కన ఒక్కో రైతు సుమారు 20 నుండి 50 వేయిల పై వరకు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సంక్షేమమే ధ్యేయమని చెప్పుకొనే కాంగ్రెస్ ప్రభుత్వం పంటలను సకాలంలో కొనుగోలు చేయటంలో ఘోరంగా విఫలం అవుతోందని ఆరోపించారు. రైతాంగానికి జరుగుతున్న నష్టాన్ని అరికట్టేందుకు యాప్‌తో సంభంధం లేకుండా ఎలాంటి షరతులు లేకుండా పూర్తి పంటలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అన్నారపు వెంకటేశ్వరు తదితరులు పాల్గొన్నారు.

## మోదీ పాలనలో పేదలపై భారాలు

**సిపిఐ మహబూబ్ నగర్ జిల్లా కార్యదర్శి బి. బాలకిషన్**



**ప్రజాపక్షం/మహబూబ్ నగర్ :** కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం పేదలపై అధిక ధరల భారాలు, మతోన్మాద ఘోరాలు, సంపన్న వర్గాల ఆర్థిక నేరాలు పెరిగాయి. తప్ప సామాన్య ప్రజలకు పాలన సంక్షేమ ఫలితాల్లో జరిగిందేమీ లేదని సిపిఐ మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్ ధ్వజమెత్తారు. 141వ మేడే వారోత్సవాలలో భాగంగా శనివారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయం ఎదుట ఎఐటియుసి జెండాను బి. బాలకిషన్ ఆవిష్కరించారు. అనంతరం ఎఐటియుసి జిల్లా కార్యదర్శి పి. సురేష్ అధ్యక్షతన మేడే సభ జరిగింది. ఈ సందర్భంగా బి.బాలకిషన్ మాట్లాడుతూ యుద్ధం పేరుతో మోదీ సర్కార్ తాజాగా గ్యాస్ సిలిండర్ ధరలు, పెట్రోల్ , డీజిల్ ధరలు అతి భారీగా పెంచి పేద, మధ్యతరగతి సామాన్య ప్రజల నడ్డి విరిచేందుకు ప్రయత్నించడం అత్యంత దుర్మార్గమన్నారు. ప్రజల, కార్మికుల వార్షిక సగటు ఆదాయం పెంచకుండా నాలుగు లేబర్ కోడుల పేరుతో కార్పొరేట్ మాఫియాకు సంపద కేంద్రీకృతం చేసేందుకు చట్టం తీసుకు వచ్చిందన్నారు. మేడే ఉద్యమ స్ఫూర్తితో కార్మిక వర్గం రాజీలేని పోరాటాలకు సిద్ధం కావాలని బలమైన కార్మిక వర్గ పోరాటాల ద్వారానే దోపి డీ సమాజానికి సమాధి కట్టడం సాధ్యమవుతుందన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్ధానాలను తక్షణమే అమలు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, పని భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి పి. సురేష్, ఎఐటియుసి జిల్లా నాయకులు రంగయ్య, అంజి, యుగంధర్ రెడ్డి, లోకేష్, ఆర్టీసీ కార్గో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు రాములు, రవి, రామస్వామి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## స్వీపర్ స్వరూపను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

**ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్**

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్ :** ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న స్వీపర్ స్వరూపను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, లేనిపక్షంలో ధర్నాను ఉధృతం చేస్తామని థర్డ్ పార్టీ కాంట్రాక్ట్ ఉద్యోగులైన, శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బంది కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ డిమాండ్ చేశారు. శనివారం మెడికల్ కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఎఐటియుసి ) ఆధ్వర్యంలో ధర్నాను ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు టి.దివాకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా చాలిచాలని వేతనాలు తీసుకుంటు పేద, బడుగు, బలహీన వర్గాలకు సేవ చేస్తున్నారని, కానీ వారిని శ్రమ దోపిడికి గురి చేస్తున్నారని, అలాగే చట్ట ప్రకారం ఇవ్వాల్సిన పండగ, జాతీయ, ఆర్జిత సెలవులు అమలు చేయడంలేదని అన్నారు. సికెఎం ఆసుపత్రిలో పనిచేస్తున్న స్వీపర్ స్వరూపను విధుల్లోకి తీసుకోవాలని తప్పుడు ప్రచారంతో హాస్పిటల్ అధికారులు చిన్న ఉద్యోగులపైన కాంట్రాక్ట్ కార్మికులపైన ఆదిపత్యం చెలాయించాలని వారిని భయబ్రాంతులకు గురి చేస్తూ విధుల నుండి పక్కకు పెట్టడం జరిగిందన్నరు. నెల 15 రోజులు నుంచి అధికారుల దృష్టికి తీసుకుపోయి మాట్లాడిన ఎలాంటి స్పందన లేకపోవడంతో ధర్నా చేయడం జరిగిందని, దాంతో అధికారులు వచ్చి మాట్లాడుతామని స్వరూపను విధుల్లోకి తీసుకుంటామని కాలయాపన చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్వరూపను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ధర్నాను ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి సభ్యులు నాగవల్లి శంకర్, సక్కుబాయి, శోభ, జిల్లా నాయకులు సులోచన, సిహెచ్ స్వరూప, మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సంధ్య, రాష్ట్ర సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## 12.38 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

రైతుల ఖాతాల్లో రూ.11.29 కోట్ల జమ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ మరింత వేగం పుంజుకుంది. రాష్ట్రవ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాల ద్వారా పౌర సరఫరాల శాఖ ఇప్పటివరకు 12.38 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. ఇందులో 5.07 లక్షల మెట్రిక్ టన్నుల సన్న రకం, 7.31 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు రకం ధాన్యం కొనుగోలు చేశారు. ఇందుకు సంబంధించి 1.54 లక్షల మందికి పైగా రైతుల బ్యాంకు ఖాతాల్లో కనీస మద్దతు ధర కింద రూ.11.29 కోట్లను జమ చేసింది. కొనుగోలు ప్రక్రియను సివిల్ సప్లైస్ కమిషనర్ ఎం. స్టీఫెన్ రవీంద్ర ఎప్పటికప్పుడు ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. నిజామాబాద్, నల్గొండ, కామారెడ్డి, సూర్యాపేట, కరీంనగర్, జగిత్యాల, మెదక్, యాదాద్రి భువనగిరి, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాల్లో కొనుగోలు ప్రక్రియ పెద్ద ఎత్తున కొనసాగుతోందని అధికారులు వెల్లడించారు.

## హరీశ్‌రావు ఆరోపణలు నిరాధారం

మంత్రి సీతక్క ధ్వజం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ఎఎం) రహదారుల నిర్మాణంపై బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు చేసిన విమర్శలను పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో గ్రామీణ రహదారుల అభివృద్ధిని చూసి ఓర్వలేకే హరీశ్ రావు ఇలాంటి అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆమె శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో అన్నారు. టెండర్ల ప్రక్రియ ఇంకా పూర్తికాక ముందే అవినీతి జరిగిందనడం విడ్డూరమని, రాజకీయ లబ్ధి కోసం ప్రజలను తప్పుదోవ పట్టించవద్దని మంత్రి అన్నారు. కేంద్ర సంస్థ ఎన్‌హెచ్ఎఐ 2016 నుండి దేశవ్యాప్తంగా ఈ విధానాన్ని విజయవంతంగా అమలు చేస్తోందని, ఇప్పటికే 11 రాష్ట్రాల్లో ఈ మోడల్ ద్వారా వేల కోట్ల ప్రాజెక్టులు నడుస్తున్నాయని తెలిపారు. రెండో దశలో రూ.6,250 కోట్ల వ్యయంతో 7,450 కిలోమీటర్ల పొడవులో 2,162 రహదారులను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఈ విధానంలో కాంట్రాక్టర్లు 30 నెలల్లో పని పూర్తి చేసి, తదుపరి 15 ఏళ్ల పాటు రహదారుల నిర్వహణ చూసుకోవాల్సి ఉంటుందన్నారు. దీనివల్ల ప్రభుత్వానికి భారం తగ్గడమే కాకుండా నాణ్యమైన రోడ్లు అందుబాటులోకి వస్తాయన్నారు. రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని, పారదర్శకతతోనే అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తామని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

## కులగణన ప్రకటించాకే మోదీ తెలంగాణలో అడుగు పెట్టాలి

లేనిపక్షంలో 10న నల్లజెండాలు ర్యాలీలు, నిరసనలు



**ప్రజాపక్షం/హిమాయత్‌నగర్ :** కులగణన చేస్తామని ప్రకటించాకే ప్రధాని మోదీ తెలంగాణలో అడుగు పెట్టాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో 10న ప్రదాని మోదీ రాక సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నల్లజెండాలతో ర్యాలీలు చేపడుతామని హెచ్చరించారు. శనివారం హైదరాబాదు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జాతి జనగణలో బిసి కులగణన చేపట్టాలని డిమాండ్‌తో బీసీ సంఘాలు, అఖిలపక్ష రాజకీయ పార్టీల రౌండ్ టేబుల్ సమావేశం బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో బిసి సంక్షేమ శాఖ గౌరవ సలహాదారులు వి.హనుమంతరావు( కాంగ్రెస్), శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ (బిఆర్ఎస్) ఎంఎల్‌సి ప్రొఫెసర్ కోదండరాం (టిజెఎస్), సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ హాజరయ్యారు. జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ గాని, బీసీ రిజర్వేషన్లు పెంపు, బీసీ కులగనన, మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోట, పార్లమెంటులో బీసీ బిల్లు తదితర డిమాండ్లు నెరవేర్చకుండా బిజెపి తీవ్ర అన్యాయం చేస్తుందని మండిపడ్డారు. వి.హనుమంతరావు మాట్లాడుతూ బీసీలను నమ్మించి దగా చేస్తున్న బిజెపి వైఖరి నిరసిస్తూ ఈనెల 9 నుండి ఆమరణ నిరాహార దీక్ష చేపడతానని తెలిపారు. ప్రాణం పోయినా సరే జనగణనలో కుల గణన చేర్చాలని డిమాండ్ చేశారు. మధుసూదనా చారి, శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బిసి కులాల లెక్కలు తీసి బిసిలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచే వరకు బిజెపి ప్రభుత్వంపై పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని వారు తెలిపారు. కోదండరామ్ మాట్లాడుతూ సకల జనుల స్పూర్తితో కేంద్రంపై బీసీలు తిరగబడాలని పిలుపునిచ్చారు. సిపిఎం కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ ప్రధాని పర్యటన సందర్భంగా 10 న రాష్ట్రవ్యాప్తంగా చేపట్టే నిరసన ఆందోళన కార్యక్రమాలకు మద్దతు ఇస్తున్నట్టు తెలిపారు. బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కాంగ్రెస్ నేత ఇందిరా శోభన్, బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, ప్రొఫెసర్ సంఘని మల్లేశ్వర్, నేతలు తాటికొండ విక్రమ్ గౌడ్, మణి మంజరి, దీటి మల్లయ్య, ఉప్పరి శేఖర్ సగర, గొడుగు మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## భారతదేశం వ్యూహాత్మక బఫర్లను సృష్టించుకోవాలి

ప్రధాన ఆర్థిక సలహాదారు వి.అనంత నాగేశ్వరన్ ఉద్బోధ

**న్యూఢిల్లీ :** దేశం ఎదుర్కొంటున్న అత్యంత క్లిష్టమైన ఇంధన సంక్షోభం, పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో భారతదేశం వ్యూహాత్మక బఫర్లను సృష్టించుకోవాల్సిన అవసరం ఉందని ప్రధాన ఆర్థిక సలహాదారు వి.అనంత నాగేశ్వరన్ అన్నారు. సంక్షోభం కారణంగా ప్రపంచ వ్యాప్తంగా ఎరువులు, పెట్రోల్ ఉత్పత్తుల ధరలు పెరగడం, సాధారణం కంటే తక్కువ వర్షాపాతం, పెరిగిన ఇంధన ధరల ప్రభావం వల్ల ఏర్పడే 'సంభావ్య ద్రవ్యోల్బణం' వంటివి ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 4.3శాతం ద్రవ్యలోటు లక్ష్యాన్ని సాధించడాన్ని సవాల్‌గా మారుస్తాయని నాగేశ్వరన్ తెలిపారు. ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ) కారణంగా భారతదేశం ఉపాధి సవాల్‌ను ఎదుర్కొంటోందని ఆవేదన ఆయన వ్యక్తం చేశారు. ఐటి రంగం మరింత అభివృద్ధి చెందేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఏఐ వల్ల ఉద్యోగాలు కోల్పోకుండా చూడాలన్నారు. దానికి బదులుగా ఐటి రంగంలో లేదా ఇతర సేవలలో ఏఐని ఉపయోగించే ఉద్యోగాలను సృష్టించాలని ఆకాంక్షించారు. శనివారం అశోకా యూనివర్సిటీ నిర్వహించిన ఐసిపిపి గ్రోత్ కాన్ఫరెన్స్‌లో అనంత నాగేశ్వరన్ మాట్లాడుతూ కరెంట్ అకౌంట్ లోటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం–2026లో జిడిపిలో 1శాతం కంటే తక్కువగా ఉండగా, అది 2శాతానికి పైగాపెరగవచ్చని తెలిపారు. 'దిగుమతులపై ఆధారపడటం, లోహాలు, రాగి విషయంలో మనం బలహీనంగా ఉన్న రంగాల గురిం చి ఆలోచించడానికి కూడా ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలి. తయారీ రంగాన్ని, దాని అనివార్యతను కాపాడుకోవాలంటే మనం వ్యూహాత్మక నిల్వలను నిర్మించుకోవాలి' అని నాగేశ్వరన్ సూచించారు. ఫిబ్రవరిలో పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ముడి చమురు ధరలు యుద్ధానికి ముందున్న సుమారు 73 డాలర్ల స్థాయి నుంచి గురువారం నాటికి బ్యారెల్లకు 126 డాలర్ల వద్ద నాలుగేళ్ల గరిష్ఠ స్థాయికి ఎగబాకాయి. భౌగోళిక రాజకీయాలు విధానాల రూపకర్తలను సరళంగా వ్యవహరించేలా, పాత ఆలోచనా విధానాన్ని విడనాడేలా చేస్తాయని పేర్కొంటూ నాగేశ్వరన్ ఇలా అన్నారు. 2026 ఆర్థిక సంవత్సరంలో జిడిపిలో ద్రవ్యలోటును 4.4శాతానికి తగ్గించడం వల్ల దేశానికి లభించిన ద్రవ్య వెసులుబాటు కారణంగా సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి అనేక ఇతర దేశాల కంటే మెరుగ్గా సిద్ధమైందని, పశ్చిమాసియా సంఘర్షణ భారతదేశానికి సరఫరా పరంగా షాక్ కంటే ప్రజా సంబంధాల పరంగానే ఎక్కువ నష్టమ, ఎందుకంటే ప్రభుత్వం దానిని చాలా చాకచక్యంగా నిర్వహిస్తోందని ప్రభుత్వ ఆర్థిక సలహాదారు నాగేశ్వరన్ పేర్కొన్నారు.

# మానవ జీవన శైలిలో యోగా నిరంతర ప్రక్రియ

కేంద్ర ఆయూష్ మంత్రి ప్రతాప్‌రావు జాదవ్

సంస్కృతి, జీవన విధానం ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత మోదీదే




**ప్రజాపక్షం/కొత్తూరు :** ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకునేందుకు యోగా ఎంతో అమూల్యమైందని కేంద్ర ఆయూష్ మంత్రి ప్రతాప్‌రావు జాదవ్ అన్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కన్హా శాంతివనంలో ఆయూష్ మినిస్ట్రీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని 50రోజుల కౌంట్‌డౌన్ యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిధులుగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపి డికె అరుణ, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌లు హాజరయ్యారు. కన్హాశాంతి వనంలో అభ్యాసకులతో కలిసి నేతలు యోగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ఆయూష్ మంత్రి ప్రతాప్‌రావు జాదవ్ మాట్లాడుతూ ప్రపంచ దేశాలకు యోగాను పరిచయం చేసిన ఘనత ప్రధాని నరేంద్రమోదీదేనని పేర్కొన్నారు. మానవుని శరీరంలో యోగాతోనే అనేక మార్పులు వచ్చే అస్కారం ఉంటుందని, నేటి పోటీ ప్రపంచంలో యోగాకే ప్రజలు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారని గుర్తు చేశారు. పెరుగుతున్న జీవన ప్రమాణాల్లో ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించేందుకు కృషి చేస్తున్నారని వివరించారు. యోగాకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడంతోపాటు దేశంలోని అనేక ప్రాంతాల్లో యోగా కేంద్రాలను సైతం ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. మానవ జీవితంలో యోగా నిరంతర ప్రక్రియా కాలన్నదే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తుందని వివరించారు. రికార్డు స్థాయిలో యోగాను ప్రదర్శించడంతోపాటు వికసిత్ భారత్‌లో ఒక భాగం చేశామని గుర్తు చేశారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, జీవన విధానం, విద్యను ప్రపంచానికి బలంగా చాటి చెప్పిన ఘనత నరేంద్రమోదీదేనని అన్నారు. ప్రాచీన వారసత్వమే కాకుండా యావత్ మానవాళికి దేశం ఇచ్చిన జ్ఞాన సంపద యోగా అని అన్నారు. యోగాను ప్రపంచ దేశాల అధినేతలు అనేక వేధికలపై సగర్వంగా భారతీయ సంస్కృతికి ప్రదర్శించే విధంగా చేసినట్లు వివరించారు. విద్య, భారతీయ సంస్కృతికి అంతర్జాతీయ గుర్తింపు తీసుకువచ్చిన ఘనత కేంద్ర ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన జీవన విధాన్ని అలవర్చుకునేందుకు ప్రతి రోజు యోగా చేసేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. దేశ ప్రజలంత పరిపూర్ణ ఆరోగ్యంతో ఉండాలన్నదే యోగా లక్ష్యమని, ఆ దిశగా ప్రజలందరు కృషి చేయాలని పేర్కొన్నారు. ఇప్పిటికే వివిధ దేశాలు అనునిత్యం యోగా చేస్తున్నారని, దాంతో సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజలు ఉన్నారని వివరించారు. పోటీ ప్రపంచంలో మానసిక ఒత్తిడి అనేది ఎక్కువగా పెరిగిపోయిందని, దాంతో అనేక రకాల ఆరోగ్య సమస్యలు వస్తుంటాయని పేర్కొన్నారు. వాటిని అధికమించేందుకు ప్రతి ఒక్కరు ఉదయం సమయంలో యోగా చేస్తే మానసిక ప్రశాంతత లభిస్తుందని వివరించారు. యోగాతో శారీరక, మానసిక ప్రశాంతత, సంపూర్ణ ఆరోగ్యంతో ఉండవచ్చునని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. ప్రతిరోజు యోగా చేయడం వల్ల మానసికంగా, శారీరంగా, ఆరోగ్యపరంగా ధృడపడుతారని వివరించారు. నిత్యం ప్రజలు కాలినడక, ధ్యానం, యోగా చేయడం వల్ల మనిషి ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలంటే యోగాసనాలతోపాటు ధ్యాన్యం చేసేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు.

## మహిళల అభివృద్ధికి స్వయం ఉపాధి పథకాలు



వనస్థలిపురంలో విజయ డెయిరీ పార్లర్ ప్రారంభించిన డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహిళల అభివృద్ధికి ఇలాంటి స్వయం ఉపాధి పథకాలు ఎంతో దోహదపడతాయని తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి అన్నారు. మహిళల ఆర్థిక సాధికారత, స్వయం సమృద్ధి లక్ష్యంగా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) యుసిడి విభాగం ఆధ్వర్యంలో హయత్ నగర్ సర్కిల్ వనస్థలిపురంలోని మహిళా థీమ్ పార్క్ ప్రాంగణంలో మదర్ థెరిసా మహిళా సంఘ సభ్యులు ఈ పార్లర్‌ను ఏర్పాటు చేసిన విజయ డైరీ పార్లర్‌ను శనివారం అమిత్ రెడ్డి ప్రారంభించారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు చైర్మన్ అమిత్ రెడ్డి తెలిపారు. ఈ డెయిరీ పార్లర్ ఏర్పాటుతో అటు ప్రజలకు స్వచ్ఛమైన పాల ఉత్పత్తులు అందుబాటులోకి రావడంతో పాటు, మహిళా సం ఘం సభ్యులకు స్థిరమైన ఆదాయ మార్గం లభించిందన్నారు. మహిళల్లో ఉపాధి సృష్టి, ఆర్థికాభివృద్ధి కోసం ఎంఎంసి నిరంతరం కృషి చేస్తోందని యుసిడి అదనపు కమిషనర్ సి.ఎన్.రఘుప్రసాద్ తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని మహిళా సంఘాలకు ఇలాంటి అవకాశాలు కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యుబిడి డైరెక్టర్ సునంద, యుసిడి పిడి సురేష్ కుమార్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వంపై కేంద్ర మంత్రి ఉద్దేశపూర్వకంగా బురద జల్లుతున్నారు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఉద్దేశపూర్వకంగానే రాష్ట్ర ప్రభుత్వంపై బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. పంట కొనుగోళ్ల అంశంలో కేంద్రం నుండి ఎలాంటి సహకారం అందించకపోగా పంటలను కొంటున్న రాష్ట్ర ప్రభుత్వంపైనే విమర్శలా అని మంత్రి ప్రశ్నించారు. ఈమేరకు శనివారం కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు బహిరంగ లేఖ రాశారు. తాను లేఖలో ప్రస్తావించిన అన్నిఅంశాలకు ముందుగా కేంద్ర మంత్రి బండి సంజయ్ సమాధానం చెప్పాలని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన మాట ప్రకారం 25,40,392 మంది రైతులకు రూ.2 లక్షల వరకు ఉన్న రూ.20,625 కోట్ల రుణాలను మాఫీ చేశామన్నారు. అదేవిధంగా 2023–24లో రూ.299 కోట్లతో 93,900 మెట్రిక్ టన్నుల జొన్నలు, 2024–25లో రూ. 521 కోట్లతో 1.41 లక్షల మెట్రిక్ టన్నులను, 2025–26కు సంబంధించి రూ.903 కోట్లతో 4.35 లక్షల మెట్రిక్ జొన్నలు కొనుగోలు చేశామని తెలిపారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం చేయాల్సిన పనులను రాష్ట్ర ప్రభుత్వం చేస్తోందని అలాంటి కాంగ్రెస్ ప్రభుత్వంపై నిందలు వేయడం సరైందికాదన్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా 'స్నేహ సమ్మర్ క్యాంప్స్' ప్రారంభం

కిశోర బాలికల సాధికారతకు నూతన దిశ




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో కిశోర బాలికల కోసం నిర్వహిస్తున్న స్నేహ సమ్మర్ క్యాంప్స్ ఘనంగా ప్రారంభమయ్యాయి. సెర్ప్ ఆధ్వర్యంలో ప్రణాళికాబద్ధంగా అమలు అవుతున్న ఈ క్యాంపుల్లో పెద్దసంఖ్యలో టీనేజ్ బాలికలు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. మే 2 నుంచి జూన్ 10 వరకు కొనసాగనున్న ఈ క్యాంపులు, బాలికల సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని ప్రత్యేకంగా రూపుదిద్దుకున్నాయి. ఆరోగ్యం, భద్రత, విద్య, జీవన నైపుణ్యాలు (లైఫ్ స్కిల్స్) వంటి అంశాలపై విభిన్న సెషన్‌ల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. క్యాంప్‌లో భాగంగా బాల్య వివాహాల నిర్మూలన, రక్తహీనత (అనీమియా) వంటి ఆరోగ్య సమస్యలపై చర్చలు జరుగుతున్నాయి. గ్రామాలను బాలికలకు సురక్షిత వాతావరణంగా తీర్చిదిద్దే చర్యలపై కూడా దృష్టి సారిస్తున్నారు. బాలికలు ఎదుర్కొనే వ్యక్తిగత, సామాజిక సవాళ్లను గుర్తించి వాటికి పరిష్కార మార్గాలపై అవగాహన పెంపొందిస్తున్నారు. ప్రభుత్వ పథకాలు, బ్యాంకింగ్ అలవాట్లు, పొదుపు ప్రాముఖ్యత, శారీరక వ్యాయామం, క్రీడలు, యోగా వంటి అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. విద్య ప్రాముఖ్యత, కెరీర్ మార్గదర్శకత్వం, నైపుణ్యాల అభివృద్ధి పై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సైబర్ భద్రత, స్మార్ట్‌ఫోన్ వినియోగంపై అవగాహన కల్పించడంతో పాటు, బాలికల స్వతంత్రతను పెంపొందించే చర్యలు చేపడుతున్నారు. 18 సంవత్సరాల బాలికలకు సైకిల్ తొక్కే శిక్షణ అందించడం ద్వారా వారి సాధికారతకు తోడ్పడుతున్నారు. క్యాంప్ ముగింపు సందర్భంగా తల్లిదండ్రులను ఆహ్వానించి కృతజ్ఞత కార్యక్రమం నిర్వహించనున్నారు. అలాగే, పిల్లల గ్రామసభ ద్వారా బాల్యవివాహాల నిరోధం, బాలికల భద్రత, విద్య ప్రోత్సాహం వంటి అంశాలపై గ్రామ స్థాయిలో నిర్ణయాలు తీసుకునేలా చర్యలు చేపడుతున్నారు. కీలక శాఖల సమన్వయంతో నిర్వహిస్తున్న ఈ స్నేహ సమ్మర్ క్యాంప్స్ ద్వారా కిశోర బాలికల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడం, ఆరోగ్యకరమైన, సురక్షితమైన భవిష్యత్తు నిర్మాణం లక్ష్యమని అధికారులు తెలిపారు.

# ఒఆర్ఆర్ ఘోర ప్రమాదంపై డిజిపి సమీక్ష

ప్రమాదాల నివారణకు కఠిన చర్యలు

ప్రజలకు ఇబ్బంది లేకుండా ట్రాఫిక్ నిర్వహణకు డిజిపి ఆదేశాలు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** నగరంలోని ఔటర్ రింగ్ రోడ్‌పై వరుసగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ ప్రమాదంలో ఆరుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని డిజిపి సివి ఆనంద్ ట్రాఫిక్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. తన కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిహెచ్‌ఎంసి పరిధిలోని ట్రాఫిక్ జాయింట్ కమిషనర్లు, డిసిపిలతో కలిసి నగర ట్రాఫిక్ పరిస్థితులను డిజిపి సమగ్రంగా పరిశీలించారు. పెరుగుతున్న వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని వేగ నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, రోడ్డు భద్రతా ప్రమాణాల అమలులో ఎలాంటి రాజీ ఉండకూడదని ఆయన పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, హెల్మెట్, సీట్ బెల్ట్ అమలుపై క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని ఆదేశించారు. నగర ట్రాఫిక్ నిర్వహణను మరింత సమర్థవంతంగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే ట్రాఫిక్ మేనేజ్మెంట్‌తో పాటు రోడ్ సేఫ్టీ బ్యూరో ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ బ్యూరో ద్వారా ట్రాఫిక్ నియంత్రణలో సమన్వయం మెరుగై ప్రమాదాల నియంత్రణకు దోహదం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఫ్యూచర్ సిటీ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ చందన దీప్తి, ట్రాఫిక్ డిసిపిలు రాహుల్ హెగ్డే, కాజల్ సింగ్, రాహుల్ రెడ్డి, అవినాష్ కుమార్, శేషాద్రిని రెడ్డి, శ్రీనివాస్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## 'ఆయుషధి ఎక్స్‌ప్రెస్'కు శ్రీకారం

ఔషధ రవాణాలో కొత్త దశకు శ్రీకారం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఔషధాల సురక్షిత రవాణాకు కీలక ముందడుగుగా దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో ప్రత్యేక రిఫ్రిజిరేటెడ్ కంటైనర్ రేక్ 'ఆయుషధి ఎక్స్‌ప్రెస్'ను ప్రారంభించారు. ఈ ప్రత్యేక రైలు దేశంలోని ఫార్మా సరఫరాను మరింత బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించనుంది. సనత్‌నగర్‌లోని ఇన్‌ల్యాండ కంటైనర్ డిపో (ఐసిడి) నుంచి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ఈ రిఫర్ కంటైనర్ రేక్‌ను శనివారంప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాన్కార్ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సంజయ్ స్వరూప్‌తో పాటు పలువురు రైల్వే, లాజిస్టిక్స్, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు. 'ఆయుషధి ఎక్స్‌ప్రెస్' ద్వారా జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్ వరకు ప్రాణ రక్షక మందులతో పాటు ఉష్ణోగ్రతకు సున్నితమైన సరుకులను ప్రత్యేక రిఫ్రిజిరేటెడ్ కంటైనర్లలో రవాణా చేయనున్నారు. ఈ కంటైనర్లు డిజిల్ పవర్ ప్యాక్‌లతో నిరంతర శీతలీకరణను కల్పించడం ద్వారా సరుకు నాణ్యతను కాపాడుతాయి. ఈ సేవతో ట్రాన్సిట్ సమయం తగ్గడమే కాకుండా రవాణా ఖర్చులు తగ్గి, ఎగుమతిదారులకు ప్రయోజనం కలగనుంది. ముఖ్యంగా హైదరాబాద్‌ను ఫార్మా హబ్‌గా మరింత బలోపేతం చేస్తూ ఔషధ పరిశ్రమ అభివృద్ధికి తోడ్పడనుంది. ప్రభుత్వం చేపట్టిన గతి శక్తి కార్యక్రమానికి అనుగుణంగా, సమర్థవంతమైన, పర్యావరణ హిత సరకు రవాణా వ్యవస్థలను అభివృద్ధి చేసే దిశగా ఇది ఒక కీలక అడుగుగా అధికారులు పేర్కొన్నారు.

# గౌరమ్మకు కన్నీటి వీడ్కోలు



అశేష జనసంద్రం మధ్య అంతిమయాత్ర

రామకృష్ణకు చంద్రబాబు పరామర్శ

నారా లోకేశ్, జగన్ సంతాపం

పార్టీలకతీతంగా ప్రముఖుల నివాళి

**ఆలూరు:** సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కె.రామకృష్ణ మాతృమూర్తి కాకా గౌరమ్మ అంత్యక్రియలు శనివారం జరిగాయి. గౌరమ్మ అంతిమయాత్రలో సిపిఐ శ్రేణులతో పాటు సిపిఎం, టిడిపి, జనసేన, వైసిపికి చెందిన నాయకులు, బంధువులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, ప్రముఖులు పాల్గొన్నారు. ఆమెను చివరిసారి చూసేందుకు పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చారు. చివరి వరకు నిరాడంబర జీవనం కొనసాగిస్తూ... కుటుంబానికి అండగా నిలిచిన గౌరమ్మ సేవలను స్మరించుకున్నారు. తల్లి భౌతిక కాయం వద్ద రామకృష్ణ భావోద్వేగానికి గురికావడంతో బంధువులు, మిత్రులు, పార్టీ శ్రేణుల హృదయాలు చలించాయి. అంత్యక్రియలకు అనేక జిల్లాల నుంచి సిపిఐ సహా అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరయ్యారు. సిపిఐ రాష్ట్ర, జిల్లా నాయకత్వంతో పాటు రైతు, కార్మిక, యువజన సంఘాల ప్రతినిధులు గౌరమ్మ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రామకృష్ణకు సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.రామాంజనేయులు, డి.జగదీష్, రాష్ట్రకార్యవర్గ సభ్యులు రామచంద్రయ్య, కర్నూలు జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు పూల రామాంజనేయులు, వైసిపి నాయకులు శ్రీరాములు ఉన్నారు.

**చంద్రబాబు పరామర్శ**

రామకృష్ణను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఫోన్ ద్వారా పరామర్శించారు. గౌరమ్మ మరణం పట్ల చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. గౌరమ్మ జీవిత విశేషాలు అడిగి తెలుసుకున్నారు. తన తల్లి వ్యవసాయంతో పాటు ఇంటివద్ద పాడి పనులు కూడా చూసుకునేవారని రామకృష్ణ తెలియజేయగా... అలాంటి కృషి, జీవన విధానమే ఆమె సంపూర్ణ జీవితం గడపడానికి కారణమని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. గౌరమ్మ మతి పట్ల ప్రగాఢ సంతాపం, సానుభూతిని తెలియచేస్తూ ... ధైర్యంగా, నిగ్రహంగా ఉండాలని రామకృష్ణను ఓదార్చారు. రామకృష్ణ మాతృమూర్తి గౌరమ్మ మరణం పట్ల రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియచేశారు. వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, ప్రజాపక్షం అడ్వర్‌టైజ్‌మెంట్ మేనేజర్ ఎం.మదన్ ఫోన్‌లో రామకృష్ణతో మాట్లాడి... సంతాపం, సానుభూతి తెలిపారు.

## 10న మోదీ భారీ సభ

కిషన్ రెడ్డి గోడ రాతల ప్రచారం ప్రారంభం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటనను పురస్కరించుకుని కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి ప్రచారాన్ని ప్రారంభించారు. హిమాయత్‌నగర్, నారాయణగూడ ప్రాం తాల్లో స్వయంగా గోడ రాతల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ నెల 10వ తేదీన సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న ప్రధాని మోదీ భారీ బహిరంగ సభకు రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజలు తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చింతల రాంచంద్రారెడ్డి, లంకెల దీపక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భారీగా డ్రగ్స్ పట్టివేత

హసీష్ ఆయిల్‌తో డాన్ అరెస్ట్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ పరిసర ప్రాంతంలో డ్రగ్స్ సరఫరా ముఠాపై రంగారెడ్డి ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. శనివారం నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో 1.550 కిలోల హసీష్ ఆయిల్‌తో పాటు గంజాయి స్వాధీనం చేసుకుని, అంతర్రాష్ట్ర సరఫరాదారుడిని అరెస్ట్ చేశారు. కుత్బుల్లాపూర్ పరిధిలోని రంగారెడ్డి నగర్‌లో హసీష్ ఆయిల్ విక్రయాలు జరుగుతున్నాయన్న విశ్వసనీయ సమాచారం మేరకు ఎన్ఫోర్స్‌మెంట్ బి టీం సిఐ సుభాష్ చందర్ నేతృత్వంలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా జనగాం ప్రాంతానికి చెందిన సాకి చక్రపాణి (23)ను అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి 1.550 కిలోల హసీష్ ఆయిల్‌తో పాటు 465 గ్రాముల గంజాయిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో చక్రపాణి ఒడిస్సా నుంచి తరచూ గంజాయి, హసీష్ ఆయిల్ తెచ్చి హైదరాబాద్‌లో విక్రయాలు చేస్తున్నట్లు బయటపడింది.అంతేకాకుండా, నిందితుడిపై ఒడిస్సాలోని కలిమెలా పోలీస్ స్టేషన్, ఆంధ్రప్రదేశ్‌లో మోటుగూడా పోలీస్ స్టేషన్, హైదరాబాద్‌లో తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌లలో పలు కేసులు నమోదై ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.ఈ విజయవంతమైన ఆపరేషన్ నిర్వహించిన ఎన్ఫోర్స్‌మెంట్ బృందాన్ని రంగారెడ్డి అసిస్టెంట్ కమిషనర్ ఆర్. కిషన్ అభినందించారు. స్వాధీనం చేసుకున్న మత్తు పదార్థాలు, నిందితుడిని కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.ఈ ఘటనతో నగరంలో డ్రగ్స్ మాఫియాపై ఎక్సైజ్ శాఖ మరింత కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు స్పష్టమైంది.



## ధాన్యం తరలింపులో కొంత ఆలస్యం

ప్రభుత్వ విప్,స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం

**ప్రజాపక్షం/నకిరేకల్** : లారీల ద్వారా మిల్లర్లకు ధాన్యం తరలింపులో కొంత ఆలస్యం జరుగుతున్నప్పటికీ కొనుగోలు ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహిస్తున్నామని ప్రభుత్వ విప్,స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం పేర్కొన్నారు.శనివారం మండలంలోని నోముల,చందుపట్ల గ్రామాలలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకస్మికంగా తనిఖీ చేసిన నోముల, చందుపట్ల కొనుగోలు కేంద్రాల నుండి ఇప్పటికే పెద్ద మొత్తంలో ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు.ప్రతి రోజు నకిరేకల్ మండలంలో సుమారు 40 లారీల ద్వారా ధాన్యం తరలింపు జరుగుతోందన్నారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా సంబంధిత అధికారులకు లేదా తనకు నేరుగా తెలియజేయాలన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,సివిల్ సప్లై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ధాన్యం కొనుగోలు ఎగుమతి ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు.రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యానికి వెంటనే వారికి చెల్లింపులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ యశ్వంత్ రాజ్, డిటిసిఎస్ జ్యోతి, ఆయా గ్రామాల సర్పంచులు పొట్ట బత్తుల జయమ్మ వెంకటేశం,దిగోజులతా వెంకటాచారి,మార్కెట్ కమిటీ డైరెక్టర్ వరకాంతం శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

## సకాలంలో ధాన్యం కొనుగోళ్లు

మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు వినతి



**ప్రజాపక్షం/చింతపల్లి** : రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం సకాలంలో కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం చింతపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. రైతులు మార్కెట్‌కు తరలించిన వరి ధాన్యాన్ని రైతు సంఘం పరిశీలించిన అనంతరం మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు మాట్లాడుతూ చింతపల్లి, కుర్మేడు తీదేడు వ్యవసాయ మార్కెట్లో రైతులు ఎండబోసిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో పాటు లారీలు సమయానికి లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వర్షం వస్తే ఎండిన ధాన్యం తడిసిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రభుత్వం, వ్యవసాయ అధికారులు వెంటనే రైతుల గోస పట్టించుకొని సకాలంలో ధాన్యం కొనుగోలు, చేసి లారీల కొరత లేకుండా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పోలె వెంకటయ్య, మండల సహాయ కార్యదర్శి ఉజ్జిని అంజల్‌రావు, మండల కార్యవర్గ సభ్యులు వేముల బుచ్చయ్య, రైతు సంఘం సభ్యులు కుర్మేటి కృష్ణయ్య, బ్రహ్మచారి, ఎస్కే శంషుద్దీన్, కలకొండ వెంకటయ్య, జక్కుల లింగం, సన్నాయిల ఎల్లయ్య, గుండ్లపల్లి ఇద్ది రాములు, వింజమూరి నరసింహ, ఈదయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక అమలు పరిస్థితిపై సమీక్ష సమావేశం

పాల్గొన్న జిల్లా ఎస్‌పి నర్సింహ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వేణారెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట:** ప్రజలకు చేరువగా సేవలందించేందుకు ప్రభుత్వం రూపొందించిన 99 రోజుల కార్యక్రమాన్ని అధికారులు సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా ఎస్‌పి కె. నర్సింహా, వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి లు అన్నారు. శనివారం సూర్యాపేటలోని రవి మాల్ కన్వెన్షన్ హాల్‌లో ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో కార్యక్రమంలో భాగంగా సమీక్ష సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ముఖ్యంగా మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, రహదారులు, డ్రైనేజీల వంటి ప్రాధాన్య అంశాల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అదేశించారు. ప్రతి విభాగం తమకు కేటాయించిన పనులను నిర్ధిష్ట గడువులో పూర్తి చేసి ప్రజలకు నాణ్యమైన సేవలందించాలని కోరారు. ఈ సమావేశంలో ఆర్డీవో వేణుమాదవరావు, మున్సిపల్ కమిషనర్ హనుమంతరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండి షఫిఉల్లా, సర్పంచులు, ఉప సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు

నిర్లక్ష్యం వహించిన అధికారులపై కలెక్టర్ ఆగ్రహం



**ప్రజాపక్షం/తుంగతుర్తి (తిరుమలగిరి):** ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలను ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని, అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల పవార్ హెచ్చరించారు. తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన అక్రమాలపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలకు ఉపక్రమించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించి, దళారులకు సహకరించిన గొట్టిపర్తి ఐకెపి సిసి రామయ్యను సస్పెండ్ చేయగా తుంగతుర్తి తహసిల్దార్ దయానందం, తిరుమలగిరి తహసిల్దార్ హరిప్రసాద్, ఎంపిడివో శేషుకుమార్, తుంగతుర్తి మండల వ్యవసాయ అధికారి రమేష్‌బాబు, గొట్టిపర్తి ఐకెపి బిటిఎం జె.శ్వేత, తుంగతుర్తి ఎపిఎం యాదమ్మ లకు షోకాజ్ నోటీసులు జారి చేశారు. అక్రమాలు జరిగిన వెలిశాల, గొట్టిపర్తి, జలాలపురం, మామిడాల ఐకెపి కేంద్రాల ఏజెన్సీలను రద్దు చేసి వేరే ఏజెన్సీలకు కేటాయించడం జరుగుతుందని, డ్రైవర్, కమిషన్ ఏజెంట్ (ట్రేడర్) పై క్రిమినల్ కేసు బుక్ చేయడం జరిగిందని, అలాగే అక్రమాలు జరిగిన ఐకెపి సెంటర్ల మీద కూడా దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు. తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌లో రైతుల నుండి కొనుగోలు చేసి, గొట్టిపర్తి ఐకెపి కేంద్రంలో రైతుల పేరిట విక్రయిస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ విచారణకు అదేశించగా జిల్లా అధికారులతో కూడిన విచారణ బృందం విచారణ చేపట్టి ప్రాథమిక నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. తుంగతుర్తి మండలంలోని కొన్నిసెంటర్లలో అమ్మకాలు జరిగాయని వాటిపై కూడా అధికారులు విచారణ చేపడతామన్నారు.

# కార్మికుల ప్రాణాలను బలిగొంటున్న పరిశ్రమలు మూసివేయాలి

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం హెచ్చరిక

నోష్ ఫార్మాలో వరుస పేలుళ్లకు బాధ్యులైన యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సిపిఐ ధర్నా

మృతుడికి రూ.2 కోట్లు ,గాయపడిన వారికి రూ.1కోటి వెంటనే ఇవ్వాలి

నల్లగొండను మరో పటాన్‌చెరువుగా మార్చొద్దు..ప్రభుత్వానికి హెచ్చరిక





**ప్రజాపక్షం/నల్లగొండ/చిట్యాల** : కార్మికుల ప్రాణాలను పణంగా పెట్టే పరిశ్రమలకు ఇక ఊరట లేదు భద్రతా ప్రమాణాలు పాటించని ఫ్యాక్టరీలను తక్షణమే మూసివేయాలి అని సిపిఐ జిల్లా కార్యదర్శి,ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఘాటుగా హెచ్చరించారు.చిట్యాల మండలం బొంగొని చెరువు పరిధిలోని నోష్ ఫార్మా పరిశ్రమలో జరిగిన రియాక్టర్ పేలుడు ఘటనను నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో పరిశ్రమ ఎదుట ధర్నా నిర్వహించి ఘటనా స్థలాన్ని పరిశీలించారు.అనంతరం ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మీడియాతో మాట్లాడుతూ చిట్యాలచౌటుప్పల్ ప్రాంతాల్లో పెరిగిపోతున్న ఫార్మా,రసాయన పరిశ్రమలు కార్మికుల ప్రాణాలకు ముప్పుగా మారాయని మండిపడ్డారు.కేవలం 20 రోజుల క్రితమే ఇదే నోష్ ఫార్మా పరిశ్రమలో జరిగిన పేలుడులో గాయపడిన ఇద్దరు కార్మికులు ఇంకా కోలుకోకముందే మరోసారి ఇలాంటి ఘటన జరగడం యాజమాన్య వైఖరికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇది ప్రమాదం కాదు,యాజమాన్యం నిర్లక్ష్యపు హత్య అని ఆయన మండిపడ్డారు. కాలం చెల్లిన రియాక్టర్‌లను తొలగించి నూతనంగా ఏర్పాటు చేయకుండా వాటినే వాడడం వలన తరుచుగా ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నవి అన్నారు.ఇలాంటి ప్రాణాంతక ఫార్మా పరిశ్రమ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కాలుష్య నియంత్రణ మండలి,కార్మిక శాఖ,ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల వైఫల్యం వల్లే వరుస ప్రమాదాలు జరుగుతున్నాయని ఎమ్మెల్సీ ధ్వజమెత్తారు. కంపెనీల నుంచి ముడుపులు తీసుకొని తనిఖీలు చేయకుండా కళ్లు మూసుకుంటున్న అధికారులే ఈ మరణాలకు ప్రత్యక్ష కారణమని ఆరోపించారు.విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులందరినీ తక్షణమే సస్పెండ్ చేసి,వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈప్రమాదంలో చిన్నకాపర్తి గ్రామానికి చెందిన బాలకృష్ణ మృతి చెందడం తీవ్ర విషాదకరమని పేర్కొంటూ, మృతుడి కుటుంబానికి రూ.2 కోటి, గాయపడిన వారికి ఒక్కొక్కరికి రూ.1కోటి చొప్పున నష్టపరిహారం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.క్షతగాత్రులకు అత్యుత్తమ వైద్యసేవలు అందించాలని స్పష్టం చేశారు. ఈప్రాంతాన్ని మరొక పటాన్‌చెరువు లాంటి కాలుష్య కేంద్రంగా మారనివ్వం అంటూ గట్టి హెచ్చరిక జారీ చేశారు.ఈధర్నా కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రావణ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు బొల్గురి నర్సింహా, సమితి సభ్యులు బోడిగె సైదులు,జిల్లా యాద య్యా, మండల కార్యదర్శి ఎం.డి.అక్బర్,సహాయ కార్యదర్శి జిల్లా సత్యం,నాయకులు ఎండి జహంగీర్,జిల్లా లక్ష్మయ్య, ఎస్‌కెషరీఫ్,బొల్గురి లింగయ్య,దేవేందర్,సీమ అంజయ్య, బొబ్బల శంకర్ రెడ్డి ఎర్పుల రాములు, సర్గాల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

### సాధారణ పేలుళ్లు కాదు కార్మికుల హత్యలే..

కె. నారాయణ ఆగ్రహం

రసాయన పరిశ్రమల్లో తరుచు జరుగుతున్న పేలుళ్లు సాధారణ ప్రమాదాలు కావని,అవి యాజమాన్యాల నిర్లక్ష్యం, కొరవడిన అధికారుల అలసత్వం,వాటిని అరికట్టవలసిన ప్రభుత్వం కలిసి చేస్తున్న కార్మికుల హత్యలే అని సిపిఐ సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె. నారాయణ తీవ్రంగా మండిపడ్డారు.నల్లగొండ జిల్లా, చిట్యాల మండలంలోని బొంగొని చెరువు పరిధిలోని నోష్ ఫార్మా పరిశ్రమలో జరిగిన రియాక్టర్ పేలుడు ఘటన తెలుసుకొని ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న డాక్టర్ కె. నారాయణ పరిశ్రమ సంఘటనను సందర్శించి ప్రమాద వివరాలను తెలుసుకున్నారు.అనంతపురం మీడియాతో మాట్లాడుతూ ఒకే పరిశ్రమలో 20 రోజుల వ్యవధి కాలంలోనే మళ్లీ పేలుడు జరగడం యాజమాన్య నిర్లక్ష్యానికి స్పష్టమైన నిదర్శనమని ఆరోపించారు.రసాయన పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస భద్రతా పరికరాలు ఇవ్వకుండా ప్రమాదకర పనులు చేయించడం అమానుషమన్నారు. ఇప్పటికైనా కార్మికుల ప్రాణ భద్రతను కాపాడటం ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యత అని,ఇందులో విఫలమైతే భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలోఆందోళనలు చేపడతామని నారాయణ హెచ్చరించారు.

## వాగ్దానాలకే పరిమితం కాదు..కొత్త పథకాలూ అమలు చేస్తున్నాం

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక సమావేశం



**ప్రజాపక్షం/నల్లగొండ** : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలే కాకుండా,చెప్పని అనేక కొత్త పథకాలను కూడా అమలు చేస్తోందని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.99 రోజుల కార్యాచరణలో పలు పథకాలు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని ఉదయాదిత్య భవన్‌లో నిర్వహించిన నల్లగొండ నియోజకవర్గస్థాయి సమావేశానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇప్పటివరకు గ్రామ, మండల స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500లకే ఎల్‌పిజీ గ్యాస్ వంటి ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నామని చెప్పారు.దేశంలో ఎక్కడా లేనివిధంగా పూర్వ ప్రాథమిక విద్య నుంచి ఇంటర్మీడియట్ వరకు మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం రాగి జావ,సాయంత్రం అల్పాహారం అందిస్తామన్నారు.ఈ నెలాఖరు నాటికి చేపట్టిన ఇళ్లన్నీ పూర్తి కావాలని మంత్రి ఆదేశించారు.ఇళ్లు నిర్మించుకోని వారు రాతపూర్వకంగా తెలియజేస్తే సోమవారం నాటికి జాబితా సమర్పించాలని,వారి స్థానంలో కొత్త లబ్ధిదారులకు ఇళ్లు కేటాయిస్తామని అన్నారు. జూన్ నుంచి మరో విడత ఇందిరమ్మ ఇళ్లకు అనుమతి వస్తుందని, మే చివరి నాటికి నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మేయర్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్,డిప్యూటీ మేయర్ అశ్రఫ్ అలీ, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్,అదనపు కలెక్టర్ వై.అశోక్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్,మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర పవార్ తదితరులు పాల్గొన్నారు.



## అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం పట్టణంలోని మినీ రవీంద్రభారతిలో అధికారులు, ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. రెండు నెలలుగా గ్రామసభలు, మండల స్థాయి సమావేశాలను విజయవంతంగా నిర్వహించామన్నారు. నియోజకవర్గంలో వేలాది కుటుంబాలకు 200యూనిట్ల ఉచిత విద్యుత్ అందుతుందని, రైతులకు పెట్టుబడి సాయం, పెండింగ్ రుణమాఫీ ప్రక్రియను వేగవంతం చేశామన్నారు. మే 4 నుంచి 9వరకు వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి, పంట మార్పిడిపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంల ద్వారా ప్రతి ఇంటి ఆరోగ్యంపై సర్వే నిర్వహించడంతోపాటు పేదలకు ఆరోగ్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజల పెండింగ్ ఫైళ్లు ఏవీ ఉండకూడదన్నారు. అధికారులు డిజిటల్ గవర్నెన్స్ పద్ధతిలో పనిచేయాలన్నారు. నేనే స్వయంగా ప్రతివారం పనులను సమీక్షిస్తానన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2 నాటికి నియోజకవర్గం పరిశుభ్రమైన, అభివృద్ధి చెందిన నియోజకవర్గంగా ఉండాలన్నారు. ప్రతి గ్రామం, మున్సిపాలిటీ పండుగలా తయారు కావాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిలుకూరి సుధాబాలకృష్ణ, వైస్ చైర్‌పర్సన్ గుడిపాటి శిరీషనవీన్, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## హుండీ లెక్కింపు ఉద్యోగాల పేరుతో భారీ మోసం

ఒక్కొక్కరి నుంచి రూ.1.50 నుంచి రూ.2 లక్షల వసూలు

1,500 మంది బాధితులు, రూ.20 కోట్ల కుంభకోణం అనుమానం



**ప్రజాపక్షం/నకిరేకల్:** దేవాదాయ శాఖలో దేవాలయ హుండీల లెక్కింపు ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను లక్షల రూపాయలు వసూలు చేసి మోసం చేసిన భారీ కుంభకోణం నకిరేకల్‌లో వెలుగుచూసింది.నెలకు 6 రోజులు పని, రూ.27,500 జీతమంటూ టోకరా కరీంనగర్ జిల్లా సుందిళ్ల గ్రామానికి చెందిన పులి రవి అనే వ్యక్తి రవి సేవా సమితి పేరుతో సేవా సంస్థను రిజిస్టర్ చేసుకుని,హుండీ లెక్కింపు ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించాడు.నెలకు ఆరు రోజులు పని,ఒక్కో డ్యూటీకి రూ.4వేలు, ప్రయాణ భత్యం రూ.500తో కలిపి రూ.27,500 వేతనం వస్తుందని చెప్పి ఏజెంట్ల ద్వారా ఒక్కొక్కరి నుంచి రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు వసూలు చేశాడు. మొదట్లో దగ్గరి ఆలయాలకు పంపి నమ్మకం కలిగించి,తర్వాత దూర ప్రాంతాలకు పంపడం మొదలుపెట్టాడు.రూ.20 కోట్లకు పైగా కుంభకోణం అనుమానం విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో లెక్కింపునకు వెళ్లిన బాధితులు వేతనాల గురించి అడగ్గా, మీరు సేవ పేరుతో వచ్చారు,వేతనాలు ఎక్కడి నుంచి వస్తాయి అని అధికారులు చెప్పడంతో మోసం బయటపడింది.13 ఏళ్ల అగ్రిమెంట్ అంటూ రూ.50 స్టాంప్ పేపర్‌పై ఒప్పందాలు రాయించుకున్నాడు. ఏడు నెలలు డ్యూటీలు చేయించి రెండు నెలల వేతనాలే ఇచ్చి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. తెలుగు రాష్ట్రాల్లో 1,000 నుంచి 1,500 మంది బాధితులు ఉండొచ్చని, రూ.15 కోట్ల నుంచి రూ.20 కోట్లకు పైగా కుంభకోణం జరిగి ఉండొచ్చని అనుమానిస్తున్నారు.బాధితులు నకిరేకల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, సీఐ హరిబాబు ఫిర్యాదులు స్వీకరించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## 102 వాహన సౌకర్యాన్ని వినియోగించుకోండి

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** 102 వాహన సౌకర్యాన్ని ప్రజలు వినియోగించుకోవాలని వైద్యాధికారిణి డాక్టర్ నాగిని కోరారు. నేరేడుచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గత నెల 30వ తేదీన సాధారణ ప్రసవమైన బాలింతలను ఆమె స్వగ్రామం పాలకవీడు మండలం ఎల్లాపురం గ్రామానికి శనివారం 102 వాహనంలో తల్లిబిడ్డను క్షేమంగా ఇంటికి చేర్చారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగిని మాట్లాడుతూ ప్రసవానంతరం బాలింతలను వారి స్వగ్రామంలో దింపటమే కాకుండా, గర్భిణీలను ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకవచ్చి వారికి కావాల్సిన వైద్య పరీక్షలు చేయించి తిరిగి వారిని వారి ఇంటి వద్దకు పంపిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సల్వాది శ్రీనివాస్, కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్, నర్సింగ్ ఆఫీసర్ స్వాతి, పుష్పజ్యోతి, డ్రైవర్ విజయ్ పాల్గొన్నారు.

## గంజాయి ముఠా అరెస్ట్..

ఐదు కిలోల గంజాయి స్వాధీనం

సరఫరా,సేవనంపై కఠిన చర్యలు

అడిషనల్ ఎస్‌పి రమేష్ హెచ్చరిక

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఆంధ్రప్రదేశ్,ఒడిశా సరిహద్దు నుంచి నల్లగొండకు అక్రమంగా గంజాయి తరలించి అమ్మకాలు చేస్తున్న ముఠాను జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారని అడిషనల్ ఎస్‌పి జి. రమేశ్ తెలిపారు.ఐదుగురు అరెస్ట్,ఆరుగురు పరారీశనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ,టూ టౌన్ ఎస్సై వై.సైదులు బృందం హైదరాబాద్ రోడ్‌లోని ఉడిపి హోటల్ పరిసరాల్లో ఐదుగురిని పట్టుకున్నారు.వారి నుంచి రూ.లక్ష విలువ చేసే 5 కిలోల గంజాయి,రెండు మోటార్ సైకిళ్లు,5సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.మొత్తం విలువ సుమారు రూ.3 లక్షలు ఉంటుందని తెలిపారు.అరెస్టయిననిందితులు ఏ1 కోరేపల్లి అభినవ్,ఏ2 సింగపంగా రాకేశ్,ఏ3 మల్లె మోహన్ కృష్ణ,ఏ4 ధరావత్ రాజేశ్, ఏ5 బత్తుల శివసాయి.మరో ఆరుగురు కస్పారాజు నాగరాజు,గంటెకంపు మధు కుమార్,జూలకంటి విష్ణువర్ధన్,సంపత్ కుమార్, సుశాంత్,మనుకర్ పరారీలో ఉన్నారు.ఏ1 అభినవ్ స్నేహితులతో కలిసి ఏఓబీలోని సీలేరు నుంచి కిలో రూ.3 వేలకు గంజాయి కొని నల్లగొండలో అమ్ముతున్నాడని విచారణలో తేలింది.గంజాయి,మాదకద్రవ్యాలు సరఫరా చేసినా,వినియోగించినా ఉపేక్షించేది లేదని అడిషనల్ ఎస్‌పి హెచ్చరించారు.కేసును ఛేదించిన సీఐ ఎస్. రాఘవరావు, ఎస్ఐవై. సైదులు, సిబ్బందిని జిల్లా ఎస్‌పి అభినందించారు.



## పిల్లలకు మండుటెండల్లో ఉల్లాసం నింపేందుకు వేసవి వినోద శిబిరం



సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె.నర్సింహా

**ప్రజాపక్షం/సూర్యాపేట:** పిల్లలకు వేసవి సెలవులు ప్రారంభమైనాయి, విద్యార్థులకు, పోలీస్ పిల్లలకు వేసవి వేడిమి నుంచి ఉల్లాసాన్ని కలిగించడానికి సూర్యాపేట జిల్లా పోలీసుల ప్రత్యేక చొరవతో విద్యార్థులకు వేసవి వినోద శిబిరం కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ వినోదవంతమైన శిబిరాన్ని జిల్లా ఎస్‌పి కె.నర్సింహా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన యోగా, జుంబా డ్యాన్స్, క్రీడలు మొదలగు ఉల్లాసభరితమైన కార్యక్రమాలలో విద్యార్థులు, విల్లాసం, ఆనందోత్సవాలతో గడిపారు. బాలలతో కలిసి జిల్లా ఎస్‌పి, అదనపు ఎస్‌పి, డిఎస్‌పిలు, సిఐ లు, ఆర్ ఐ లు, ఎస్ఐ లు, ఆర్ఎస్ఐ లు, పోలీస్ సిబ్బంది జుంబా బ్యాన్స్, యోగా చేసి క్రీడలు ఆడారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి కె.నర్సింహా మాట్లాడుతూ వేసవి వేల పిల్లలు, రోడ్లపై ఇతర కార్యక్రమాలలో ప్రమాదకరమైన స్థితిలో ఉండకూడదని విద్యార్థులకు, పోలీస్ పిల్లల కోసం ప్రత్యేక చొరవతో ఈ వేసవి వినోద శిబిరాన్ని ఏర్పాటు చేశామని అన్నారు. పోలీస్ వినోద శిబిరానికి హాజరైన విద్యార్థులు పిల్లలతో కలిసి ఎస్‌పి స్వయంగా సరదాగ కాసేపు గడిపి క్రీడలు ఆడారు. యోగా, జుంబా డ్యాన్స్ చేశారు. రోడ్డు ప్రమాదాలు, ఇతర కారణాలతో ఆకాలంగా మరణించిన పోలీస్ సిబ్బందికి నివాళులు ఘటించారు. పదవ తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపి మంచి మార్కులు సాధించి పోలీస్ సిబ్బంది పిల్లలను సన్మానించి, నగదు ప్రోత్సహకం అందించారు. ఆర్మడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ కుమార్తె భవ్యశ్రీ, మోతె పిసి హోంగార్డ్ సురేష్‌రెడ్డి కుమార్తె హర్షిత పదవ తరగతిలో మంచి మార్కులు సాధించారని సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్‌పి రవీందర్‌రెడ్డి , ఆర్మ్డ్ విభాగం డిఎస్‌పి నర్సింహచారి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, రాజశేఖర్, ఆర్ఐ లు ప్రవీణ్‌కుమార్, జానయ్య, ఎస్ఐ లు సాయిరాం, శ్రీకాంత్, ఐలయ్య, మహేష్ పాల్గొన్నారు.

## విద్యుదాఘాతానికి ఆయిల్‌పామ్ తోట దగ్ధం

**ప్రజాపక్షం/మునుగోడు:** విద్యుత్ తీగలు ఒకదానికొకటి తాకి మంటలు చెలరేగడంతో ఆయిల్ ఫామ్ తోట పూర్తిగా కాలిపోయిన ఘటన మునుగోడు మండలం ఏలుగలగూడెంలో చోటుచేసుకుంది. రైతు మేకల నారాయణరెడ్డికి చెందిన పొలంలో శుక్రవారం ఈ ప్ర మాదం జరిగింది. విద్యుత్ లైన్లు వదులుగా ఉండి తీగలు అల్లుకొని ఉన్నాయని అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బాధిత రైతు వాపోయాడు.దీని కారణంగానే షార్ట్ సర్క్యూట్ జరిగి తోట మొత్తం దగ్ధమై పూర్తిగా పంట నష్టం వాటిల్లిందని తెలిపారు.సంబంధిత అధికారులు స్పందించి నష్టపరిహారం అందించాలని,వదులుగా ఉన్న విద్యుత్ లైన్లను సరిచేసి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.



ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
ఆదివారం
03-05-2026
www.prajapaksham.in

వరుణ్ సందేశ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం నా వైఫ్ మిస్సింగ్. ఈ చిత్రం పూజా కార్యక్రమంతో శనివారం హైదరాబాద్‌లో షూటింగ్ ప్రారంభమైంది. ప్రముఖ నిర్మాత సి. కళ్యాణ్ క్లాప్ కొట్టారు. ఈ సినిమాను ఓటిటి ప్లాట్ ఫాం ఆహా కోసం నిర్మిస్తున్నారు.

రీల్

## 22న విడుదల కానున్న 'పోలీస్ కంప్లైంట్'



నటి వరలక్ష్మి శరత్‌కుమార్, నటుడు నవీన్ చంద్ర. క్రేజీ కాంబినేషన్‌లో డైరెక్టర్ సంజీవ్ మేగోటి తెరకెక్కించిన తాజా చిత్రం 'పోలీస్ కంప్లైంట్'. ఎంఎస్‌కె ప్రమిద శ్రీ ఫిలిమ్స్ బ్యానర్‌పై బాలకృష్ణ మహారాణా నిర్మిస్తున్న ఈ మూవీ మే 22న థియేటర్‌లలో విడుదల కాబోతోంది. ఈ సినిమాలో మరో కీలక పాత్రలో నటించిన కృష్ణ సాయి బర్త్ డే సందర్భంగా తన అభిమాన నటుడు సూపర్ స్టార్ కృష్ణపై ఈ సినిమాలో చేసిన స్పెషల్ సాంగ్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు సంజీవ్ మేగోటి మాట్లాడుతూ 'చైన్ రియాక్షన్ ఆఫ్ కర్మ' అనే కాన్సెప్ట్ ఆధారంగా తెరకెక్కిస్తున్నాం. ఇదొక అవుట్ అండ్ అవుట్ యాక్షన్ ఎంటర్‌టైనర్. దీనికి హారర్ థ్రిల్లర్ అంశాలను జోడించి ప్రేక్షకులకు మునుపెన్నడూ చూడని సరికొత్త అనుభూతిని అందించబోతున్నాం. ఈ సినిమా కథ, పాత్రల నిర్మాణం ప్రత్యేకంగా ఉంటూ ప్రతి ఒక్కరిని ఖచ్చితంగా అలరిస్తుందన్న నమ్మకం ఉంది. మే 22న విడుదలయ్యే ఈ సినిమాను ప్రతి ఒక్కరూ ఆదరించాలని ప్రేక్షకులను కోరుకుంటున్నాం అని అన్నారు.ఈ చిత్రంలో రాగిణి ద్వివేది, ఆదిత్య ఓం, రవిశంకర్, శ్రీనివాస్ రెడ్డి, సప్తగిరి, శరత్ లోహితశ్వ, జెమినీ సురేష్, దిల్ రమేష్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. మొత్తం 52 మంది సీనియర్ ఆర్టిస్టులతో భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ చిత్రానికి సంగీతం: ఆరోహణ సుధీంద్ర, సంజీవ్ మేగోటి, సుధాకర్ మారియో సినిమాటోగ్రఫీ: ఎస్ ఎన్ హరీష్ సొండెకొప్ప ఫైట్స్: డ్రాగన్ ప్రకాష్–రవి తేజ, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్: సంజీవ్ మేగోటి, ఆర్ట్ డైరెక్టర్: కేవీ రమణ,ఎడిటింగ్: అనుగోజు రేణుకా బాబు, మేకప్: విజయ్–శేఖర్, కాస్ట్యూమ్స్: నల్లపు సతీష్ ప్రొడక్షన్ డిజైనర్: కొండపనేని మురళీధర్.

## జూన్ 4న 'పెద్ది' రిలీజ్



రామ్ చరణ్ రూరల్ యాక్షన్ డ్రామా 'పెద్ది' షూటింగ్ మొత్తం పూర్తయింది. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ఈ చిత్రం జూన్ 4న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్‌లలోకి రానుంది. హైదరాబాద్‌లోని ఒక భారీ సెట్‌లో ఎఆర్ రెహమాన్ స్వరపరిచిన ఒక అద్భుతమైన స్పెషల్ సాంగ్ చిత్రీకరణను చిత్ర బృందం పూర్తి చేయడంతో అధికారికంగా షూటింగ్ పూర్తి చేసుకుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శర వేగంగా సాగుతున్నాయి. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా, శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేందు, బోమన్ ఇరానీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పెద్ది రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ ప్రెస్ మీట్ చాలా గ్రాండ్‌గా జరిగింది. ఈ ఈవెంట్‌కు బ్లాక్‌బస్టర్ డైరెక్టర్ సుకుమార్ హాజరై మాట్లాడుతూ ఉప్పెన క్లైమాక్స్ చూసినప్పుడు ఆ సినిమా తీసిన డైరెక్టర్ ఎలాంటి సినిమా అయినా చేయగలడు అనిపించింది. బుచ్చిబాబు పెద్ది కోసం మంచి స్క్రిప్ట్ రాశాడు. ఎమోషన్స్, కమర్షియల్ ఎలిమెంట్స్‌ని అద్భుతంగా బ్యాలెన్స్ చేశాడు. అలాంటి బ్యాలెన్స్ పట్టుకోవాలంటే చాలా అనుభవం ఉండాలి. పెద్ది లాంటి కమర్షియల్ ఎమోషనల్ రైడ ఈ మధ్యకాలంలో రాలేదు. జూన్ 4న సినిమా విడుదల అవుతోంది. హిందీ, తమిళ్, తెలుగు, కన్నడ, మలయాళ భాషల్లో రిలీజ్ అవుతుంది. హిందీలో జియో వారు విడుదల చేస్తున్నారు అని చెప్పారు. మూవీ డైరెక్టర్ బుచ్చిబాబు సానా మాట్లాడుతూ 'పెద్ది' ఏప్రిల్ 30న రానందుకు క్షమించండి. జూన్ 4న వస్తున్నందుకు ఆశీర్వదించండి. జూన్ 4న మీరు చూస్తారు అని చెప్పారు. ప్రొడ్యూసర్ వెంకట సతీష్ కిలారు మాట్లాడుతూ నా మొదటి సినిమాగా ఇంత పెద్ద సినిమా చేసే అవకాశం ఇచ్చినందుకు రామ్ చరణ్ కు రుణపడి ఉంటాను. బుచ్చిబాబు చాలా అద్భుతంగా సినిమా తీశారు. నిర్మాతగా చాలా హ్యాపీగా ఉన్నాను. జూన్ 4న సినిమా రిలీజ్ అవుతోంది. జూన్ 3 ఈవెనింగ్ అన్ని చోట్ల ప్రీమియర్స్ ఉంటాయని తెలిపారు. ఈ ప్రెస్ మీట్ లో డిఒపి రత్నవేలు తదితరులు మాట్లాడారు.

## కొరటాల శివతో బాలకృష్ణ చిత్రం



ప్రస్తుతం ఎన్ బి కె 111 చిత్రీకరణలో ఉన్న నందమూరి బాలకృష్ణ, తన తదుపరి ప్రాజెక్ట్ 112 చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. మిర్చి, శ్రీమంతుడు, దేవర లాంటి చిత్రాలను తెరకెక్కించిన దర్శకుడు కొరటాల దర్శకత్వం వహిస్తున్నారు. బాలకృష్ణ, శివ కాంబినేషన్‌లో ఇది తొలి చిత్రం. హై వోల్టేజ్ యాక్షన్‌ను సామాజిక అంశాలతో మేళవించే కొరటాల శివ, బాలకృష్ణ పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్‌కు సరిపోయేలా ఒక బలమైన కథను సిద్ధం చేశారు. పోస్టర్‌పై కనిపించిన ట్యాగ్‌లైన్ సినిమా ఎంత పవర్‌ఫుల్‌గా ఉండబోతోందో సూచిస్తోంది. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. నటీనటులు, టెక్నికల్ టీమ్ వివరాలు త్వరలో వెల్లడించనున్నారు.

## 'సతీ లీలావతి' ట్రైలర్ రిలీజ్



లావణ్య త్రిపాఠి కొణిదెల, దేవ్ మోహన్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'సతీ లీలావతి'. ప్రముఖ నిర్మాణ సంస్థ ఆనంది ఆర్ట్స్ సమర్పణలో దుర్గాదేవి పిక్చర్స్ బ్యానర్‌పై నాగమోహన్ ఈ చిత్రాన్ని నిర్మించారు. భీమిలీ కబడ్డీ జట్టు, ఎస్.ఎం.ఎస్(శివ మనసులో శృతి) ఫేమ్ తాతినేని సత్య దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని మే 8న వరల్డ్ వైడ్‌గా రిలీజ్ చేస్తున్నారు. ఈ క్రమంలో శనివారం రామ్ చరణ్ ఈ మూవీ ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఈ మేరకు నిర్వహించిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో లావణ్య త్రిపాఠి మాట్లాడుతూ మా కష్టం అంతా తెరపై ఆడియెన్స్ చూస్తారు. మంచి కథను నా వద్దకు తీసుకు వచ్చారు. 'సతీ లీలావతి' అద్భుతంగా వచ్చింది. ఈ చిత్రం కోసం నాగ మోహన్ చాలా కష్టపడ్డారు. నేను చిత్రీకరణ సమయంలో ప్రెగ్నెంట్ అని తెలిశాక టీం మొత్తం సపోర్ట్ చేసింది. దేవ్ సొంతంగా డబ్బింగ్ చెప్పారు. మా ట్రైలర్‌ను రిలీజ్ చేసిన మా బావ రామ్ చరణ్‌కి థాంక్స్. ఆయన రిలీజ్ చేయడం వల్ల మా ట్రైలర్‌కి, మా సినిమాకు రీచ్ పెరిగింది. మే 8న మా సినిమాని చూసి సపోర్ట్ చేయండి అని అన్నారు. దేవ్ మోహన్ మాట్లాడుతూ 'మళ్లీ తెలుగు ఆడియెన్స్ ముందుకు వస్తున్నందుకు ఆనందంగా ఉంది. మీ అందరితో పాటే నేను కూడా ట్రైలర్ చూశాను. మా ట్రైలర్‌ను రిలీజ్ చేసిన రామ్ చరణ్ కి థాంక్స్. మే 8న మా సినిమా రాబోతోంది అని అన్నారు. తాతినేని సత్య, నాగ మోహన్తాగుబోతు రమేష్ , సప్తగిరి , రైటర్ ఉదయ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.




## 'శరణమన్న శరణం' సాంగ్ రిలీజ్

హీరో తిరువీర్ నటిస్తున్న కొత్త సినిమా 'భగవంతుడు'. ఈ సినిమాలో ఫరియా అబ్దుల్లా హీరోయిన్‌గా నటిస్తోంది. కన్నడ నటుడు రిషి ప్రధాన పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాను పనస శంకరయ్య గౌడ్ సమర్పణలో రవి పనస ఫిలిం కార్పొరేషన్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెంబర్ 1గా నిర్మిస్తున్నారు దీనికి నిర్మాత రవి పనస. ఈ రోజు ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా ఈ చిత్రం నుంచి 'శరణమన్న శరణం' సాంగ్ రిలీజ్ చేశారు.శ్రామిక శక్తికి నమస్కరిస్తూ 'శరణమన్న శరణం' పాటను రూపొందించారు. ఈ పాట గురించి 'భగవంతుడు' మేకర్స్ స్పందిస్తూ మన మట్టిలో ప్రతి పని ఒక అమ్మ దేవత సాక్షిగానే మొదలవుతుంది. పొలం గట్టున నాగలి సాగేముందు 'పోలేరమ్మ'ను, చెరువు కట్టపై అలుగులు పోసేటప్పుడు 'గంగమ్మ'ను, కష్ట, సుఖాల్లో 'ఎల్లమ్మ'ను స్మరించుకోవడం మన శ్రామిక సంస్కృతిలో భాగం. ఈ అమ్మ దేవతలు శ్రామికుల చెమట చుక్కల్లో తోడుండే ధైర్య రూపాలు. మన సంస్కృతిలో అమ్మ దేవతల శరణుజొచ్చంది ఏ పనీ మొదలు కాదు. పూర్తి కాదు. ఇది నాగలి పట్టిన రైతు, సుత్తి పట్టిన కమ్మరి, చక్రం తిప్పిన కుమ్మరి... ఇలా సకల సబ్బండ కులాల శ్రమజీవుల గుండె చప్పుడు. తిరువీర్, ఫరియా అబ్దుల్లా, రిషిలతో పాటు రవీందర్ విజయ్, షెల్లీ కిషోర్, కాలకేయ ప్రభాకర్, చిరాగ్ జానీ నటిస్తున్నారు.

## 'సింగ్ గీతం'– జూన్ 11న రిలీజ్



లెజెండ్ డైరెక్టర్ సింగీతం శ్రీనివాసరావు తన కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్‌తో ముందుకు వస్తున్నారు. దశాబ్దాల పాటు సాగిన తన కెరీర్‌లో, పలు భాషల్లో దాదాపు అరవై చిత్రాలతో ఇండియన్ సినిమాని రీడిఫైన్ చేసిన సింగీతం 94 ఏళ్ల వయసులో డైరెక్టర్ చైర్‌లోకి తిరిగి వస్తూ, సృజనాత్మకతకు హద్దులు లేవని మరోసారి నిరూపిస్తున్నారు. మూకీ చిత్రం 'పుష్పక్' , 'ఆదిత్య 369', 'విచిత్ర సహోదరులు', 'మైఖేల్ మదన కామరాజన్' బెంచ్ మార్క్ సినిమాలుగా నిలిచాయి. ఇప్పుడు, భారతదేశపు మొట్టమొదటి మ్యూజికల్ ఫాంటసీగా రూపొందించబడిన 'సింగ్ గీతం'తో అలరించబోతున్నారు. ఈ చిత్రం సంగీతం, మ్యాజికల్ రియలిజంను మేళవించి ఓ యూనిక్ అనుభూతిని అందిస్తుంది. వైజయంతి మూవీస్, స్వప్న సినిమా బ్యానర్ల పై నాగ్ అశ్విన్ నిర్మిస్తున్నారు. ఒక రహస్యమైన గ్రామం నేపథ్యంలో సాగే 'సింగ్ గీతం', ప్రతాప్ అనే యువకుడి కథ చుట్టూ తిరుగుతుంది. అవకాశాల కోసం ప్రయత్నించే ప్రతాప్ జీవితం అనుకోని మార్గంలోకి వెళ్లుతుంది. కనిపించేదంతా నిజం కాని ప్రపంచంలోకి అతను అడుగుపెడతాడు. అభివృద్ధి, పరిరక్షణ మధ్య జరిగే సంఘర్షణలో చిక్కుకుని, తన నిర్ణయాలు, నమ్మకాలు, లక్ష్యాలను ప్రశ్నించుకునే పరిస్థితి వస్తుంది. యూనిక్ కాన్సెప్ట్, ఫాంటసీ కథనంతో 'సింగ్ గీతం' ఒక ప్రత్యేకమైన సినిమాటిక్ అనుభూతిని అందించబోతుంది. ఇది సింగీతం శ్రీనివాసరావు వినూత్న ప్రయాణానికి మరో మైలురాయిగా నిలవనుంది. ఆర్ట్ డైరెక్టర్ అరవింద్ మూలే క్రియేట్ చేసిన ప్రపంచం కథకి మరింత డెప్త్ ని తీసుకొస్తుంది. ప్రొడక్షన్ విల్యూస్ గొప్ప స్థాయిలో ఉన్నాయి. సింగ్ గీతం జూన్ 11న ప్రపంచవ్యాప్తంగా థియేటర్‌లలో విడుదల కానుంది.

# మల్టీజోన్-2 ఐజిగా బాధ్యతలు స్వీకరించిన షహనవాజ్ ఖాసీం



ప్రజాపక్షం/హైదరాబాద్:తెలంగాణ పోలీసు మల్టీజోన్2 ఐజిగా సీనియర్ ఐపిఎస్ అధికారి షహనవాజ్ ఖాసీం బాధ్యతలు స్వీకరించారు.ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహించిన షహనవాజ్ ఖాసీంను ఇటీవలే ప్రభుత్వం మల్టీజోన్2 ఐజిగా బదిలీ చేసిన విషయం తెలిసిందే.బీహార్‌కు చెందిన షహనవాజ్ ఖాసీం 2003 ఐపిఎస్ బ్యాచ్‌కు ఎంపికై ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణలో విధులు నిర్వహించారు.ముఖ్యమంత్రి భద్రత అధికారిగా, ఈస్ట్ జోన్ డిసిపిగా,ఇంటెలిజెన్స్‌లో కూడా బాధ్యతలు నిర్వర్తించారు.



నూతన డిజిపి సి.వి. ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన టిజెఎస్ అధ్యక్షులు, ఎంఎల్‌సి ప్రొఫెసర్ ఎం. కోదండరామ్. ఈ సందర్భంగా ఇరువురూ తెలంగాణ ఉద్యమ జ్ఞాపకాలను పంచుకున్నారు.

## రేపు కేబినేట్

(మొదటి పేజీ తరువాయి)

సమాచారం. పరిపాలనాపరమైన అంశాలపై చర్చతో పాటు 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' పథకం అమలు, జెడ్‌పిటిసి ఎంపిటిసి ఎన్నికలు, భూముల విలువ పెంపు, కొత్త పారిశ్రామిక భూకేటాయింపులు, కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ, వంద రోజుల్లో రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల చెల్లింపు విధానం, ప్రభుత్వంలో ఆర్‌టిసి విలీనం ప్రక్రియ తదితర అంశాలను మంత్రివర్గ సమావేశంలో చర్చకు వచ్చే అవకాశం ఉంది. వ్యవసాయం, సాగునీరు, ఉద్యోగ నియామకాలు, మౌలిక వసతుల అభివృద్ధి వంటి అంశాలు అజెండాలో ప్రాధాన్యం పొందే అవకాశం ఉంది. ఇక ఇటీవల జిల్లాల వారీగా కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై కూడా మంత్రులు నివేదికలు సమర్పించనున్నట్లు తెలుస్తోంది. అవసరమైతే కొత్త నిర్ణయాలు, విధాన మార్పులపై కూడా చర్చించి ఆమోదం తెలిపే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు.

## ధీమా లేదు

(మొదటి పేజీ తరువాయి)

వర్తిస్తుంది. ప్రధానంగా ఇన్సూరెన్స్ బ్రోకర్లు, రీఇన్సూరెన్స్ బ్రోకర్లు, థర్డ్ పార్టీ అడ్మినిస్ట్రేటర్లు, సర్వేయర్లు, లాస్ అసెసర్లు, కార్పొరేట్ ఏజెంట్లు, కన్సల్టెంట్లు ఉంటారు. ఈ మార్పుల వల్ల బీమా రంగంలోకి భారీగా విదేశీ వలధనం వచ్చే అవకాశం ఉంది. ఇది పోటీని పెంచడమే కాకుండా, కొత్త టెక్నాలజీని తీసుకురావడానికి, దేశవ్యాప్తంగా బీమా వ్యాప్తిని మెరుగుపరచడానికి దోహదపడుతుంది. అలాగే నియంత్రణ నిబంధనల ద్వారా వినియోగదారుల ప్రయోజనాలకు రక్షణ ఉంటుంది. కాగా, బీమా కంపెనీల్లో ఆటోమేటిక్ రూట్‌లో విదేశీ పెట్టుబడులను 74 శాతం నుంచి 100 శాతానికి పెంచుతూ పార్లమెంటు కొత్త బిల్లును ఆమోదించిన విషయం తెలిసిందే. సబ్కా బీమా సబ్కీ రక్షా బిల్లు పేరిట ఇన్సూరెన్స్ చట్టానికి సవరణలను పార్లమెంటు ఆమోదించింది. బిల్లుపై చర్చ సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇన్సూరెన్స్ రంగంలోకి మరిన్ని పెట్టుబడులు వస్తాయని, దేశ నలువలలకూ సేవలు విస్తరిస్తాయని చెప్పారు. ఈ రంగంలో పోటీ పెరిగి జర్లకు ఇన్సూరెన్స్ ప్రీమియంల భారం తగ్గుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

## ముమ్మాటికీ చెరువే

(మొదటి పేజీ తరువాయి)

చెరువు ఉన్నట్లు అధికారిక రికార్డులు వెల్లడిస్తున్నాయని చెప్పారు. బతుకమ్మ కుంట భూమి తనదేనని ఎడ్ల సుధాకర్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో, ఆయన వద్ద ఉన్నది కేవలం 1986 నాటి అన్‌జిస్టర్డ్ సేల్ అగ్రిమెంట్ మాత్రమేనని, అది చట్టపరంగా చెల్లుబాటు కాదని స్పష్టం చేశారు. చెరువును పూడ్చి వ్యవసాయం చేసినంత మాత్రాన యాజమాన్య హక్కు రాదు అని అన్నారు. సుధాకర్ రెడ్డి భూమిని చెరువుగా మార్చారనే ఆరోపణలు నిజం కాదని, తమ వద్ద ఉన్న ఆధారాలన్నీ కోర్టుకు సమర్పిస్తున్నామని తెలిపారు.

**ఆదేశాలను తాము అమలు చేస్తున్నాం..**

హైకోర్టు డివిజన్ బెంచ్ ఆదేశాలను తాము గౌరవిస్తామని రంగనాథ్ తెలిపారు. కోర్టు సూచనల మేరకు ఇప్పటికే అక్కడ ఏర్పాటు చేసిన బోర్డులు, ఇతర నిర్మాణాలను తొలగించామని చెప్పారు. అయితే, వరదల నివారణ చర్యలు చేపట్టేందుకు కోర్టు అనుమతి ఇచ్చిందన్నారు. సుప్రీంకోర్టు సూచనల మేరకు మూడు వారాల్లో పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయనున్నట్లు వెల్లడించారు. ఫాతిమా కాలేజ్ ప్రాంతంలో హైకోర్టు ఆదేశాల మేరకు ఎఫ్‌టిఎల్ డిమార్కేషన్ చేపట్టనున్నట్లు ఒక ప్రశ్నకు సమాధానంగా రంగనాథ్ చెప్పారు. ప్రైవేట్ లేదా ప్రభుత్వ పట్టా అనే తేడా లేకుండా చెరువులన్నీ ప్రజల ఆస్తేనని రంగనాథ్ అన్నారు. చెరువుల వద్ద తాత్కాలికంగా వ్యవసాయం చేసేందుకు మాత్రమే అనుమతి ఉంటుందని, కానీ వాటి స్వరూపాన్ని మార్చడం లేదా నిర్మాణాలు చేపట్టడం చట్ట విరుద్ధమని స్పష్టం చేశారు.

**ఆక్రమణలపై చర్యలు – వేల ఎకరాల రికవరీ**

కేవలం పేదల ఇళ్లనే కూలుస్తున్నారనే విమర్శలను కమిషనర్ రంగనాథ్ ఖండించారు. పెద్దల ఆక్రమణలను కూడా వదిలిపెట్టడం లేదన్నారు. హైడ్రా ఇప్పటివరకు మొత్తం 2,093 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుందని తెలిపారు. స్వాధీనం చేసుకున్న భూమి విలువ సుమారు రూ. 85 వేల కోట్ల విలువ ఉంటుందన్నారు. ఇందులో ఎఫ్‌టిఎల్ పరిధిలో 296 ఎకరాలు, ప్రభుత్వ భూములు 1606 ఎకరాలు, పార్కులు 92 ఎకరాలు ఉన్నాయన్నారు. ఆక్రమణదారులపై ఇప్పటివరకు 90కి పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని వివరించారు.

**పేదలకు పునరావాసం**

చెరువుల పరిధిలో నివసిస్తున్న పేదలకు ప్రభుత్వం డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లను అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో బాధితులతో సమావేశాలు నిర్వహించామన్నారు. సున్నం చెరువు, రామంతాపూర్ వంటి ప్రాంతాల్లో నివాసాలు కోల్పోయిన పేదలకు డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పేదవారికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పెద్దల ఆక్రమణల విషయంలో ఎక్కడా రాజీ పడటం లేదని, ముష్కిమ్ చెరువు, ఐలాపూర్ వంటి ప్రాంతాల్లో ముందస్తు నోటీసులతోనే చర్యలు తీసుకున్నామన్నారు. నగరంలోని వందలాది చెరువులను గుర్తించి, సిఎస్‌ఆర్ నిధులతో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సమావేశంలో అదనపు డైరెక్టర్ వర్ల పాపయ్య, అదనపు కమిషనర్ ఆర్. సుదర్శన్, ఎసిపిలు తిరుమల్, ఉమామహేశ్వర్ రావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# మాట తప్పితే రాళ్లతో కొట్టండి

(మొదటి పేజీ తరువాయి)

సాధ్యమా? అనే అనుమానాలు వచ్చాయని, ప్రస్తుతం ఆ రెండు పథకాలు అమలు జరుగుతున్నాయని కవిత గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ (టియుడబ్ల్యుజె) ఆధ్వర్యంలో బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లోని సురవరం సుధాకర్ రెడ్డి ఆడిటోరియంలో శనివారం కల్వకుంట్ల కవితతో శనివారం 'మీట్ ది ప్రెస్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మీట్ ది ప్రెస్ కార్యక్రమానికి టియుడబ్ల్యుజె అధ్యక్షుడు కె.విరాహత్ అలీ స్వాగతం పలుకగా, 'ది టైమ్స్ ఆఫ్ ఇండియా' సీనియర్ సంపాదకులు ఉడుముల సుధాకర్ రెడ్డి సమన్వయకర్తగా వ్యవహరించారు. టియుడబ్ల్యుజె ప్రధాన కార్యదర్శి రాంనారాయణ వందన సమర్పణ చేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు అడిగిన పలు ప్రశ్నలకు కవిత సమాధానమిచ్చారు.

బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో కెసిఆర్ చర్యల కారణంగానే తెలంగాణ రాష్ట్రంలో రెండు జనరేషన్లు నష్టపోయాయని, 'లాస్ట్ ఆపర్చునిటీ కాస్ట్' అనే అంశంలో ఆయన (కెసిఆర్) చేసిన తప్పులను మాత్రమే తాను ప్రశ్నించానని తెలంగాణ రక్షణ సేన(టిఆర్‌ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. బిఆర్‌ఎస్ నుంచి సస్పెండైన తర్వాత తాను ప్రజల మధ్యలో ఉండాలనే ఉద్దేశంతోనే రాజకీయ పార్టీని ఏర్పాటు చేశానని, తనకు బిజెపి డిఎన్ఎతో సరిపోదని, తెలంగాణకు అన్యాయం చేసిందే కాంగ్రెస్ అని,అలాంటి రాజకీయ పార్టీల్లో తాను ఉండలేనని స్పష్టం చేశారు. బిఆర్‌ఎస్ తనను సస్పెండ్ చేసే ముందు నోటీసులు ఇవ్వలేదని, కనీసం వివరణ కూడా అడగలేదని, కానీ అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ఎంఎల్‌ఎ రోహిత్ రెడ్డికి మాత్రం షోకాజ్ నోటీసులు ఇచ్చారని కవిత అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమానవీయంగా వ్యవహరిస్తూ, ప్రజలను ఇబ్బంది పెడుతుందని ఆరోపించారు. రానున్న వెయ్యి రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వాన్ని గద్దె దించుతామని, తాము అధికారంలోకి వచ్చాక, అమ్మ తరహా పాలన అందిస్తామన్నారు.




బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో జరిగిన అవినీతి,అక్రమాలపైన తానే స్వయంగా ఆధారాలతో సహా అప్పటి సిఎం కెసిఆర్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, ఆయన ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. సిద్ధాంతపరమైన విభేధాలతోనే తాను బిఆర్‌ఎస్ అధ్యక్షునిగా కెసిఆర్‌ను విమర్శించానని స్పష్టం చేశారు. తల్లిదండ్రులతో తనకు ఎటువంటి సమస్య లేదన్నారు.సిఎంగా కెసిఆర్ రాష్ట్రానికి, ప్రజలకు ఎంతో మేలుచేయాల్సి ఉన్నప్పటికీ, ఆదిశగా పని చేయలేదన్నారు. కృష్ణా, గోదావరి నీళ్లను సక్రమంగా వాడుకుంటే ప్రస్తుతం రైతుల చేతిలో రెండున్నర లక్షల కోట్ల రూపాయాల సంపద ఉండేదన్నారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.1.21 వేల కోట్లతో కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్ట్ కోసం ఖర్చు చేసినా కేవలం లక్ష ఎకరాలకు మాత్రమే నీళ్లు ఇచ్చారన్నారు. గ్రూప్ 1లో పేపర్ లీక్ అయిందని, కెటిఆర్ లాంటి తెలివైన ఐటి మంత్రి ఉన్నప్పటికీ ఎందుకు పేపర్ లీకైందని ఆమె ప్రశ్నించారు.

**ముందు తెలంగాణకు నిధులు తీసుకురండి..**

తనపై వ్యాఖ్యలు చేయడం కాదని ముందుగా ఈ నెల 10వ తేదీన తెలంగాణ రాష్ట్రానికి వస్తున్న ప్రధాని మోదీతో పాలమూరు ప్రాజెక్ట్‌కు జాతీయ హోదాను ప్రకటించాలని, తెలంగాణకు ప్రత్యేకంగా నిధులను విడుదల చేసే విధంగా చూడాలని బిజెపి ఎంపిలకు కవిత సూచించారు. ప్రజాస్వామ్యంలో ఒక రాజకీయ పార్టీ ఉండటమే పవర్ అని అన్నారు. పార్టీ అధికారంలోకి వస్తుందా?, లేదా? అనేది ఆరాజకీయ పార్టీ నడిపే వ్యక్తి సిన్సియారిటీని బట్టి ఉంటుందన్నారు. టిఆర్‌ఎస్ ఆవిర్భవించినప్పుడు ఆ పార్టీ జెండా మోసే వాళ్లు కూడా లేరన్నారు.

**భావసారూప్యత లేని పార్టీలో పొత్తులు ఉండవు...**

భావసారూప్యత కలిగిన రాజకీయ పార్టీలతో 'ఫ్రీ పోల్స్' పొత్తు పెట్టుకోవాల్సిన పరిస్థితి వస్తే, అందుకు తాము సిద్ధంగా ఉన్నామని కవిత స్పష్టం చేశారు. భావసారూప్యత లేని వారితో మాత్రం పొత్తులు పెట్టుకోబోమన్నారు. ప్రస్తుతం తమ దృష్టి మొత్తం తెలంగాణ రాష్ట్ర రాజకీయాలపైనే ఉందని, తమ భావజాలమే తెలంగాణ అని, జాతీయ అంశాల్లో తెలంగాణకు అన్యాయం జరిగితే స్పందిస్తామని ఒక ప్రశ్నకు ఆమె సమాధానమిచ్చారు. లొంగిపోయిన మావోయిస్టులు ఏదో ఒక రాజకీయ పార్టీలో చేరాలని కోరారు. వారిని టిఆర్‌ఎస్‌లోనికి కవిత ఆహ్వానించారు. తమ పార్టీ పేరు విషయంలో చాలా కుట్రలు జరిగాయని, వాటిని గమనించే పార్టీ పేరు విషయంలో తాము వ్యూహాత్మకంగా వ్యవహరించామన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com